# ప్ర గ తి గీ త

## * ఆద్యతన సాహితీ సప్తశతి *

ర చ యి త

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**

**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

**ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్, హైదరాబాదు - 500 084.**

**ఫోన్ నెంబర్ : 9440495887,9866115177**

# PRAGATI GEETA

(A collection of Telugu poems)

by **Dr.Nanduri Ramakrishnamacharya**

ప్రథమ ముద్రణ : 1977 (5000 ప్రతులు )

ముద్రణ పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్
హైదరాబాద్ -500084. Cell -9440495887.

: 2. నండూరి విద్యారణ్య స్వామి , ప్లాట్ నం .:154,
స్ప్రింగ్ విల్లా, జర్నలిస్ట్ కాలనీ, నిజాం పేట
హైదరాబాద్ -500090. Cell -9391028231 .

వెల : రూ.200/-.

సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# Preface

Kala Prapurna, Prof. G. J. SOMAYAJI
Retd, Chairman, Commission for Scientific &
Technical Terminology, Ministry of Education,
Government of India, NEW DELHI.

Dr. Nanduri Rama Krishnamacharya is a gifted poet of Modern Andhra. "PRAGATI GEETA"- the latest master piece from his pen is a great contribution to Modern Telugu Poetry signifying the confluence of the East and the West, the old and the new, the tradition and the innovation, the I

Ludicrous and the Sublime, all blended into ingenious harmony without any incongruity. Thirty five years ago, as the Editor of the Andhra University College magazine, I could discover his budding talents when he contributed an article on Pullipatalu which was later appreciated by the then Vice-chancellor of immortal memory Dr. C. R. Reddy. The present work - PRAGATI GEETA has developed into a huge tree with clusters of flowery thoughts of varied hues, rich in diverse fragrance.

The themes dealt with by the Poet are directly connected with the modern social conditions and the most up to date problems of the present day isms as well as the age old customs. Between opposites, Contraries and Contradictions, tweedledums and tweedledees, the Poet presents wondrous home-truths and puts them straight in the readers' mind. Between, Hell and Heaven God and Devil, Gold and Tinsel, Saint and Seductor, the poet travels with excellent familiarity and there is no corner in the World or subject under the Sun which he does not touch or adorn. His humour is pleasant, amusing and non-carping, yet creating an indelible impression on the mind.

The language is simple but superb, the vocables are like glittering gems of myriad hues, all strung into a luminous literary necklace. They are pure Telugu idioms falling into the mouth like hail of honey drops and, heard like the warbling notes of the cuckoo in the spring.

A rare gift it really is, to collect so much matter of quality and put it into such an enjoyable, yet instructive form.

I am sure the Poetic couplets of Pragati Geeta will reverberate across the intellectual horizons of Andhra for generations to come.

Dr. Krishnamacharya - is a Future Tense amongst the modern poets. Telugu Literature will reserve a coveted place for him amongst the galaxy of the illustrious poets of Andhra.

# అభివాదచందనం

శ్రీ మిరియాల రామ కృష్ణ

కృతులు వెలయించేవు

మతులు వెలిగించేవు

నండూరి వారింట నందివర్ధన మట్లు !

వెండి నవ్వులు పూలు విరజిమ్మినావు !

కృతు లందుకున్నావు.

నతు లందుకున్నావు!

కవితాప్రభాసమ్ము కలకంఠవాసమై

హవణింప మనసులో చివురించినావు !

రాజులా బ్రతికేవు !

ప్రోజుల్ని విడిచేవు !

సానుభూతి మిఠాయి సంభాషణల చేర్చి

వాణిహాసాలలో వడ్డించినావు !

తారల్ని కోశావు |

తోరణం చేశావు !

కీర్తిచంద్రుని రసస్ఫూర్తి నందిన మూర్తి

ముద్దు చూపులకొరకు మోజు పడ్డావు !

డబ్బు నార్జించేవు !

డాబు నిర్జించేవు |

తెలుగు పంతుల కేమి తెలుసులే అనువారి

కళ్లెర్రబడునట్లు కనిపించియున్నావు!

కార్టూన్లు చదివేవు !

కడుపుబ్బ నవ్వేము !

క్లాసికల్ మార్గాన్ని కాస్త పక్కకు పెట్టి

ప్రగతి గీతలు గీసి నిగనిగా మెరిశావు !

వచనం రచించేవు !

రచనం వచించేవు !

తీయటి జిలేబీని తిని పల్కినట్లుగా

తిక్కన్న శిల్పాన్ని తెలియజెప్పావు!

శ్రీమాను నండూరి

రామకృష్ణాచార్య

అందుకో నా డా డార్డు కాలేజి వా

రందించు అభివాద చందనమ్మును నేడు !

## అష్టావధాని - శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వరరావు

ధైర్యము రొమ్ము విచ్చినది; ధర్మము త్రాసున తూగె; అంచితౌ
చార్యము వ్రేళ్లు పాతుకొనె; దక్షత పీఠము వైచి నిల్చె; సత్
కార్యవినిర్వహమ్ము ఇలుగట్టి వసించెను; రామకృష్ణమా
చార్యుల గుండె లోతుల ప్రసన్నతలో, మధురానుభూతిలో.

* శ్రీ వంగల పార్థసారథి

మెరుపు తీగెలు మెదడులో మెరయుగాక !

గుండెలో క్రొత్త విలువలు పండుగాక !

చదువ నండూరి కృష్ణమాచార్య వర్యు

పద్య మొకటిండు ! ద్రాక్షాసవమ్ము వలదు !

సారమందు సాటి - నూరు కావ్యాలకు

ప్రగతిగీతలోని పద్య మొకటి;

భావి తరములకు జీవ పాథేయమ్ము

ప్రగతిగీత సుప్రభాత భేరి!

గీతకు దీటుగా ప్రగతిగీతను వ్రాసి జగద్ధితమ్ముగా
నీతికి నీతి నేర్పిన మనిషివి; కట్టితి వీవు సాహితీ
సేతువు క్రొత్త ప్రాతలను చేర్చి; భవత్కృషి - విశ్వ సంస్కృతి
జ్యోతిగ-సర్వదా-వెలుగుచుండును మానవతా పతాకమై.

# స్వగతము

---

తరపి వెన్నెల ఆణి ముత్యాల జిలుగు!

పునుగు జవ్వాజి ! ఆమని పూల వలపు !

మురళి రవళులు! కస్తూరి పరిమళములు

కలసి యేర్పడె సుమ్ము! మా తెలుగు బాస!

కోరి - సరస్వతీ మధురకోమల దివ్యపదంబు లొత్తి శ్రీ

కారము చుట్టి నెన్నుదుట కస్తురి పెట్టితి తోరణమ్ములన్

తారలతోడ కట్టితిని-నానుడి వెన్నెల దేవళమ్ములో

కారణ జన్మమై యెడద కానుక పెట్టెద తెలు తల్లికిన్ !

పొంగు కవిత గాదు  సంగీత రుతిగాదు !

దిక్కు గాదు - వేద ఋక్కు గాదు;

ప్రగతి గీత-నూత్న యుగ కింకిణుల మ్రోత

క్రొత్త ప్రొద్దు పొడుపు కోడి కూత !

నవ్వుటాలకొరకు నగ్నసత్యము చెప్పి

వెక్కిరింప వెళ్లి వేడ్క నాకు!

నవ్వు వెనుక దాగు నా వేడి కన్నీరు

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

ప్రగతిగీతలోని రమణీయ సూక్తముల్

సూరివరులు చెప్పినారు మున్ను;

రచన చేసినాడ రత్నాలు గుదిగుచ్చి

దార మెరువు తెచ్చి హార మొకటి.

మెచ్చవచ్చు మేటి మేధావులౌవారు

ప్రగతిగీతలోని పద్యములను !

మెచ్చనట్టివారి మెచ్చుకొందును నేను !!

మంచి కవిత అవతరించు రేపు.

సహృదయులకు కలుగ సద్యోరసస్ఫూర్తి

ఎడద _ పుడమి కవలి కెగురునట్లు

పద్య మల్లలేను విద్యుల్లతలు పేని

పిడుగు లురలి దెసలు పిక్కటిల్ల.

ప్రగతిగీత-చాటు పద్యాల పూదోట !

తేనె త్రాగవచ్చు తేటులైన !

సౌరభమ్ము గొనుడు దారి బత్తెము గాగ

దూర మేగు బాటసారులార !

* * * * * * * * * * * * *

* * * * * * * * * * * * *

# ప్రగతి గీత

## వెన్నెల వడగళ్ళు



## వి న్న ప ము

గీతకు దీటుగా - "ప్రగతి గీత" – రచించి - అపూర్వ కావ్య ని
ర్మాతగ - తెల్గు బాస మడి మాన్యములన్ - సరిక్రొత్త విత్తులన్
లేత మనస్సులన్ - ప్రతిఫలింపగ నాటితి నన్న గొప్ప ప్ర
ఖ్యాతిని గోరి కాదు - ధన కాంక్షకు గాదు - యుగ ప్రవక్తగా
నూతన నీతి నేతగ - మనుస్మృతి మార్చదలంచి కాదు; ఈ
భూతలమందు మానవుల బుఱ్ఱల బూజులు దుల్పి - సాహితీ
సేతువు - క్రొత్త పాతలను జేర్చి రచింపగ గోరి కాదు - ఈ
కైతల నేర్చి కూర్చితి - జగద్ధితమున్ మనసార గోరి - పై
పూత మెరుంగులున్ - పసరు బూతుల బుంగల రోతపాత భా
గోతము - గండు కోకిలల కూతలు - ఆమని ప్రేమ పొంగులతో
ఊత పదాలతో- అతిశయోక్తులతో విలసిల్లు ఏ రసో
పేత కవిత్వమున్ సిలువ వేసెడి కోరిక గాదు - జంగమ
ప్రేతల వంటి పేదలకు విప్లవ విశ్వ సజీవ సంస్కృతి
స్నాతక దీక్ష నిచ్చెడి ప్రచారము కోసము గాదు- వెచ్చనౌ
నేతులు త్రాగినారు;-నవనీతములన్ కడుపార మెక్కి- మా
తాతలు – పూర్వకాలమున - తక్కిన వారలు పస్తు లుండ - మా
మూతుల వాసనల్ జనుల ముద్దుల జేసెడి నేటి కంచు ప్రా
బ్రాతదనమ్ము గొప్ప దని ప్రస్తుతి చేయగ గోరి కా దికన్
శీతల చంద్రికా మృదుల శీకరముల్ పులకింప జేయగన్
కేతకి విచ్చి తావి గిలిగింతల తెమ్మెర మేలుకొల్పగన్-
ఆ తెలి మబ్బు నీలి తెర కవ్వల తోచిన వేగుజుక్కతో
ఈ తొలి సంజ కెంజదల ఈ ధ్రువతార అలంతి వెల్గులన్
లేత పసిండి క్రొందళుకు నిగ్గుల మా కవితా కుమారి ముం
జేతుల పెట్టు ముగ్గుల విశిష్టత చూపుట కా దికన్ - పృథక్
భూత చరిత్ర కాచి వడబోసిన పాఠములన్ విమర్శతో

పాతర త్రవ్వి వెల్వరచి భావి తరమ్ముల వారి గుండె మార్

మ్రోతల సందడిన్ - భువన మోహనముగ నినాదముల్ జగత్

జైత్రక దుందుభుల్ మొరయు శంఖ రవంబుల నవ్య సాహితిన్

జాతర —క్రొత్త ప్రక్రియగ చాటుటకోసము గాదు - ఎందుకీ

వ్రాతలు_గీతలున్_? వెలుగు బాటలు తీరిచి దిద్ది గుండెలో

లోతులు పాతులున్ తరచి లోకము పోకడ చూపి - నిల్పుతన్

శ్రోతల మానసాల చిరు జ్యోతులు మానవతా పతాకమౌ

హేతువు కోసమై జగతి యెల్లల నెల్ల - విశాల దృష్టి - ని

ర్భీతిగ_విశ్వతోముఖ గవేషణ సల్పు ప్రమాణ బుద్ధి సం

కేతముగా – సదా - ప్రగతి గీత – వెలుంగుత - తోలుచున్- ప్రజా

చేతములందు దూరు చిరు చీకటి నీడల గుడ్లగూబలన్,

న వ్వు

సుదిన మేది చెప్పు? శుభ ముహూర్తం బేది ?

నవ్వినట్టి క్షణమె| నర వరేణ్య !

నవ్వి నపుడు చెందు-నరుడు-జీవన్ముక్తి !

బ్రదుకు క్రుంగదీయు బరువు మరచి.

నవ్వువానితోడ నవ్వు ఈ జగమెల్ల!

ఏడ్చువాని తోడ ఏడ్వ రెవరు !

అప్పు పుచ్చుకొందు రానంద మైనచో !

శోక మెవడు కోరు లోకమందు?

హాస్య మివ్వగలదు ఆయు రారోగ్యముల్ ;

ఎదద వగల బిగువు సడల జేసి;

క్షణములోన పొందు సద్యః పర సమాధి

యోగి యగుచు నవ్వుచున్న వాడు

నిలువ నీడ లేక - నిరుపేద యగు గాక !

తిండి లేక పస్తులుండు గాక ఉండు గాక

ఉండు గాక ఘోర యుద్ధ రంగమునందు

నరుడు బ్రదుకలేడు నవ్వకుండ.

కొంతమంది నవ్వు – గుఱ్ఱాల సకిలింపు!

పంది అరుపు కొంతమంది నవ్వు !

ఏడ్చి నట్టులుండు ఈర్ష్యాళువుల నవ్వు.

వెక్కి వెక్కి నవ్వు వెకిలి వాడు.

వెల్లివిరిసినట్లు వెన్నెలల్ పువ్వుపై

విరియ దగును నవ్వు పెదవి పైన

ధ్వనిని చేయరాదు దంతాలు కనుపింప

సుడులు వడెడి బుగ్గ సొట్ట చాలు !

ఎంత సులువు - నవ్వు - ఎదుటి వారిని గూర్చి !
గేలి చేయ వచ్చు - గెలువ వచ్చు;
ఎదుటివారు- తన్ను ఎగతాళి చేయగా
తాను నవ్వు వాడు ధన్య జీవి !

ఆత్మనిష్ఠమైన అవహేళనముకంటె
జీవ చిహ్నమేది? సృష్టియందు?
అన్ని రోగములకు అమృతౌషధము - నవ్వు!
అంతరంగమునకు - ఆటవిడుపు.

నవ్వలేని వాడు నడపీనుగే సుమ్ము!
చావలేక బ్రదుకు జగతిలోన;
నరకమందు పడును మరణించుటకు ముందె
నవ్వగలుగు శక్తి నాశ మొంద.

జగతి - ఎవడు సర్వసంగ పరిత్యాగి ?
నవ్వుచున్న యట్టి నరుడు తప్ప !
బ్రదుకు బరువు మరచి పరిహాస రసికుండు
పొందగలడు ముక్తి బొందె తోడ.

కాదు హాస్య మనిన - గండ్రగొడ్డలి వేటు!
సూది కాల్చి పెట్టు - చురక గాదు !
తగులకుండ దెబ్బ - తరలు రబ్బరు బంతి !
మెదడు నిదుర బాపు మేలు కొలుపు !!

స్రుక్క జేయ దెపుడు సుకుమార హాస్యమ్ము
మనిషి మమత గాని - మనసు గాని'
పరిమళమ్ము గొలుపు పన్నీటి జల్లుగా
గుండె పులకరింప కురియగలదు !

**నరకములో నవోదయము**

సాంగో సాంగముగా నమస్త జగతీ సాహిత్య శోభా వియద్
గంగా స్నానము చేసి, దివ్య కవితా కల్యాణి సమ్యక్ కృపా
పాంగ జ్యోత్స్నల ఏ ఘనుండు బ్రదుకున్ పాలించె - ఆ వేద వే
దాంగ ప్రోజ్వల మూర్తి వీడె తృటిలో ప్రాణాలు హృద్రోగియై.

విష్ణు దూత లపుడు విద్వత్కవి వరేణ్యు
    ఆత్మ కొరకు చేరి రచట వేగ!
నరక భటులు వచ్చినారు హఠాత్తుగా
    ఉభయ పక్షములకు యుద్ధ మయ్యె !

వీర నరక భటులు విజయమ్ము సాధింప
    విష్ణు దూత లపుడు వినయ మొప్ప
విన్నవించినారు విద్వాంసు దరిజేరి;
    నతులు చేసి వివిధ నుతులు సలిపి.

వైకుంఠంబుననుండి వచ్చితిమి దేవా ! మిమ్ము గొంపోవగన్;
మాకా భాగ్యము లేదు; ఈ యమభటుల్ మమ్మిట్టు లోడించి రే!!!
మి కన్నుల్ పరికింపగా నవ నవోన్మేష ద్యుతిన్; మా కికన్
శ్రీ కైవల్య పదంబు చేర సెలవున్ శ్రీవార లిప్పింపుడీ!

అనిన అనుమతించె ఆచార్య పురుషుండు
    విష్ణు దూత లపుడు వెడలినారు;
పిదప - నరక భటులు పిలిచి విద్వాంసుండు
    పలికె - పరమ దీన వదను డగుచు

నాస్తికులకు గలుగు నరకంబు నాకేల?

వెడలి-చిత్రగుప్తు నడిగి రండు;

కవిత చెప్పి విశ్వ కల్యాణ దీక్షతో

పాప మెరుగకుండ బ్రదికినాడ !

అను_ఆ పండిత మూర్ధ

న్యుని గొని యమ కింకరులు మనో వేగముతో

జను సమ శీత విమాన

మ్మున జేర్చిరి నయ విహీన ముష్కర మతులై

అది-నరక లోకమున విమానాశ్రయమ్ము

సర్వ ఖేచర ప్రస్థాన సంగమమ్ము

అచట-దిగ్భ్రాంత మానసుం డగుచు దిగెను

పండితుండు విమాన సోపాన పంక్తి.

కనె_విద్వత్ కవిసార్వభౌముడు సదృక్ శైత్యోష్ణ సౌధాలలో

జన సందోహము శాంతి సౌఖ్యములతో సంతృప్తి జీవించు నూ

తన విశ్వంబును వీర కార్మిక మహా ద్రష్టల్ మహాస్రష్టలున్

వినుతుల్ సల్పు-మరో ప్రపంచము-మహావిభ్రాంత చేతస్కుడై

అతడు_భటుల నడిగె ఆశ్చర్య చకితుడై

"ఏది అగ్నికుండ మేడి యముడు?

నరకమునకు వచ్చు నాస్తికు లేమైరి?"

మారు పలికె నరక వీర భటుడు

వచ్చిరి నాస్తికోత్తములు - వచ్చిరి గొప్ప కవీంద్రు లెందరో
వచ్చిరి సార్వభౌములును - వచ్చిరి శిల్పులు -_విశ్వమంతయున్
మెచ్చగ మీ ధరాస్థలికి మే లొనగూర్చిన శాస్త్రకారులున్
వచ్చిరి - ఎందరో అనుభవజ్ఞులు మా నరకమ్ము లోనికిన్.

విశ్వ విప్లవ విజ్ఞాన వీర సమితి
నరకవాసులు స్థాపించినారు చేరి;
విప్లవమ్ము వర్ధిల్లె దిగ్విజయమౌచు
ప్రాణముల్ వీడె యమ ధర్మరాజు గారు.

పాతాళమును అంటు లోతైన బురదలో
అగ్ని గోళాల్ వేసి ఆర్పినారు !
నదుల నాజ్ఞాపించి నడల మార్చి క్రొత్త
పొలములకు పురుడు పోసినారు !

స్వేద జలమ్మును సింహ పీఠిక నిల్పి
పట్టాభిషేకమ్ము కట్టినారు !
విశ్వశాంతికి నవ్య విజ్ఞాన గరిమతో
సేన లొల్కగ పెండ్లి చేసినారు !

విశ్వ విప్లవ విజ్ఞాన వీర సమితి
విజయముల్ వాడిపోనట్టి విరుల వోలె
విశ్వ చరిత మకుటమందు వెలుగుచుండు
దశ దిశల్ పులకించు నెత్తావు లొలికి.

లేవు మహాగ్ని కుండములు; లేవిట కాగెడి తైలరూపముల్
లేవిట చిత్రహింస లిక లేవిట కత్తుల బోనులున్' విష
ప్లావిత ఘోర యంత్రములు - ప్రాత దినాలు గతించె; మేటి మే
ధావులు వచ్చి మార్చిరి గదా నరకమ్మును రత్నగర్భగన్

నాస్తిక ప్రవరుల నవ్య విజ్ఞానమ్ము
మార్చివేసె నరక మండలమును
గుర్తు పట్టలేని క్రొత్తరూపము తెచ్చి
సామ్యవాదమునకు జయము జయము!

వైతరణీ తమః పటలి వైద్యుత విప్లవ వల్లరీ స్థిర
జ్యోతులతో సదా వెలుగుచున్నది మా నరకమ్మునందు; మి
భూతలమందు మానవుల బుఱ్ఱల బూజులు పట్టి - క్రమ్మె - ము
త్తాతలనాటి నీతులకు దాస్యము చేసెడి చిమ్మచీకటుల్.

ఉజ్వలోజ్వలమగు ఊహ గానము గాక
నరక లోక మేది ? నాక మేది ?
చేయగలడు విశ్వసృష్టికే ప్రతిసృష్టి
కష్ట పడెడి పూజ్య కార్మికుండు"

నరక వీర భటుని సరస వాక్కుల వెంట
కొక్కురో యటంచు కోడి కూసె !
మేలుకొనెను నిద్ర మేధావి పులకించి
నవ యుగోదయమ్ము నాంది వినుచు.

**స్వర్గారోహణము**

స్వర్గ లోక మదిగో స్వప్న లోకము గాదు;
స్వర్గ మనగ రాదు! స్వప్న మదిగొ !
నిశ్చయింప నేల ? నేత్ర నిర్వాణమౌ !!
కావ్య కల్పనా జగత్తువోలె !

ఆకుల్ రాలని పూలు వాడని వసంతారామ హేమాద్రి పై
ఆకాశంబును దాకు రత్న మయ సౌధాంతర్విభాగమ్ములన్
రాకాచంద్ర నిభాననల్-నిలిచి అర్ఘ్యం బిచ్చుచున్నారు; సు
శ్లోకుల్ వచ్చిన వెంటనే కలికి క్రాల్ చూపుల్ నివాళించుచున్

జరుగుచుండె నపుడు స్వర్లోక సంగీతి
సకల గోళవాస సభలతోడ;
పుణ్య పురుషు డొకడు భూలోకముననుండి
వెడలి వచ్చె - మంచి యెడద తోడ.

అర్ఘ్య మిచ్చి నట్టి అప్సరోంగనఁ బిల్చి
భూ నివాసి అడిగె పులకరించి;
"కామధేను వేది? కల్పవృక్షం బేది?
వచ్చినాడ ఒక్క వరము వేడ"

ఏ వరమైన అడుగ మనె
భూవాసుని పారిజాత పుష్పాంజలియై
కై వారము సల్పుచు - స్వ
ర్లావణ్యవతీ లలామ లలితోక్తులతో.

"కామధేను విదిగొ ! కల్ప వృక్షము నీడ

అమృత సరసి దరిని నెమరువేయు!

శిల్పి - మయుని రచన- చింతామణి వితర్ది

సేద దీరు దీనిమీద సుంత."

అనిన - అధివసించి ఆ సాధు పురుషుండు

పలికె వనితతోడ తలను వాల్చి-

"సకల జనులు వసుధ శాంతి సౌఖ్యాలతో

ఓలలాడ గోరుచుందు నేను

భూకంపమ్ములు-అగ్ని పర్వతములున్-పుంఖాను పుంఖమ్ముగా

లోకుల్ చచ్చెడి దుష్టరోగములు చాలుంజాలు! సంగ్రామ ఝుం

ఝూ కీలాగ్నులు వేలు వేలు - మలిన స్వార్థ క్షుధా క్షోభతో

చీకాకై ధర క్రుళ్లిపోయినది ఛీ! ఛీ! చెప్ప సిగ్గయ్యెడిన్

ఆటము బాంబు రెక్కల జలాంతరగాములు కాలకూట దుష్

కీటక వాయు జృంభణము క్రిందులు మీదులు లేక సంగరో

చ్చాటన సల్పుటన్ బ్రదుకు చావుల దుఃఖ సుఖాల క్లిష్ట శృం

గాటకమందు నిల్చిరి జగచ్చరితంబున నేటి మానవుల్

"ఈ పెనుమంటిదిబ్బ వసియించి రొకానొకనాడు మానవుల్ !

పాపము!- శేముషీ విభవపారగులై ప్రకృతిన్ జయించి వి

శ్వాపర సృష్టి సల్పి - ప్రళయాంతకబుద్ధిని - గుండెలేక - ఆ

త్మాహుతిన్ వినాశనము నొందిరి మందిరి జ్ఞానశూన్యులై "

అనుచు-హత శేషమై అంత అవని మిగులు

ఏ పిపీలికలో రచియించుకొనును

కరుణ గీతులను తమ వాఙ్మయములోన

ఇయ్యది అవశ్య భవితవ్య మేమొ మాకు

పంచ భూతములను బంధించి ప్రాల్మాలి

ఎండమావులను వరించినాము!

చేసినాము విశ్వసృష్టికే ప్రతిసృష్టి !!

సుంత యేని మాకు శాంతి లేదు.

సమత- స్వేచ్ఛ-విశ్వ సౌభ్రాతృభావమ్ము

లెల్ల లెల్ల మరచి యేక మగుత !

వచ్చుగాక - వేగ-వసుధైక రాజ్యమ్ము

విశ్వ శాంతి వెల్లి విరియఁ జేసి".

అను ఆ భూవాసుని తి

య్యని కోర్కి గొలిపిన సంభ్రమాశ్చర్యములన్

తన ముఖమున అణచికొనుచు

వనిత సెలవివార నవ్వి వానికి అనియెన్

" విత్తనాలు స్వర్గ విపణిలో లభియించు

అమ్మబడవు ఫలము లమ్మబడవు!

పుడమి బాగుపడును పురుషకారము చేత

ప్రగతి- స్వర్గ మిచ్చు వరము గాదు".

**యోజన సుగంధి**

అనగా - అనగా - నివసిం
చెను మున్నొక కవి జగమ్ము జేజే వెట్టన్
మనసను వెన్నెల దేవళ
మున నిలిపెను కీర్తి యనెడి ముద్దుల కన్యన్

వెన్నెల దేవళ మందున
కన్నియ యోజనసుగంధి కనిపింపదులే!
క్రొన్నన నెత్తావులచే
ఉన్న దనుచు ఎల్లవార లువ్విళు లూరన్.

అతడు కవివరేణ్యు డతిలోక తేజస్వి
భావనాసమాధిబద్ధుడగుచు
చర్మ చక్షువులకు సాక్షాత్కరింపని
సత్యములను గాంచి సంతసించు.

బుసబుస లాడి పాల్కడలి పొంగె వెసన్ కెరటాల వెల్లి పై
విసవిస తేలియాడు అరవిందము వెల్వడి చేరవచ్చెడిన్
మిసమిస లాడు క్రొంబసిడి మీగడ వోని మిటారి మేనితో
కుసుమ లతాంగి తా కలికి కుల్కుల వన్నెల చిన్నె లొల్కుచున్

కాంచన కాంచికా మణి ధగద్ధగలన్ తరళోత్తరీయ చే
లాంచల మౌక్తికాభరణహారములన్ సవరించుకొంచు రా
యంచను మించు ఠీవి చిరు అందెల సందడిలో చలత్ చలత్
చంచల నేత్ర చేరె - కవి సన్నిధికిన్ - నడమించుతీవయై !

కలలు గనుచునున్న కవివర్యు మేల్కొల్ప

బుజము తట్టి మేను పులకరింప ;

చిబుక మెత్తి పలికె చిన్నారి పొన్నారి

వాలు చూపు లొలికి వనరుహాక్షి,

"లోకమెల్ల కోరు నా కటాక్షములనే !

స్పర్శ సుఖము చాలు జగతి గెలువ

ధ్యాన ముద్ర విడచి తలయెత్తి నను఼ జూడు

కలము విసరి వేసి కవివరేణ్య !

బ్రదుక డెవడు నన్ వీడి నా బానిసీడు

నరుడు పీఠాధిపతి జగద్గురుడు గాని !

సర్వ సంగ పరిత్యాగి సైత మంతె!

ఇక - ఒక గృహస్థుగూర్చి వచింప నేల ?

చాలు ! కవీశ !_నన్ చపల చారిణిగా తల పోయుదే! వచ

న్ శ్రీలలితుండ వంచు నిను చేరిన చూడవు - పేరుగొప్ప !- తో

మాలలతో సజీవపు సమాధిని గట్టు – జగత్తు - నీకికన్ !

మేలు- భళీ- భళీ తుదకు మేల్కొని నన్ను భుజించినన్ వృధా!

ఏరా ! మౌనము బూనినాడ వికె ఇంతేనా ప్రగల్భాలు - సం

సారమ్మున్ మధియించి నట్లు మృదువాచాలత్వ మింకేల ? పో

పోరా ! విశ్వజనీన వాఙ్మయముతో పొట్టన్ సదా నింపుకో

నేరంజాలవు; ఉద్ధరింపగలవా ? నీ వీ ధరిత్రీస్థలిన్ ?

నమ్ము_నమ్మబోకు_నా దయ యున్నచో

స్వార్థపరుడు దేశభక్తు డగును

అగును లొట్టిపిట్ట అందాల కాణాచి

పామరుండు గొప్ప పండితుండు

ధరలో నా దయ సోకిన

నరుడే చతురాస్యు డగును నాయకవరుడౌ

వరదుడు - రసిక వతంసుడు

సరసుడు పురుషోత్తముండు సర్వజ్ఞు డగున్

కరుణ లేని శుద్ధ కర్కోటకుండు గాని

పందగాని_యెట్టి పాపి గాని

సకల ధర్మ వుడిగి శరణు చొచ్చిన నన్ను

అభయ మిచ్చి వాని ఆదరింతు.

ఎంతటి నీచుడైన_మరి యెట్టి నిరక్షర కుక్షియైన_అ

త్యంత దురంత ఘోరమగు హత్యలు సల్పు నరాంతకుండు—దే

వాంతకుడై న_దేశమును అమ్మెడి దుర్మతియైన- నిశ్చల

స్వాంతముతో ననున్ గొలువ వానిని తప్పక ఉద్ధరించెదన్

నీతి-నియతి_లేదు మాతాపితలు లేరు

సుతులు బంధుజనులు హితులు లేరు

మంచి చెడ్డలేదు-మద్భక్తవరులకు

ఏను గలుగ వారి కేమి వలయు ??

పోయినదేమి నే వెడలిపోయెద వచ్చిన దారి బట్టి నీ
ప్రేయసి కీర్తికన్యక - వరించితి వీవొక బుద్ధిహీననే!
ఆ యవివేకురాలి హృదయంబు నెరుంగవు; నీదు ప్రాణముల్
పోయిన పిమ్మటే ఒలకబోయును ఆవిడ ప్రేమ నీ పయిన్

అందము చందమున్ తెలిసినట్టి కనుల్ గలవంచు నెంచి నీ
ముందర నిల్చి నే నిటుల ముచ్చట లాడితి మౌన ముద్రతో
మంద మనోజ్ఞ హాస ముఖ మండల మెత్త వటంచు పల్కి- ఆ
యిందిర మాయ మయ్యెను కవీంద్రుడు మేల్కొనె పుల్కరించుచున్

కానుపింపలేదు_కలశపాథోరాశి !
కాంచనాబ్జ మందు చంచలాక్షి !
కవివ రేణ్యు డంత కనుదోయి విప్పార
చెంతనున్న కలము చేతఁబట్టె.

వెన్నెల_పుల్కరింప, నెరవేనలి మల్లెల చెండు నవ్వ-నీ
సన్నిధి కేగుదెంచె- అభిసారిక- యోజనగంధి- ప్రౌఢ వి
ద్వన్నుత- నిన్ వరించి కవితా లలితాంగి - యశోవిశాల_నీ
కన్నుల సన్న - కాళ్ల చిరు గజ్జెల సవ్వడి మోసులెత్తగన్.

**వేగుచుక్క**

కన్నుదోయి కాదర్శముల్ కాంతి గొలుప
ప్రగతి వర్ధిష్ణు వా హిమనగము చేరె;
దెసల - ఝుంఝూనిలమ్ము ప్రతిధ్వనింప
అలకనంద మందాకిని చలికి వణకె

సంజ కెంజాయలో భుజస్కంధ మందు
తాల్చె - తల వంపనట్టి పతాక మొకటి
ఉన్నతి - మ హొా న్నతి_మహా మ హొాన్నతి యను
అక్షరమ్ములు రెప రెప లాడె చదల

వేరే కోరిక లేవి లేని కవియై విశ్వంబు మేల్కొల్పగా
వీరావేశము రూపు దాల్చిన మహావిజ్ఞాన తేజస్వి - ఆ
ధీరోదాత్త దిగంబరుండు నడచెన్ దిజ్మాత్ర గమ్యుండుగా
తారాతోరణముల్ వెలార్చు చిరుజ్యోత్స్నల్ దారిచూపింపగన్

పాడె నాతడు శ్రుతి గల్పి ప్రగతి గీతి
మూగవోయిన రణభేరి మ్రోగ తిరిగి
వినిన వారెల్ల అతిలోక వీరుడనుచు
పట్టి రారతుల్ జేజేలు పెట్టినారు

పిడికిలి బావుటా దెసల వెల్గులు బాటలు తీర్చి దిద్దగన్
నడచె గభీరభావుకుడు నవ్యయుగోదయ సృష్టికర్త - తా
విడిచిన వేడి యూర్పు పృథివీ చిర వేదన కంతరార్థముల్
నుడువగ వెన్క చూడని కనుల్ ప్రసరింపగ పండు వెన్నెలల్

ఆ మహాభాగు దారిలో అడ్డు నిలిచి

నవ్య లావణ్య లహరి కన్యక యొకర్తు

వలచి వలపింప జూచుచు పలికె నపుడు

చిర్న గవు బుగ్గ సొట్టలన్ చిందు లాడ

“ఓ మహనీయతా ప్రియమహొా దయ! పావన సాహస క్రియా

భూమిక వీడి తీపి వలపుం గలలన్ గనుచున్న నాడు వ

క్షోమృదుశయ్యపైన శిరసున్ వడి వ్రాలిచి విశ్రమింపు - నీ

మోమున తాండవించు నవమోహన విశ్వజనీన శౌర్యముల్"

వేడి వేడి నిట్టూరుపుల్ విడిచి విడిచి

"ప్రగతి - ప్రగతియే - సుమ్మ నా వలపు గత్తె"

అనుచు పల్కి - కవోష్ణ బాష్పాంబువృష్టి

తరలె తల యెత్త కా ప్రియదర్శనుండు

ప్రకట పతాక రమ్య భుజ బార విభాసుర చారు మూర్తియై

చక చక సాగిపోయె- యువ సంయమి, శంఖమునొ త్తి యూదుచున్

సకల చరాచర ప్రకృతి స్థైర్య సముద్రున కంజలింపగన్

నికట గుహాంతరమ్ముల ధ్వనింప పురోగతి బుజ్జి నాదముల్

ముఖమున త్యాగయోగి తెలిముత్తెము లొల్కెడి లేత నవ్వుతో

శిఖరము పైన నిల్చి దరిసించెను దవ్వుల పట్టణమ్ములన్

సుఖమయ భోగభాగ్యములు శోభిలుచున్న గృహప్రదీపికా

శిఖల వెలుంగు బింబములు చిమ్ము హిమాలయ పర్వతాగ్రముల్

కొండ కొమ్ములపై నుండి కూలుచుండె
మంచు బండలు గంగలో మారు మ్రోగి
పయనమైపోయె దుర్గమ పథముబట్టి
పగులువారని గుండెతో బాటసారి

తల నరసిన యొక ముదుసలి
పలికె అతనితోడ సెలవి వారగ నగుచున్
"నిలు ! నిలు ! నిలు ! మానవ మా
త్రులు పోజాలని తెరువులు త్రొక్కగ నేలా ?

జలపాతమ్ములు నిమ్న నిర్ఝ రులు ఝంఝామారుతమ్ముల్- హిమ
ప్రళయాఘాతములున్ భయంకర తమో రౌద్ర స్ఫురన్మేఘ గ
ర్జలు శార్దూల మదేభ ఖడ్గమృగ సంచారమ్ములున్ దాటి పో
గలవా? జీవ సమాధి తప్పదు – పురః కాంక్షారతిన్ బోయినన్

శంఖము నూదుచున్ ప్రగతి సంహిత నోట జపించుచున్ - దిశా
ప్రేంఖ దుదార సాహస గభీరుడవై అవరోధ భావనా
శృంఖల లూడ్చివైచుచు విజృంభణ సల్పుటయా? 'శరీర మా
ద్యం ఖలు ధర్మ సాధన' మటన్న సుభాషిత మాలకింపవే!!

తరళ హాసమ్ముతో పల్కె - ధన్యజీవి
"చనెద వెనుకంజ వేయ నేరని నదివలె;
కలదు - గమ్య మున్నతము - ఆకాశ రీతి
ప్రగతి జగతిని మృతజీవి యగుట మేలు

చిమ్మ చీకటుల్ - జగమెల్ల - గ్రమ్ముగాక !

నన్ను-ధ్రువతార-ముందుకు నడపగలదు !

దారి సాంతముగా చూడగోర నేను

అడుగు వేయ ముందడుగు కన్పడిన చాలు !

ముందడుగు వేయు టొక్కటే ముఖ్య" మనుచు

ప్రగతి గీతా ప్రవక్తయై పలికి అతడు

పుడమి కవ్వలి వెల్గులు పులకరింప

కదలిపోయె సదా పురోగామి యగుచు

కాంచనగంగా శిఖర

ప్రాంచత్ పౌరాణిక ఋషి - ప్రత్యూషములో

సంచారము సలుపగ విని

పించె ప్రగతి వేద దుందుభి ధ్వానమ్ముల్

అంధ తమస్సులోఁబడి ప్రయాణ మొనర్చి, పురోగతిన్ భుజ

స్కంధమునందు మోయుచు ధ్వజమ్ము-ప్రఫుల్ల సహస్రపత్ర సౌ

గంధిక నేత్ర యుగ్మ రుచి కన్పడె వేకువ- ధర్మశూరతా

సింధువు కంఠ దఘ్నము - సజీవ సమాధిని చెంది మంచులో

అతని ఆత్మ జ్యోతిర్వలయమ్ము చేరె

నాటినుండి యుగయుగాల నేటివరకు

తొలియుషస్సుల నెరసారు లొలుకుచుండు

వేగు చుక్కయై వినువీథి వెలసె నతడు.

సామ్యవాది

అశ్వరాజ మెక్కి అల - అలగ్జాండరు

వెడలసాగె _ రాజ వీధి వెంట ;

భావి విశ్వ విజేత పయనించుచుండగా

ఎదురు పడెడివార లెవరు గలరు ?

వింత గొలుపు పండు వృద్ధు - డయోజినిస్

వెడలసాగె రాజవీధి వెంట

సకలజనులు నవ్వ ఒక కాగడా

పట్ట పగలు చేత పట్టుకొనుచు

అశ్వ మాపి అడిగె-ఆశ్చర్యమును చెంది

రాజసమ్ముతోడ రాజ సుతుడు

“గోచి పాత కావి కొల్లాయి గుడ్డతో.

వెడలనేల ? రాజవీధి వెంట ?

తెల్లని గడ్డమున్–పగటి దీపము నప్పవు; జ్ఞాన దీప్తి వి

ద్యుల్లతయై-సదా మెరయుచున్నది మీ కనుదోయిలో !-ఎటుల్

చెల్లు? అపశ్రుతుల్ గొలుపు చేష్టలు మీకు ! జగద్ధితమ్ముగా

వెల్లడిచేయ వేడెదము వింత ప్రవర్తన కంతరార్థముల్ "

అని_గుఱ్ఱము డిగి నడచుచు

వినయములోడ జగదేక వీరుడు పలుకన్

వెనుకకు మరలక గొంకక

మునివరుడు పలికె రాజముఖ్యునితోడన్

"నాకు దొరకలేదు ఈ కంచు కాగడా

పెట్టి వెదకి వెదకి విసిగినాడ

భూతలమ్ము నందు - నీతి నిజాయతీ

ఉన్న మనిషి మచ్చు కొక్కడైన !

తప్పదనుభవింప దైన్యము - పెక్కండ్రు !

ఒక్క డనుభవింప ఉన్నదెల్ల !!

తనకు తాను సుఖము తగ్గించుకొనువాడు

త్యాగ యోగి పరమ ధర్మ దాత

వేసినాడ వీవు_విలువైన వేషమ్ము

వేయిమంది పెట్టు వెక్కసముగ ;

వందమంది ప్రజల వస్త్రహీనుల జేసి

వేయ నేల గొప్ప వేష మొకడు ?"

అనుచు-గొణిగి కొనుచు ఆ వృద్ధ వేదాంతి

వేగ వెడలిపోయె ఆగకుండ

రాచ బిడ్డ పడుచు ర క్తమ్ము పొంగార

అంతి పురికి నరిగె అశ్వ మెక్కి

లేత వయస్సులో ఎదురు లేని పరాక్రమశాలియై - పరా

భూతి యెరుంగనట్టి నెఱ పోటరి యోజన సేయుచుండె ఆ

రాతిరి చాలసేపు నిదురన్ విడి వృద్ధ తపస్వి గుండెలో

లోతులు గాంచు నెమ్మనము లోపలి కోరిక సందడింపగన్

తొందరింప ఎడద తొలిఉషస్సులలోన

పాదచారి యగుచు పార్థివుండు

వెదకికొనుచుపోయి వేదాంతి నివసించు

జీర్ణ పర్ణశాల చేరె తుదకు

పండితుఁజూడగా-ఉదయభానుని తేజము చిందు ఆ అలగ్

జాండరు వచ్చి నిల్చె; - తెలిగడ్డము మీసల-ఎండుగడ్డితో

నిండిన తొట్టెలో - ఎదురు నిల్చిన పార్థివు చూడకుండగా

ఎండను కాగుచుండెను మునీంద్రుడు అర్ధదిగంబరుండుగా

చాలసేపు నిలిచి చక్రవర్తిసుతుండు

పలుకరించనట్టి పండితునకు

చేరినట్లు తెలిపె జిజ్ఞాసువై - తాను

పాదచారి యగుచు భ క్తితోడ

"ఋషి - జగద్గురుండు - శ్రీ అరిస్టాటిలు

మానసిక సుతుండు - మానధనుడు

చక్రవర్తిగారి శారీరక సుతుండు"

తత్త్వ మరయ తాను తరలివచ్చె

ఆసనమ్ము నిడక – స్వాగతం బనకుండ

పలికె నతనితోడ పండితుండు,

“రైతుబిడ్డ గాని రాజపుత్రుడు గాని

లోకమెల్ల చూడ నాకు ఒకటె

రైతు ఎముకలైన రాజుగారివియైన
ఒక్కప్రోగు చేసి ఉంచినపుడు
వేరు చేయ గలవె విభజించి చూపించి
మిడిసిపాటు లెల్ల మిధ్య సుమ్ము

జనన మంది నపుడు జనులెల్ల సము లయా
దొర యెవండు? మరియు తొత్తు లెవరు ?
పిదప - సంఘు మేల పేను శృంఖలములు
స్వార్థబుద్ధితోడ జగతి పొగుడ

పాండిత్యంబును వీడి నీ మనసులో భావించు - నా గోచి నీ
జెండా గుడ్డగ చేసిచూడుము - జగజ్జేగీయమ్మై వెల్గు - రాడ్
దండంబే వెడ కావడైనపు డ వస్త్రాభేద సాపేక్షమ్మై
కుండల్ మోయును రాయి దేవుడుగు ఏకుల్ మేకులౌ ధాత్రిలో

ఒకని చంపువాని కురిశిక్ష పడవచ్చు!
వేల కొలది చంప వీరు డగును!!
సిగ్గు ఎగ్గులేక సింహాసనం బెక్కి
హింస - విశ్వమెల్ల ఏలుచుండె !

హంసియానలు - ఛత్ర చామర రథాశ్వాందోళికా సంతతుల్
సంసారాయణమందు వన్య మృగతృష్ణా మగ్న సంకేతముల్ !
హింసావృత్తిని వీడ నప్పుడు - జగత్సృష్ట్యాది వేదాంత మీ
మాంసాసారము-మిధ్య-శూన్యము - మదోన్మత్తప్రలాపార్తియే !

ఆక్రందనముల కధ్యాహార సంక్లప్తి !

వేడి నిట్టూర్పు కామ్రేడితమ్ము !

వికట నాటక ధారణకు ప్రతిచ్ఛందమ్ము!

అభినయముల కభిధాంతరమ్ము !

కలవరించు అపశ్రుతుల కనుప్రాసమ్ము !

జాడ్య జర్జర జుగుప్సలకు విప్స!

ఆశా పిశాచ నృత్యములకు అనుభాష !

భ్రమకు - వేదాంత పర్యాయ పదము !

అర్థ మేమి బ్రదుకు కాభాస జగతిలో ?

తెరలకు వెనుక ఎవరొ దరువు పాడి

తప్పు తాళమునకు తైతక్క లాడించు

తోలు బొమ్మలాట తుట్టతుదకు"

అనుచు - చెప్పుచుండ ఆ వృద్ధ వేదాంతి

వీనులొగ్గి వినిన వీరవరుడు

మెచ్చికోలు తెలుప మేధావితో బల్కె

కన్ను లెత్తి అతని కలయజూచి

"నచ్చిన - నచ్చకపోయిన

మెచ్చక తప్పని తలపులు మెదడున మెరసెన్ ;

వచ్చితి నిను చూచుటకే

ఇచ్చెద కోరుకొను మింక ఏ వర మైనన్"

అనుచు - రాజసుతుడు ఔదార్య మొప్పార

పలికె, రాజఠీవి నొలకబోసి ;

విరియ - పిన్న నవ్వు - వేదాంతి పెదవిపై

పలికె - విశ్వచరిత పులకరింప.

“చెప్పినాడ నేదొ - జిజ్ఞాసుడవుగాన

ఎండ తగులకుండ నింతసేపు

నిలచినాడ వడ్డు తొలగి పొ మ్మదిచాలు !

ఎండ కోరుకొన్న నీయలేవు" .

అనెడి - మాట లతడు ఆశ్చర్యచకితుడై

ఆదరమ్ముతోడ అవధరించి

వినయ మొప్ప పలికె వీడ్కోలు గైకొంచు

భావి విశ్వ జేత - ప్రక్కకొదిగి

"పండిత చక్రవర్తి! విను పల్కెద నా హృది విప్పి ఏ నలగ్

జాండరు సార్వభౌమునిగా గండరగండడనై విశాల భూ

మండల మేలకున్న - అభిమాన తపస్వి డయోజనీసునై

యుండెడి వాడనో ప్రియమ హెూ దయ నేనిక పోయివత్తునా"?

**కవితా కైవల్యము**

ఉన్నా వందురు ! - నిను కను
గొన్నా మందురు నిజముగ కొందరు ఋషులే !
ఉన్నావో ! లేవో ! త్రిజ
గన్నాయక ! - కవిత - నాకు కైవల్యంబే !!!

తోమాల నీ కంఠసీమ వేయగనేల ?
తారా తరళ రత్న హార మదిగో !
ప్రమిద దీపాల ఆరాధన లిడనేల ?
రవి చంద్ర గోళాల రశ్ములవిగో !
కుంభాభిషేకమ్ము కోరి చేయగనేల?
బ్రహ్మాండముల కాంతి వర్ష మదిగో !
కర్పూర హారతుల్ కైంకర్య మిడనేల ?
జ్యోతిర్విలాస విద్యుత్తు లవిగో !

సార్వభౌముడవౌ జగత్ స్రష్ట వీవు !
అవని-భవదీయ దివ్య సింహాసనమ్ము !
ఆకసమ్ము నీ కాణి ముత్యాల గొడుగు !
ఏను నీకేమి ఉడుగర లియగలను ?

వేదాంత సారమ్ము వాదింప నగు గాని !
ఎవరు తెల్పిరి చిట్ట చివరి గుట్టు ?
కడలి లోతులు దూరి గాలింప నగు గాని !
దొరికినట్టివి కొన్ని గులక రాళ్లు !

అణు గర్భమును చీల్చి అరయవచ్చును గాని

మేటి రహస్యముల్ మిగిలియుండు!

రోదసీ గోళాల పాద ముంచుటె గాని

ఆకాశ మిక కొంత అవలి కరిగె !

ఎంత వెదకిన నాకు - కన్పింప వీవు !

ఏను నీ తావు చేరుకో లేను! తండ్రి;

కాన-దయచేసి-నీవె నాకడకు రమ్ము !

గుండె తలుపు తెరిచి వేచియుండగలను.

మాటలు వేయు నేల ? - ఇక మానవతా హృదయమ్ముతో -జగ

న్నాటక సూత్రధారి ! - శరణమ్మును వేడగ లేను నిన్ను ఆ

ర్భాటముచాలు!-క్రొంజిలుక పల్కులు పల్కుచు తావులొల్కుపూ

దోట వసింపనిమ్ము- ఒక- తొమ్మిది చిల్లుల తోలు బొమ్మగన్

**జ్ఞానదీప్తి**

మేలి సుఖము లెల్ల మీసాల తేనెలే !

పదవి - పూత పసిడి పంజరమ్ము !

ధనము - పెంచుకొన్న పెను త్రాచు పా మౌను

జ్ఞాన దీప్తికి భువి సాటి లేదు !

జ్ఞాన మొకటే - ఒసగు-సచ్చిదానందమ్ము

విశ్వజనుల కెల్ల శాశ్వతముగ ·

ప్రకృతిమీద ఆధిపత్యమ్ము సాధించి

సృష్టి కపర సృష్టి చేయగలదు !

అధిగమించు—జ్ఞాన మాకాశ గోళాల ;

అణువు డొక్క చీల్చి అరయగలదు ;

విశ్వ మెల్ల వెదకు ! విభజించు లిప్తనే!

వెలుగు పరుగు లెక్క వేసి చూపు !

అగ్ని పర్వతములు ఆవులించక ముందు

ప్రేగు లెల్ల లెక్కపెట్ట గలదు ;

కడలి కడుపు దూరి గాలించి దిగివచ్చు;

మనిషి గుండె మార్చి మరల అతుకు !

ఏ ప్రయాస గాని ఏ ప్రమాదము గాని

జ్ఞాన తృష్ణ యెపుడు సరకుగొనదు;

సృష్టి యనెడి దివ్య సింహాసనమునుండి

దేవుడనెడి వాని దింపగలదు.

**కోటిశ్వరుని కుక్క**

జనము బెదర వీచె - చలి గాలి కెరటాలు
శీత శిఖరినుండి సేతు తటికి !
వేయి మంది ఒక్క బిహారు లోపలే
చచ్చిపోయినారు చలికి - బిగిసి !

కూర్మితోడ గొప్ప కోటీశ్వరుడు పెంచు
కుక్క పిల్ల చలికి నక్కె మూల;
గస్తి తిరుగ లేక గజగజ వణకెడి
కుక్క జూచి అతని గుండె కరగె !

కుక్క పిల్ల కొరకు కుట్టించె ఒకకోటు
పట్టు వంటి ఉన్ని బట్ట పెట్టి,
పసిడి గొలుసుతోడ పచ్చల మొలత్రాడు
వేలకొలది ఖర్చు పెట్టి కట్టె !

కుక్క తప్ప ఎవరు కోటీశ్వరుని పైన
నిక్కమైన కూర్మి నెరపువారు ?
వలపుకత్తె పడుచు భార్య తన్నెన్నడో
లెక్క సేయకుండ లేచిపోయె !

కుక్కపిల్లతోడ కోటీశ్వరుడు మేడ
వదలలేదు తెల్లవారు వరకు
తెల్లవారినంత దినపత్రికలు లేవు
చచ్చినట్టివారి సంఖ్య తెలుప,

కానరాడు - నాడు-కారు డ్రైవరు గూడ

వచ్చువాడు తెల్లవారి నంత

అతడు గుడిసెలోన అసువులు విడనాడె

చెప్పె - చావుకబురు సేవకుండు.

చంపివేయగలవె ఝుంఝూనిలమ! నీవు !

తలుపు మూసుకొనిన ధనికు నెవని ?

కప్పుకొనగ మంచి దుప్పటి కరవైన

పేదవాని పీకె పిసుక గలవు !

గాంధిగారి విశ్వకల్యాణ మేదయా !

బుద్ధుడేల పుడమి పుట్టినాడు ?

ఏల-సిలువ పైన ఏసు నెత్తురు లొల్కె ?

పేదవారి కేమి పెంపు గలిగె ?

భరత ఖండమందు నిరుపేద గుడి సెలో

మనుజ జన్మ మెత్తి మసలుకంటె,

కుక్క జన్మ - మేలు ! కోటీశ్వరుని ఇంట

భరత దేశ మెపుడు బాగుపడునొ !!

_మాతృక ఒక అమెరికను కవిత.

[అమెరికాలో బీదవారి దైన్యమును చిత్రించిన కవితామాతృక వెలువడగానే అచటి శాసనసభ్యుల హృదయములు కరగి పేదల శ్రేయస్సునకై క్రొత్తచట్టములు వెలువడినట్లు తెలియు చున్నది.]

**తిక్కన్న - పోతన్న**

పొందె గుడి సెలోన పోతన్న భక్తుడై

మేడలందు లేని మేటి తృప్తి;

మేడ - గుడిసె వోలె మేధావి తిక్కన్న

మనసులోన తలచి - మసలినాడు !

గొప్పవారలెవరు చెప్పు మిర్వురిలోన ?

ఒప్పు గొప్పదనము - ఉభయులందు;

గొప్పదనముతోచు కోటిరూపములెత్తి

మేడనైన – మురికివాడనైన.

**తూర్పు పడమరలు**

వేరు తూర్పు దిక్కు! వేరయా పడమర !

రెండు - ఎచట కలిసియుండ వెపుడు

మతము వేరు - మరియు మనుజులే వేరయా !

వేష భాషలెల్ల వేరు ! వేరు !

లేదు! తూర్పు దిక్కు లేదయా పడమర !

భూమి_తిరుగుచున్న బొంగరమ్ము;

మంచి మనుజు లొకటె - మతములు ఒక్కటే

రెండు కొసల చివర నుండుగాక !

**కారల్ మార్క్సు మనిషి**

మనిషి శ్రమకు రత్న మాణిక్యములకంటె
విలువ దెచ్చినావు విశ్వమందు!
కాలపురుషు గుండె గడియారమును
మార్క్సు ఋషివ రేణ్య ! మార్చినావు ! 1

భూలోకంబు నివాసయోగ్యమగు నీ పూన్కిన్_ధనస్వామ్యమే
లో లోనంగల ఛిద్రభేదములు క్రుళ్లున్- సామ్యవాద ప్రబో
ధాలోకమ్ము నినున్ జగద్గురునిగా అర్చించు నశ్రాంతమున్ ;
చాలుంజాలు - చరిత్ర - చెప్పును సదా సాక్ష్యంబు నీపక్షమై.

నీ వేదాంతము ధాత్రికిన్ నవనవోన్మేషంబు గల్పించుతన్
సేవాధర్మ పవిత్ర కార్మిక జగత్ శ్రేయోధ్వజంబెత్తి మే
ధావుల్ మెత్తురు నీ ప్రణాళికలు సిద్ధాంత స్థిత ప్రజ్ఞయున్
నీ వాచాగతి తర్కవాదములకున్ నీరాజనం బెత్తుచున్.

ధరణి నేలు హక్కు ధనవంతులది గాదు ;
సోమరులకు భువిని చోటు లేదు !
చెమట నోడ్చి - ఎవడు - సృష్టించు సంపదల్
వాని జన్మ హక్కు వసుధ యెల్ల !

చెమట నోడ్చు ప్రజకు శ్రీరస్తు! శుభమస్తు!
సామ్యవాదమునకు జయము జయము !
శ్రామికజనులెల్ల - స్రష్టలై - ద్రష్టలై !
మేలుకొనుడు విశ్వ మేలుకొనుడు!

కార్మికులు – రండు అంద రేకమ్ముగండు!
ఎల్లలెల్ల మరచి చేరి ఏకమగుడు
భూమిపై మీకు పోయెడి దేమి కలదు?
త్రుప్పు పట్టిన సంకెళ్లు తప్ప లెండు !

ముదిమి ముదిరి మూల్గు నదె ధనస్వామ్యమ్ము !
మరణశయ్యమీద మగత గ్రమ్మి !
సామ్యవాదులార ! సంసిద్ధులై లెండు !
దహనకాండ జరిపి - ధన్యు లగుడు.

ఇక - జగద్ విమోచనకు మార్క్సు మార్గమే
శరణమనుచు జనము చాటుగాక !
మార్క్సుమాత్ర మెపుడు - "మార్క్సిస్టు" కాడంచు
నీవె చెప్పగలవు నిన్ను గూర్చి!!

**గురుదేవో భవ**

ఆకసమున నెగురు ఆ శరన్మేఘంపు

ఘనత - పైరుచేల గాంచనగును !

విశ్వమెల్ల నిండు విద్యార్థి జనులలో

గురుని గొప్పదనము గోచరించు.

చిన్న ప్రమిదవోలె చిమ్మ చీకటిలోన

మిణుకు మిణుకు మనుచు మెరయు గురుడు ;

దిగ్గి గంతములను దీపించు కాగడల్

వెలుగజేయుచుండు వేల కొలది.

కాంతి నిచ్చి మలగు కర్పూరహారతై

చదువు కొరకు - ఎవని బ్రదుకు వెలుగు!?

జీవితమ్ములోన శిష్యులే తన కంటే

గొప్పవార లగుట కోరు నెవడు ?

పసిడి కంటె - వజ్ర వైడూర్యములకంటె

విలువయైన దేది విశ్వమందు ?

అసలు సృష్టి కేది అపర సృష్టిని జేయు

అణు రహస్య శక్తి నధిగమించి ?

మనుజు నేది చంద్రమండలమ్మును జేర్చె?

మనిషి మెదడు గొప్ప మహిమ గలది

మెదడు తీర్చి దిద్దు మేధావి యెవడయా ??!!

చదువు చెప్పునట్టి సద్గురుండు.

చెక్కవచ్చు - సొగసు - శిల్పి వరేణ్యుండు

పాలరాతి పైన - పసిడిపైన;

మనిషి మెదడుపైన మన ఉపాధ్యాయుండు

విలువ కట్టలేని విద్య చెక్కు.

మట్టిలోన కలియు మాణిక్య మకుటముల్

పాలరాయి పగులు - పసిడి కరగు;

నరుల మనసుపైన గురుడు వేసెడి ముద్ర

తరతరాలకై న చెరగిపోదు.

కురియు జ్ఞానవృష్టి గురుడు మేఘునివోలె

పుడమి పడిన చినుకు బురద యగును;

ముత్యమగును చినుకు ముత్తెపు చిప్పలో !

అగ్ని మిది చినుకు ఆవిరగును!

వెల్లి విరిసి నూత్న విద్యావిధానమ్ము

విశ్వమెల్ల మార్చివేయుగాక !

సమత - స్వేచ్ఛ - శాంతి సౌభ్రాత్ర భావముల్

భువిని దివిని చేసి పొలుచుగాక !

**భోగి మంటలు**

క్రొత్తదనమును కనలేక కుమిలి క్రుంగి
ప్రసవ వేదన పడుచుండె ప్రాతదనము ;
విశ్వ విప్లవ ప్రస్థాన వేధ నుండి
ఉద్భవించుత! నూత్న యుగోదయమ్ము! 1

తొలివెలుగుల్ నభంబలమె తూరుపునన్; పొగమంచు లేజడిన్
చలి వడకింప ఈ ప్రకృతి సర్వము ఆకులపాటు నొందె; మి
న్నులు వడునట్లు కన్పడు కనుంగవకున్ కలవోలె; భోగి మం
టలు వెలిగించి చీకటు లణంచుము, మానవ మానసమ్ములన్.

కాలదోషమ్ము పట్టిన గతచరిత్ర
ఎండిపోయిన పిడకల దండవోలె
కట్టగట్టి కన్నులు మూసి కాల్పవోయి !
భోగిమంటలలో నీకు పుణ్యముండు !

కాలపురుషుడు విశ్వ విశాల ధాత్రి
కేల చేటగాఁ బూని యుగాలనుండి
ప్రాతవిలువలనెల్ల తూర్పారబట్టు !
కుప్పవోయుము - తమ్ముడా - క్రొత్తపంట |

తల్లి – రత్నగర్భ! అయిన తనయు డిట్టు
లేల గర్భదరిద్రుడై ఇడుములుపడు ?
భూమి భారమ్ము నీ రెండు భుజములందు
మోసి ఏమితెచ్చితి గూని మూపుతప్ప ?

స్వర్ణ సంక్రాంతి పురుషుండు వచ్చి భోగి
మంటపై వేల్చె పేలాల మంగలమ్ము!
పేలుచున్నవి పొట్టలు విచ్చిపోయి
తండ్రి తాతలు నూర్చిన ధాన్యమెల్ల.

వేల్చుటకు ఏమి లేవని వెరవనేల?
కానబడకుండ నీ రెండు కాళ్ల నుండు
ఇనుప సంకెళ్లవిగో ! వేల్వు మింధనముగ
కాల పురుషుని నెమ్మేను గగురు పొడువ !

స్వస్థాన వేష భాషా మమత్వముచేత
గుండె గప్పిన సాలెగూళ్ల నెల్ల !
స్వీయమతాభినివేశమ్ము మనసులో
పెంచిన పెనుముండ్ల కంచె లెల్ల !

జాత్యభిమాన పిశాచి పూనుటచేత
బుఱ్ఱ కెత్తిన గంగ వెఱులెల్ల !
విద్యామదము పదవీమదమ్ము ధన మ
దమ్ము వేసిన వెర్రి తలల నెల్ల !

కారణాంతరముల కలగూరవోలె
ఒడలిపై మొలిచిన కుక్కగొడుగులెల్ల .
భోగిమంటలలో వేల్చి కాగబెట్టి
వేడినీరు శిరస్స్నాన మాడుమయ్య !

నీ వేడి నిట్టూర్పు నిఖిలధారుణి రేపు

ప్రళయోగ్ర ఝుంఝూ ప్రభంజనమ్ము !

నీ కంటి కెంజాయ రేకెత్తజేయు ఆ

రిన అగ్గికొండల రెచ్చగొట్టి !

నీ పొట్ట మంటలు నింగి నేలను గూల్చి

పాతాళ హెూ మమై ప్రజ్వరిల్లు!

నీ సజీవ సమాధి ఈ సృష్టినెల్ల శ్మ

శాన వాటికగ నాశనము చేయు !

మొక్కవోయిన నీ గుండె - మూగవోయి

నట్టి నీ గొంతు - ఎముకల కట్టయైన

నీ శరీరము; - కాలిన నీ చరిత్ర !

మానవత్వమ్ము నకె అవమాన మగును.

కడుపు మాడి గుంట పడిన కంటిమంట

భోగిమంట గొలిపి ఆరిపోయినట్టి

గరళకంఠుని మూడవ కన్ను నిపుడు

రగులుకొల్పుము దుష్టమారణము కొరకు !

**ధ న ము**

ధనము పెట్టి - దేని కొనవచ్చు పృథివిలో ?

లోని గుంజు కాదు ! - పైని డొలక !!

ఔ షధములు గాని - ఆరోగ్యమును గాదు ;

సేవకులను గాని చెలిమి గా దు ;

నురుగు పరుపు గాని మరపు నిద్దుర గాదు ;

సౌఖ్యములను గాని శాంతి గాదు;

చదువు బిరుదు గాని సంస్కారమును గాదు ;

ఒడలు గాని వెలది యెడద గాదు.

దాపురించు - భయము - ధనము హెచ్చుగనున్న !

లేకయున్న యెడల శోక మిచ్చు;

కోరుకొనుట ధనము కొరవి దయ్యము వేట;

గొప్పవారు - ధనము - కోరుకొనరు.

**క్రీడాభిరామము**

ఆటకాడు - మంచి ఆరోగ్యవంతుడౌ ;
తుష్టి గలిగి - దేహపుష్టి - గలిగి ;
సహజ శౌర్య ధైర్య సహకార సంఘమ్ము
ఆటకాండ్రకంటె - అవని గలదె ?

ఆడు — ఆటకొరకె - క్రీడాభిరాముండు
ప్రాకులాడకుండ - ఫలము కొరకు ;
ఆటకానికంటె - ఆదర్శ వేదాంతి
కర్మయోగి - యెవడు - కానుపించు ?

ఎదుటివాడు - గెలువ - హృదయపూర్వకముగా
పొంగిపోయి అతడు పొగడ గలడు ;
ఎదుటివాని గెలుచునెడ స్థితప్రజ్ఞుడై
తోటివాని మెచ్చు - ఆటగాడు.

ఆటకాడు - లోని అహము త్యాగము చేసి
సంఘ హితము గోరు సామ్యవాది ;
వ్యష్టి ఘనతకొరకు ప్రాకులాడక చూపు
సాటివారియెడల సానుభూతి.

కేళీలోలుడుబాలుడై -నిరతమున్ గెంతున్; వడిన్ దూకు తా
లీలామానుష విగ్రహుండయి తటిల్లేఖావిలాసోద్ధతిన్
పాలించున్ నిజ బాధ్యతల్ బరిని జివన్ముక్తుడై; ప్రస్తుతుల్
వేళాకోళములున్ సమానమగు ఆ వేదాంతి కెల్లప్పుడున్.

నెరపగలడు బ్రదుకు - నిత్యసంతోషియై
అంతరంగమందు ఆటకాడు;
తామరాకుమీద తా నీటి బిందువై..
మమత విడిచి పెట్టి మసలగలడు.

ఆటకాడు గొప్ప ఔదార్యవంతుండు;
నమ్మదగిన సహజ నాయకుండు;
ఓడినపుడుగూడ ఉక్కురోషము విడు
శాంతుడౌ అజాతశత్రు డతడు.

మధ్యవర్తి తీర్పు మరుమాట లేకుండ
గొప్ప ఆటకాడు ఒప్పుకొనును ;
నవ్వగలడు తనకు నష్టమైననుగూడ !
కలహశీలి ఆటకాడు కాడు.

ఆట - కండరముల కపమృత్యువును బాపి
నిత్యయౌవనమ్ము నింపగలదు;
పడుచు మెదడు ముసలి ముడతలు పడకుండ
క్రీడ - ఒడుపులోడ చూడగలదు.

ఆటగానికంటె ఆదర్శపురుషుండు.
లేడు! ధరణిలోన లేడు! లేడు!
మంచిమనిషి యెవడు ? మంచి దేహమునందు
మంచి మనసు గలిగి మసలువాడు.

వెలయ జేయగలడు విశ్వ సౌభ్రాత్రమ్ము
భిన్న జాతి మత విభేద మెడపి ;
లోకమొకటి జేయు ఏకైక పరిభాష
మాటలాడగలడు ఆటకాడు.

**అధికారి**

శ్రమను గూడ - సంతోషముగ మార్చి
ప్రక్కవారలకును పంచి పెట్టు !
నడి సముద్రమందు పడవేయ అధికారి
బట్ట తడువకుండ గట్టు చేరు.

పోయి - ఆర్పివచ్చు పొగ సోకకుండగా
కొంపలంటుకున్న కొద్ది సేపు ;
తొందరపడబోడు - తొణకడు! బెణకడు !
మిన్ను విరిగి నెత్తిమీద పడిన,

త్రాచు పామునైన - రాజబంధువునైన
విసము పిండివేసి వీపుతట్టు;
తనకు - లొంగ దీసి దాసో హమనిపించు
కుక్కనైన ముసలి నక్కనైన.

ఏన్గు లాగగలడు ఎలుక కన్నమునుండి
సదరు బెదరు లేక అదను దొరుక;
క్రింది వారి ఘనత సందర్భమునుబట్టి
వెలికితీయగలడు - వెదకి వెదకి..

అదుపులోన పెట్టు ఆఫీసు పనివారి
చూపుతోడ - చేతి ఊపుతోడ !
మనిషి మనసు మార్చు - మాటలాడిన చాలు
మంచితనము అతని మాతృభాష.

**గ్రంథాలయములు**

మెదడుతోడ బ్రదికి మృతజీవులున్నారు!'
జ్ఞానయోగసిద్ధు లైన జీవులు
రండు - కలిసికొనుడు – **గ్రంధాలయమ్ములో** !
సహృదయులగు మీకు స్వాగతమ్ము!

యుగయుగాలలోని జ్యోతిర్మయులు
కవులు దార్శనికులు ఘనులు
కలిసికొనుడు వచ్చి గ్రంథాలయమ్ములో
తెలివి తేజ మొసగగలరు మీరు

ఇచట దొరకు మీకు ఉచిత పాథేయమ్ము
దూర మేగు బాటసారులార !
క్రాంతదర్శులార - గ్రంథాలయమ్ములో
కొరత నింపుకొనుచు అరుగుడయ్య!

యుగయుగాంతరముల ఉత్తమ జ్ఞానమ్ము,
మనిషి మరచిపోని అనుభవమ్ము,
తరతరాల ప్రజలు దాచి పెట్టిన వెల్లు ;
గ్రంథ నిలయ ముందు కానవచ్చు.

'మంచి బాట లేక పంచాయతీ లేక
ఉండవచ్చు - పల్లెటూళ్లు - కొన్ని ;
గ్రామ ముండరాదు గ్రంథాలయము లేక
చదువు లేక నేడు బ్రదుకు లేదు.

విసుగు గొనక సుంత విశ్రాంతి గొనకుండ

ఇల మహానుభావు లైనవారు

చేయగలరు - బోధ జిజ్ఞాసువులు చేర

సంతసమున గ్రంథసదనమందు.

ఎచట గానుపించు ? ఏ స్వర్గమున నుండు ?

అల మహాపురుషుల ఆత్మలెల్ల ?

కాపురమ్ము చేయు గ్రంథాలయాలలో !

చదువరులకు స్వీయ శక్తి నొసగి.

ప్రజలకెల్ల నేడు బడి యేది? గుడి యేది?

వేయునట్టి దేది వెలుగు బాట ?

కట్టదగును నేడు గ్రంథాలయమ్ములే

పట్టణమ్ములందు పల్లెలందు.

ప్రజలయందు చదువురానివా డొకడున్న

దేశగౌరవమ్ము దెబ్బతినును

ప్రగతి రాదు నేడు గ్రంథాలయము లేక

చదువు తెరవ జేయు మెదడు కనుల.

ప్రజకు మేలు చేయు - గ్రంథాలయము నేడు

బడులకంటె - మేటి గుడులకంటె !!

'మేలుకొల్పు జనుల మేధావులను జేసి

నేత యెవడు రేపు ? - నేటి పఠిత !

**స ప్త పాతకములు**

ఆశయాలు లేని అపరాజకీయముల్ !

పనికి విముఖమైన ధన దురాశ !

అంతరాత్మ లేని అనుభోగ లౌల్యమ్ము !

సచ్ఛరిత్ర లేని జ్ఞాన దీప్తి !

వంచనమ్ముతోడి వర్తకాభ్యుదయమ్ము !

త్యాగ నిరతి లేని ప్రార్థనమ్ము !

సద్ హృదయుము లేని శాస్త్ర విజ్ఞానమ్ము !

గాంధి - స ప్త పాతకమ్ము లనియె

**జీవాత్మ - పరమాత్మ**

ఆలు మగలు కలియ - అది తుచ్ఛ కామమ్ము

శ్లేష్మమందు ఈగ చేరుటనుము ;

పరమ ఘోరమైన వ్యభిచారమని చాటు

యువతి పెండ్లికాక - యువకు గలియ!

సన్యసించినట్టి స్వామివారిని గోరి

పరవసించి కలయ భ క్తురాలు !

చేరె ననుము తుదకు జీవాత్మ - పరమాత్మ!

తుచ్ఛకామ మనకు - దోష మనకు !

పరమహంసయైన గురుదేవు కలియగా

భర్త బ్రదికియున్న భ క్తురాలు,

అది - తరింపజేయు అపర రాధా మాధ

వమ్ము - రాసలీల - నమ్ము మనుము!

కొలువ దగదు - పుడమి కొలతబద్దలతోడ

సాధుజనుల దివ్యచర్యలనుము !

పాప మెట్లు దూరు - భగవత్ సదృశులలో ?

చికటెట్లు సూర్యు చేరగలదు ?

**అద్వైత సిద్ధి**

వేయగలదు-వివిధవేషాలు_స్వార్థమ్ము
త్యాగి పాత్ర-పరమయోగి పాత్ర !
నీతి కొరకు బ్రదుకు నిష్కళంకుని పాత్ర!
సామ్యవాది పాత్ర ! సరసు పాత్ర!

నీచమైన నటన నిరసించు ఋషి పాత్ర!
గోవు పాత్ర ! బుద్ధదేవు పాత్ర!
దీన సేవ చేయు దేశభక్తుని పాత్ర!
సౌమ్యుడౌ అజాతశత్రు పాత్ర!

సత్యసంధు పాత్ర ! సాహిత్యవిదు పాత్ర!
నిమ్న జనుల బ్రోచు నేత పాత్ర!
నరుని రూపమెత్తి కరుణతో భువి మీద
తిరుగుచున్న దేవ దేవు పాత్ర !

భిన్న నామ రూప భేదాలు మాయమై
మెదడునుండి తొలగి మేలిముసుగు
స్వార్థ విశ్వరూప సందర్శనము గల్గ
జగతి మిథ్య యనెడి జ్ఞాన మొదవు!!

ఏక మద్వితీయ మేకాంత సత్యమై
నిర్వికల్ప మగుచు నిత్యమగుచు
అహ మొకండుతప్ప అద్వైత సిద్ధిలో
చివర కేమి మిగులు సృష్టియందు ?

**పుష్ప గీత**

చెప్పె తేటి - పువ్వు చెవిలోన - ప్రేమతో

మధువు గ్రోలి తనిసి మనసు విప్పి;-

"నిన్ను చూచినపుడు నేత్ర నిర్వాణమౌ !

చెలువ మెడద సతతత మలర జేయు.

మందస్మితయుతమౌ నీ

సౌందర్యము గాంచినట్టి సమయమునందున్

డెందము నందున బ్రహ్మా

నందము క్షణమైన నిల్చు నందనవనమున్.

పూవుగ పుట్టినావు; వలపుల్ గురిపించెడి గుండెనుండి నె

త్తావులు చిందు నిన్ను తలదాల్చు జగత్తు - క్షణమ్ములోన - నీ

యౌవన సౌకుమార్యముల కాయువు దీరుట వింతమౌ ! చిరం

జీవినివై సదా బ్రదుక - సృష్టికి నూతనశోభ అబ్బదే !

అందమైన పూల ఆయుస్సు అల్పంబు

ఉండు శాశ్వతముగ బండరాళ్లు !

సృష్టికర్త గూడ సిద్ధహస్తుడు కాడు !!

విశ్వశిల్పమందు వెలితి గలదు !"

అవ్వన మందున పూచిన

పువ్వులు సొగసులు గురియుచు పొట్టలు విచ్చన్

నవ్వెను పకపక; _ వినుచున్

క్రొవ్విరితో తేటి చెప్పు కూరిమి పలుకుల్.

అందమైన పువ్వు - మందహాసము చేసి
తేటితోడ పలికె తేనె చిలికి;
"స్వాగతమ్ము - రసిక చక్రవర్తికి నీకు
సఫలమయ్యె నాదు జన్మ సఖుడ!

ఒక్క రోజు చాలు చక్కగా జీవింప
వెగటు బ్రదుకదేల వేయి యేండ్లు ?
మఱపు రాని దివ్యమధుర వృత్తము గాగ
జగతి బ్రదుక దగును క్షణమె యైన.

సరసహృదయ - నాకు సౌందర్యమే ఆత్మ !
జగతి-ఆత్మ కెపుడు చావు లేదు
సత్య మొకటె_మరియు సౌందర్యమొక్కటే!
చూడు సృష్టి - శివము సుందరమ్ము.

ఎదియు నాశ మొంద దీ విశ్వ సృష్టిలో !
మార్పు చెందుగాని మరల మరల !
లలిత కళలలోన లావణ్య సౌందర్య
సౌకుమార్యమెల్ల సంగమించు.

శిలలుగూడ చూడు చిగురించి పుష్పించు
వాడిపోని సౌరభమ్ము లొలికి
చెలువ మొప్ప ధ్యానచిద్విలాసముతోడ
సిద్ధహస్తుడైన శిల్పి మలచ.

కరుడు గట్టినట్టి గానమ్మె - శిల్పమ్ము;
స్థాణువై నటించు ప్రాణదీప్తి !

మాట లేని మౌన మాధుర్యరించోళి !

బయట కానుపించు భావయిత్రి.

దేహి - బ్రదుకలేడు ఆహారమాత్రాన

లలితకళలు కూర్చు వెలుగు లేక

మానవుండు మారు మానవాతీతుడై

అమృతరసము గ్రోల అంతరాత్మ.

గాన మెడద చొచ్చి క్షాళనం బొనరించు

తావి చేరలేని తావు లొరసి;

స్రష్ట దొసగులైన సంస్కరించెడి ప్రజ్ఞ

కాననగును లలితకళలయందు.

సరస కావ్య రసిక సమ్రాట్టువై నీవు

పుడమిలోన తిరిగి పుట్టగలవు !

నీవు వలచి నేడు పూవు పూవున వ్రాలి

తేనె గ్రోలు చున్న తేటివగుట.

వెలసియుందు నేను విశ్వాంతరాత్మలో

లలితకళలలోన కలిసిపోయి."

పులకరించి - తేటి - పువ్వు వీడ్కొనిపోయె

పరిమళించు గగన పథముబట్టి.

**ఉద్యమములు**

నడికి రేయి పుట్టి చడిచప్పుడులు లేక
మనసులందు మౌనమననమందు
ఉద్యమాలు పెరుగు ఒంటరితనములో!
పట్టపగలు బయలు పడకముందు.

చిన్న చిన్న సన్న సెలయేళ్లుగా పుట్టి
పిదప కడలి చేరు పెద్ద నదులు !
ఉద్యమాలు పెరుగు ఉపనదుల్ కలియగా
గట్టివారు మొదలు పెట్టినపుడు.

మారవచ్చు "సగటు మనిషి" మహాత్ముడై !
పిరికిపంద గొప్ప వీరు డగును !
ప్రజల హృదులలోన ప్రజ్వరిల్లుచు నున్న
ఉద్యమమ్ము లోని కురికినపుడు.

ఉద్యమాలలోని ఉత్సాహ యువశక్తి
బడుగునైన చిచ్చుపిడుగు జేయు !
కుక్క కెదురుతిరిగి కుందేలు గెలుపొందు !
క్రొత్తనమ్మకాలు కుదిరినపుడు.

**వ్యంగ్య చిత్రములు**

విశ్వమెల్ల వెదకు వేయి కన్నులు లేక!
మెరుపుతీగ వంటి మెదడు లేక!
క్రాంతదర్శిగాక ! కవిగాక ! ఋషిగాక !
వ్యంగ్యచిత్ర మెవడు వ్రాయగలడు?

ఊహకందజేయు ఒక్క వంకర గీత
భాష చెప్పలేని **బావ**ములను !
సిద్ధహస్తుడైన చిత్రకారుని ముందు
సృష్టికర్త తరచు సిగ్గుపడును !

వ్యంగ్యచిత్రమనిన వక్రభాష్యము గాదు
దెప్పిపొడుపు గాదు; తిట్టు గాదు;
మనుజలోకమునకు మాత్సర్యమును వీడి
ముందుదారి జూపు మందలింపు!

ఏనగింపు కాదు ! ఎగతాళియును గాదు.
తప్పు లెన్ను చెడ్డతనము గాదు !
విశ్వహితము కొరకు వేడి కన్నీటితో
వేయునట్టి వ్యంగ్యవేత్త బొమ్మ,

మూగ తిరుగుబాటు మొగముపై సారాడు.
సగటు మనిషిమీద జాలి లేక,
సానుభూతి లేక సంఘదుఃస్థితి పైన,
చేయరాదు - వ్యంగ్యచిత్ర రచన.

**గురువ**

పాదపూజ కోరు భగవద్ గురునికంటె

“అహము లేని శిష్యుడధికుడగును;

చిత్తశుద్ధితోడ సేవచేయుట లెస్స;

సేవ లందుకొనుట చెడ్డతనము.

శిష్యు బొటనవ్రేలు ఛేదించినప్పుడే

గురుని శిరము దొరలె ధరణిమీద

ఎట్లు ఘనుడు ద్రోణు డేకలవ్యుని కంటె?

గొప్పవాడు కాడు కుటిలు డెపుడు.

“అహము కొంత లేక ! ఆత్మవంచన లేక !

గొప్ప ఎంతయున్న - గురువు కాడు;

శిష్యు డగుట సులువు - జిజ్ఞాసు వైనచొ,

వినయ మున్న యెడల - వే త్తయైన.

విలువ గట్టు గలుగ - వినయమ్ము వెలహెచ్చు !

జగము నేలు స్వాతిశయముకంటె ;

గురుని కంటె - శిష్యపరమాణువే - మిన్న ;

చేయవలయు గురుడు “శిష్యపూజ!”

**మరణ భీతి**

మరణ భీతి లేని మనుజులెందరులేరు?
పుట్టినట్టి ప్రాణి గిట్టి తీరు !
వీరులెంతమంది విజయమ్ము కోసమై
పోరలేదు యుద్ధభూములందు ?

పిరికిపంద గూడ మరణదేవత మీది
కురుకగలడు మనసు విరిగినపుడు!
అబల లెంతమంది ఆత్మగౌరవము కై
చితుల నెక్కలేదు చింత వీడి ?

భిక్షుకుండు గాని లక్షాధిపతిగాని !
రైతుబిడ్డగాని ! రాజుగాని !
చరమ పథమునందు సహయాత్రికులు సుమ్ము ;
చావు - సామ్యవాద సత్రశాల.

అనువుకాని జబ్బు! అవమాన దుఃఖమ్ము !
భగ్నమైన ప్రేమ ! ప్రాతకినుక !
హద్దు మీా రి నట్టి ఆవేశరోషమ్ము !
సరకు చేయలేదు - మరణ మనిన !

సకలసృష్టి సహజ సామాన్య సూత్రమ్ము
దాటరాని కాలధర్మ పరిధి
మృత్యుభీతి – మేటి మేధావులౌవారు
వీడజాలకున్న వింతగాదె !

**అన్న దాత**

ఆదిమ కళ యేది? వ్యవసాయ కృషిగాక !

రైతు కాక - "అన్న దాత" యెవడు ?

గుండె దున్ని యెవడు పండించు సస్యముల్

తర తరాల మంచితనము నాటి.

రైతుబిడ్డ కృషియె జాతీయ సంపత్తి :

పాడిపంట లతని బ్రదుకు తెరువు;

మారు అతని చేత మట్టి బంగారమై !

మంచితనము అతని మారు పేరు.

చదువు - అనిన హృదయ సంస్కారమే యైన

వ్రాతకోత లేల ? గీత లేల ?

రైతు బిడ్డ కుండు నీతి నిజాయతీ

సంతకమ్ము లేల? సాక్షులేల?

ప్రాణశక్తి - పెరిగి ప్రత్యక్షమై తోచు

దిన దినమ్ము రైతు కనుల ముందు;

సృష్టి నణగియుండు చిద్విలాసముతోడ

మొక్కలందు పూప మొగ్గలందు

మంచి తిండి తినుచు మంచి గాలిని పీల్చి

క్రోలుచుండు గంగి గోవు పాలు ;

ఆదరించు అతిథి అభ్యాగతుల నెల్ల :

రైతుబిడ్డ బ్రదుకె "ప్రగతిగీత"

**మాట నేర్పు**

వాక్కుకున్న పదును వాడి కత్తికి లేదు !

మార్చగలదు - మాట - మనిషి మనసు ;

జారవలదు నోరు - జాగ్రత్త ! జాగ్రత్త!

శబ్దములకు గొప్ప శక్తి గలదు.

ఉబుకజేయు - ఒక్క ఉత్సాహ వాక్యమ్ము

యువకులందు అణగియుండు ప్రతిభ ;

మాట మంచితనము మర్యాద గొనితెచ్చు ;

మాటవలన మనిషి మాన్యు డగును.

మంచిమాట చాలు మనసులో గాయమ్ము

మాన్పజాలు గొప్ప మందువోలె ;

సౌమ్యమైన మాట సంతాపమును బాపు ;

మాట చూరగొనును మనిషియెడద.

ప్రజల మనసు దిద్దు పత్రికల్ - రేడియో

శబ్ద శక్తి ఘనత చాటు నేడు ;

శబ్దశ క్తి -ఎంత చైతన్యవంతమో !

సర్వవాఙ్మయమ్ము సాక్ష్య మిచ్చు.

కూర్మి పండుచున్న క్రొంగొత్త కాపురాల్

కూలద్రోయగలదు కుంటిమాట !

కొంపలంటుకొనును కొంటె మాటలచేత

చేటు తెచ్చు ఒక్క చెడ్డ మాట.

తాళబద్ధమైన ధ్వని చాలు పురికొల్ప
మంత్ర మహిమలేల? మాటలేల?
కదను త్రొక్కి - సేన - కదనరంగము చేరు
పరవశించి - మరణభయము విడి.

సమత - స్వేచ్ఛ - విశ్వసౌభ్రాత్ర శబ్దాలు
వెల్లివిరియజేసె విప్లవమ్ము !
తూచి తూచివాడ ఔచిత్య గరిమతో
మాటకూర్పుకంటే మంత్ర మేది?

మిత హిత ఋత వాక్కు - మేధావి పాటించు
వాక్కుకూర్పు వేదఋక్కు లగును;
మనిషి చచ్చిపోవు ! మాట చావక నిల్చు !
అక్షరములు జగతి అక్షరములు

మాటకూర్పు జోలపాటయై జోకొట్టు
శిశువునైన ప్రౌఢపశువునైన
జనుల కూడగట్టి జయ జయధ్వనులతో
నేత వెలుగు మాటనేర్పు కతన!

మాటనేర్పు కసలు మౌనమే జనయిత్రి
ధ్యాన యోజనమ్ము తండ్రి యగును !
చిన్ననాటినుండి చిర తపస్సును చేసి
మనిషి పొందుగాక మాటనేర్పు.

**తప్పు నాది కాదు**

"దున్నపోత ! యేల దుక్కి దున్నవు నీవు ?

పంట లింకఎట్లు పండు చెప్పు?"

"కాడి కట్టలేదు నేడు మీ పాలేరు

నాది కాదు - తప్పు - నాది కాదు."

"ఏల కట్టలేదు పాలేరు ! నాగలి ?

నిక్కి నీడలోన నిలిచినావు !"

"రైతు ఇవ్వలేదు జీతమ్ము నెలనుండి

నాది కాదు – తప్పు - నాది కాదు."

"రైతుబిడ్డ ! నీవు జీతబ త్తెము లేల

ఇవ్వలేదు ధాన్య మింట దాచి ?"

సోల దొరకలేదు చాల రోజులనుండి

నాది కాదు - తప్పు - నాది కాదు."

కట్టె కలప కిపుడు కరువు వచ్చిన దేమి !

ఏల దొరకవు సోల ? సోల ??"

"చెక్కి వడ్లవాడు చేయుచుండుట లేదు !

నాది కాదు - తప్పు-నాడి కాదు."

"వడ్లవాడ ! గొప్ప వడ్రంగి మే స్త్రీ !

చెక్కి సోల నేల చేయ వీవు?"

"బండబారిపోయి బాడిస తెగలేదు.

నాది కాదు - తప్పు - నాది కాదు.

"బండబారినట్టి బాడిసా ! బాడిసా !

ఏలతెగవు చెప్పు మింక నీవు ?"

“కాల్చలేదు నన్ను కమ్మరి కొలిమిలో

నాది కాదు - తప్పు - నాది కాదు".

“కాల్చవేల నీవు కమ్మరి కొలిమిలో ?

బాడి సట్లు బండబారిపోవ ?"

“కొలిమి మండలేదు _ కూరుచుంటిని నేను

నాది కాదు – తప్పు – నాది కాదు".

“కొలిమి ! కొలిమి ! అంటుకొనని కారణమేమి ?

ఆరిపోవనేల అగ్గి అట్లు?''

“తోలుతిత్తి చినిగి గాలి ఊదుట లేదు

నాది కాదు — తప్పు - నాది కాదు”

“తిత్తి! - తిత్తి ! - ఏల క్రొత్త తోలును తెచ్చి

కొలిమిలోన గాలి నిలుపవీవు?"

“దున్న చావలేదు ... తోలెట్లు లభియించు?

నాది కాదు-తప్పు-నాది కాదు".

**పత్రికా సుప్రభాతము**

నీ రాకకోసమై పారా హుషారుగా

తలుపు తెరచి చూచు తాతగారు !

నినుఁజూచినంతనే నిదుర మంచము వీడి

యువకుడౌ అల్లుండు ఉరికివచ్చు!

నీ గాలి సోకగా త్రాగు కాఫీ కప్పు

అట్టులే చేపట్టి అతిథి వచ్చు !

నీ మాట విన్నంతనే చేరు విద్యార్థి

పాఠ్యపుస్తకములు పారవేసి !

అను దినమ్ము ఇంక ఆ బాలవృద్ధమ్ము

ఉండలేరు చూడకుండ నిన్ను !

స్వాగతమ్ము ! సుప్రభాతమ్ము ! పత్రికా !

జయము నీకు దిగ్విజయము! జయము !

ఏ రోజు కా రోజు మారువేషము వేయు

ధారుణీచరిత కద్దాల మేడ !

“సగటు మానవులకు" సర్వతోముఖదీప్తి

ఉపదేశమును చేయు ఉపనిషత్తు!

నాల్గు దిక్కులు కల్పి వెల్గు బాటలు వేయు

నవనాగరికతకు నాట్య శాల !

ప్రతిరోజు ప్రగతిమార్గము చూపు విజ్ఞాన

విశ్వకల్యాణికి వేగుజుక్క !

మొగ్గ దొడుగు కవికి ముడి పదార్థపు మూట!

నాయకులకు రాజకీయ సురభి !

ప్రజకు కన్ను విప్పు - పత్రికా రా రమ్ము !

స్వాగతమ్ము ! నీకు ! స్వస్తినీకు !

రేపుమాపు మారు నేపథ్యమున నిల్చి

కాలచక్రనాటకమ్ము - నడపు

సూత్రధారి యెవడు ? పాత్రికేయుడు గాక!

సర్వకళల కతడు సంగమమ్ము.

సర్వజ్ఞ బిరుద నామము

శర్వునకే రావు సింగ జనపాలునకే

యుర్వింజెల్లదు _ నేడిల

సర్వజ్ఞులు పత్రికలకు సంపాదకులే !

## ప్రార్థన

భూతదయను పూడ్చి బుద్ధ దేవుని అస్థి
కలు పెట్టి స్తూపాలు కట్టినాము !
సోక్రటీసుకు - న్యాయసూత్రాలు చర్చించి -
పొట్టలో గరళమ్ము పోసినాము !
సిలువపై - శ్రీ ఏసు సిద్ధాంతములు - నిల్పి
చేయుచుంటిమి నేడు చిత్రహింస !
నిత్యమ్ము గాంధీని హత్యచేయుట లేదె !
ఆచరింపక మాని అతని బోధ ?

చంపినా మార్కిమెడిసునే క్షణములోన !
కట్టి కంబాన బ్రూనోను కాల్చినాము !
గొప్ప గురిపెట్టి కెనడీని కూల్చినాము !
ఈశ ! ఇకనైన సద్బుద్ధి నిమ్ము - మాకు.


ఎవరు మార్చగలరు ? - ఈ ప్రపంచము నెల్ల !
మార్చలేని దాని మాట ఏల ?
మార్చదగిన దెరిగి మార్చివేయుటకునై
దీక్ష బూన నిమ్ము - దేవ దేవ !

# ప్రగతి గీత

## ముత్యాల గొడుగు

*ము క్త కాలు

*చా టు వులు



## కవితా కుమారి

ఆమె పేరు కవిత ! అతిలోక సుకుమారి !

సవతి తల్లి - జగతి - చావగొట్టు !

కారు కంటినీరు మారు ముత్యాలుగా !

కోరి యేరుకొనని వార లెవరు?

ఉర్వి - ఎవ్వరింక ఓదార్చగలవారు?

శ్లోకమగును ఆమె శోక మెల్ల !

కానుపించు కవిత కన్నీటి జల్లులో

ఇంపు గొలుపునట్టి ఇంద్రధనువు !

## కరుణాశ్రీ

జగదేక వీరులౌ సార్వభౌముల హేమ

మకుటాల మెరసిన మణులకంటె

పరమాత్మ శిరసుపై పరివేషమును గూర్చు

గుడిలోని ముత్యాల గొడుగు కంటె

సౌందర్య సమ్రాజ్ఞి పొందామరలు చుట్టు

సిగలోని వజ్రాల జిలుగు కంటె

విశ్వ విఖ్యాతితో వెలుగొందు విద్వాంసు

జ్ఞాన విజ్ఞాన తేజస్సు కంటె

కరగినట్టి యెడద - పరదుఃఖమును గాంచి

కార్చినట్టి పేడి కంటి నీరు

కోట్ల కొలది రెట్లు - గొప్పదై - తుల తూగు

విలువ గట్ట - స్వర్గ విపణిలోన

మేలుకొలుపు

మేలుకొనుడు ! లెండు ! మేధావు లెల్లరు !
ఎల్ల లెల్ల మరచి యేకమగుడు !
పొందలేని దేది ? భూలోకమున మీరు !
సృష్టి కర కపర సృష్టి చేయగలరు.

అగ్ని పరీక్ష

అగ్నియందు కరగి అపరంజి వెలుగొందు !
మట్టి-గట్టి పడును మాడిపోయి !
దొడ్డవాడు వెలుగు దురదృష్ట దశయందు |
అల్పుడైన యెడల అణగిపోవు.

అత్తగారు

వ్రేలి గోరుచుట్టు ! వేడి వేసవి ఉక్క !
పాము బుసలు ! ఇటుక ఆమ పొగలు !
దూలకొండి దురద ! తేలు కుట్టిన బాధ !
గాలి వాన జోరు ! కడలి హెూరు !

అగ్గి కొండ సాచు బుగ్గి నాల్కల సెగల్ !
ఓర్చుకొనెడి వార లుర్వి గలరు !!
అత్త గారి పోరు - క్రొత్త కోడలు తప్ప
ఉర్విలోన ఎవరు ఓర్వగలరు

ఆద్దము

అందకత్తెయైన అమ్మాయి కావచ్చు !
అద్ద మొకటి ఆమె కవసరమ్ము
తెలివి తేటలున్న తేజస్వి కావచ్చు!
ఉండవలయు స్నేహితుండొకండు.

**అద్భుతము**

అచ్చమైన సత్య మాశ్చర్యమును గొల్పు
కలల కంటే కటు కథల కంటె
జంకకుండ నగ్న సత్యమ్ము వచియింప
అద్భుతమనిపించు అవనికెల్ల !

**అధికారము**

ఆవహించెనేని అధికారభూతమ్ము !
మనిషి మెదడు ఎడద మార్చివేయు !!
పదవి - యెదుగుకొలది హృదయమ్ము క్షీణించు !
మానవుండు మారు దానవుడుగ!!

**అ ను భ వ ము**

అనుభవమ్ము - తరచు - ఆలస్యముగ వచ్చు
మేలు పొంద దగిన కాల మరుగ;
దానమిచ్చు - బట్టతల యేర్పడిన మీద -
పసిడి దువ్వెనలను బ్రదుకునందు !

**అ ను భ వ జ్ఞు ల మా ట**

కనులు - చెవులు - లేని గ్రాంథిక జ్ఞానమ్ము
నడువలేక - క్రిందపడును తరచు !
ఆదరింపదగును అనుభవజ్ఞుల మాట
చదువు అనుభవమ్ము సాటి గాదు.

**అనువర్తన**

ఇష్టమైన పాత్ర - ఇహనాటకమునందు
ఎటుల దాల్చనలవి ఎవరికైన ?
కుదురుకొనిన యెడల కుక్కపాత్రను వేయ
బిడియమేల మొరుగ బింక మేల? !

**అసలు**

అసలు - నిజముచెప్పి - అది కల్పనా కథ
యనెడి భ్రాంతిగొల్పు నతడు - సుకవి !
అసల సత్య మాడి - అది నిజమ్మను భ్రాంతి
గొలుపగలుగువాడు గొప్ప నటుడు,

**అ ప జ య ము**

ఉభయ పక్షములకు ఉత్సాహ మొక్కటే
జయము తేలు చివరి క్షణము వరకు ;
అపజయమ్ము పొందినట్టివారికి - తృప్తి
యత్నమందు తన్మయత్వ మిచ్చు !

**అపసవ్య సంతతి**

అవని నుండవచ్చు అపసవ్యమిథునముల్
సంఘ మిషపడని సంగమములు !
అవని ఎట్టులుండు అపసవ్య సంతతుల్ !
శిశువు లేమి తప్పు చేసినారు ?

**అబల**

చెప్పుచుండు చరిత-జీవశాస్త్రము చాటు
'అబల కాదటంచు ఆడ దనిన!
సతులు - పతుల సహజ సహధర్మచారిణుల్
సృష్టియందు జీవితేష్టి యందు.

**అభ్యాగతులు**

అతిథి జనులు పిలిచి ఆడంబరముతోడ
విందు చేయనేల? వెక్కసముగ!
ఆదుకొనుట మేలు అభ్యాగతుని కోరి
అవసరమ్ము నెరిగి అదను తెలిసి.

**అభిరుచి**

సంఘమందు తరచు చదరంపు బెజ్జాన

గుండ్రమైన గసిక గోచరించు !

అమరవలయు చదువు అభిరుచులను బట్టి;

పదవి వచ్చుగాక - చదువు బట్టి.

**అల్పము**

అణువు అణువు కలియ అగును బ్రహ్మాండమ్ము !

కలిసి నీటి బొట్లు కడలి యయ్యె !

అల్ప మేది కలదు యావజ్జగత్తులో ?

అజ్ఞుడైనవాని అహము తప్ప !

**అల్పసంతోషి**

ఆదరించు లోక మల్ప సంతోషినే

సానుభూతి చూపి చాల సార్లు;

ఏడ్పుగొట్టువాని నెవరు రెండవ సారి

చేరదీయ సాహసింప గలరు?

**అవకాశములు**

పోర నేల ఉన్న దారిద్ర్యమును పంచ

వీర మరణ మంద పెర్రి యేల ?

అభ్యుదయము కల్లు  - అవకాశములు పంచ

పోరదగును-జయము-పొందువరకు.

**అవకాశవాదులు**

అభ్యుదయము తొలుత అవకాశ వాదిదే;

మేలు పొందు-ముందు-గాలి కోడి;

అంతిమ విజయమ్ము-ఆదర్శశీలిదే;

మరువరాని నీతి చరిత చాటు.

**అవజ్ఞ**

మాతృభాష భూత భేతాళ శాకినీ

ఢాకినీ పిశాచ లోకములకు,

సానుభూతి లేని అవహేళనమె యౌాట

బ్రహ్మరాక్షసులకు_బ్రదుకు తెరువు.

**అవబోధ**

నేడు మిగిలియుండె-నిర్మాణకృషి యెంతో !

కూలద్రోయు పనియు-కొంత గలదు!

మార్పు-చేర్పు-కూర్పు మరికొంత కలదింక !

పలుగు_పార-చేతబట్టి లెమ్ము

భరత మాత భావి భవితవ్యమును దిద్దు

సదవకాశ మిచ్చె-చరిత-మనకు;

తర తరాల ప్రజలు తలలూపి అగింప

వెలుగు బాట నేడు వేయవచ్చు.

కట్టవలె పునాది-మట్టి పాతర త్రవ్వి

క్రొ త్త-రాళ్ళు-పగులగొట్టి_తెమ్ము!

ఆలపు-ఆట విడుపు_ఆలస్య మిక వద్దు;

తరలిరమ్ము లేచి తత్ క్షణమ్ము.

కష్టపడుటకంటె గత్యంతరము లేదు

కారుగాక చెమట! కంటి నీరు!

ప్రగతి కోరు నేటి ప్రమిదలే వెలిగించు

వేలకొలది కాగడాలు - రేపు.

**అ వ స ర పు రు ష కా ర ము**

"కన్న తల్లి"-పురుషకార మే-ప్రగతికి;
అవసరమ్ము నేర్పు-అఖిల కళల;
"తరుణమునకు"-"కృషికి" దాంపత్య మమరుచో
పుట్టు బిడ్డ పేరు పూర్ణ శుభము.

తెలివి యున్న వాని తేజంబు హెచ్చించు;
బుద్ధిహీనునైన పూజ్యు చేయు;
మట్టి బెడ్డనైన మార్చు బంగారుగా
పురుషకార మపర పరసు వేది

మూగవాడు_చేతి సైగ చే-మాటాడు!
స్పర్శచేత-గ్రుడ్డివాడు-చూచు!
వినును-చెవిటివాడు-కనులతో పసిగట్టి!
పేరు పెరువు పురుషకార మరియు.

యువకులై న వారి కుత్సాహమును పెంచు;
ప్రౌఢ జనుల కిచ్చు ప్రత్యయమ్ము;
వృద్ధ జనుల కొసగు-విశ్రాంతి ఆ పైన
పురుషకార నిరతి_కొరత దీర్చు.

ప్రజ్ఞ యెంత యున్న పని చేయకున్నచో
బండ బారిన బ్రదు కెండబారు;
చేతగానివాడు- స్థిర దీక్ష యున్నచో
సిద్ధహస్తు డగును-చేవ` దేరి.

**అశ్వ మే ధ ము**

అవధరింపవయ్య _ ఆద్యంత రహిత - ఓ
కాల పురుష| గుండె కదలి కరగ;
కాంచియుందు వీవు -కల్ప కల్పాంతముల్
నరుని వంటి జీవి నరసినావొ?

సకల సృష్టి పైన సార్వభౌమత_గోరి
నవ్య నాగరికత_నడుపుచున్న
అశ్వమేధమునకు- అవబృధం బెప్పుడో
చెప్పు నాదు మెదడు చెవులలోన.

ఇట్టి విపరిణామ మీ వితః పూర్వమ్ము
చూచియుండవచ్చు! చోద్యమేమి?
కల్పములన-నీకు—కను రెప్ప పాటులే!
అరసినావు సృష్టి ఆవృతములు.

లెక్కపెట్టలేని పెక్కు ప్రదక్షిణల్
భూమి యనెడి మట్టి బొంగరమ్ము
సూర్యుడనెడి చిన్ని చుక్క చుట్టును చేయు
నాడు_నరుడు లేనినాడు-నేడు.

గోచరించు వివిధ గోళాలు గగనాన
చీరలోని చిరుత చిల్లు లట్లు !
పరిణమించెగాక_పాంచభౌతిక మైన
ప్రకృతి_తుట్టతుదకు-వికృతి యైచు.

మెదడు దున్ని రంతె - 'అది కాదు' ! 'ఇది కాదు' !
నిర్వచింపలేదు-నిజము_ఋషులు!
వీడ జాల డెపుడు_విచికిత్స_మనుజుండు
మరలుగాక పెదకి మనసు-వాక్కు.

ప్రాగభావమైన_ప్రధ్వంసనాభావ
మైన-తర్క మెల్ల వ్యర్థ ఘోష!
మాయ సృష్టి-మానవ భ్రమ సుమా!
బూటకమ్ము-మేటి నీటి బుడగ.

మానవావతరణ_మానవోదంతమ్ము
చిత్రమైన విశ్వ శిల్పమందు
పరిహరింపదగిన ప్రక్షిప్తమా? యేమి ?
అసలు కథకు-అంత రార్థ మేధి?

**అ శ్రు త ర్ప ణ ము**

తాను బోయవాని దౌష్ట్యమ్ము గర్హించి
కంటి నీరు సెవడు కవిత చేసె !
తొలి దిగంబర కవి - అలనాటి వాల్మీకి
సుకవి శోక భరము-శ్లోక మగును

విశ్వ చరితయందు-వేమన కవియోగి
అసలు స్వచ్ఛమౌ దిగంబరుండు!
దిద్దుకొనెను బ్రదుకు-త్రికరణ శుద్ధిగా
అశ్రు తర్పణమ్ము అతని కవిత

ప్రతి కవీశ్వరుండు పైగంబరుండు సదా;
ధర - నిరు క్త వ క్త - ద్రష్ట - స్రష్ట;
ప్రతి కవీశ్వరుండు - వసుధైక పౌరుండు
అంతరాత్మలో దిగంబరుండు,

ఆ సనాతన కవితా సంప్రదాయమ్ము
విస్మరింపకుండ - విడువకుండ
బధిర సంఘమునకు - బహిరంతరాత్మలై
కదల గలరు - కవులు - మెదల గలరు.

**అష్టకష్టాలు**

ప్రేమ పెండ్లి జరిగి - ప్రేయసి పసిపాప
నిడి విడాకు లొసగి వెడలె నేని!
ఎన్నికలకు నిల్చి - ఉన్న ధనము పెట్టి
ఓట్లెన్నొ కొని కూడ ఓడె నేని!
మెరసి మొదట వెండి తెరపైన తారయై
పుడమిపైన పిదప పడియె నేని!
ఉ త్తముండగువాడు - ఒక చెడ్డ అధికారి
చేతిక్రింద కొలువు చేయు నేని !
సాటివానికి - ఉండి జామీను - ప్రతి నెల
పావు జీతమ్ము కోల్పోవు నేని!
పాత కారొకటి దర్పము చూప అప్పు చే
సినయట్టి డబ్బుతో కొనియె నేని!
ఊడెనేని ఉన్న - ఉన్నతోద్యోగమ్ము!
పెండ్లి కాని ఆడ పిల్ల లున్న!
ఆధునిక యుగాన - అష్టకష్టము లౌను
అనుభవైక వేద్య మార్యులార.

**అహం బ్రహ్మా స్మి**

బ్రహ్మ - నరుని - తనకు ప్రతిబింబ మూర్తిగా
సృష్టి చేసినట్లు - చెప్పబడియె;
తానె - బ్రహ్మ యంచు - తలపోసె మనుజుండు
గగురుపొడువ సృష్టిక ర్త యెడద .

అణువు లెల్ల తుదకు అసలు శక్తిగ మార
ఏమి మిగిలి యుండు సృష్టియందు?
బ్రహ్మ_మాయ_సృష్టి పర్యాయ పదములా?
అర్ధ మేమి - "త త్త్వమసి" - యటన్న.

**అ హ ము**

జగతిలోన ఎవడు సర్వజ్ఞ మేధావి ?
ధరణి కెవ్వ డేక ధర్మ కర్త?
బ్రదుకు హక్కు గలదు - ప్రత్యర్థులకు గూడ;
అసహనమ్ము వలదు - అహము వలదు.

**అహము**

ఉండ దెపుడు ధర్మ మొక వైపు మాత్రమే!
సంగరాలు జరుగు! సంధి జరుగు!
సహన మాత్మ - ఏ ప్రజా స్వామ్యమున కైన
నేత లోని అహము - రోత గొలుపు.

**అ హ ము**

కూడు - పాసి, కంపుగొట్టు మర్నాటికే !
క్రుళ్ళినపుడు కంపుగొట్టు_పండు !
అతిథి - కంపుగొట్టు - అయిదు రోజుల పైన !
అహము కంపుగొట్టు - ఆ క్షణంబె !

**అసమర్థ దుర్జనుడు**

కొట్టి చంపివేయ – కోర్కి యున్నదిగాని
వేటు వేయలేడు భీతిచేత !
ధైర్య ముండవలయు - తప్పు చేయుటకై న |
సజ్జనుండు వేరు ! చవట వేరు

**అంకెలు**

అక్షరాలతోడ-అంకెలే లేకుండ
మాటలాడరాదు మనిషి నేడు;
ఋజువు చేయకుండ రేఖాపటాలతో !
సవ్య నాగరికత నమ్మలేదు! !

**ఆగర్భ మేధా వి**

జననమందినపుడు జను లెల్ల శిశువులే !
కష్టపడక - ఎవరు - ఘనులు గారు;
అవనియందు - లేడు - ఆగర్భ మేధావి;
ఓర్పు వయసు వచ్చి - నేర్పు - అగును.

**ఆ ఆచరణము**

మాటలాడు నపుడు మనుజుండు – తానేమి
నేర్చుకొనుట లేదు? నేర్పలేడు !!
సత్ ప్రవర్తనమ్మె సరియైన పాఠమ్ము; -
ఆచరణము ముఖ్య మరపు లేల?

**ఆ డ పి ల్ల చ దువు**

జీవకోటి కెల్ల యావజ్జగత్తులో
జనని - ప్రథమ పాఠశాల _ సుమ్ము !
వేగ బాగుపడును విద్యా విధానమ్ము
మొదట ఆడ్ల పిల్ల చదువు చూడ.

**ఆత్మ హ త్య**

ఆసలన్ని ఉడిగి ఆత్మహత్యకు పూను
పిచ్చి గుబులు వచ్చి పిరికివాడు;
వీరు డైన యెడల పోరాడు బ్రదుకుతో
వెక్కిరించు జగతి ధిక్కరించి.

**ఆయము**

బీదవాడెవండు ? ఆదాయమును మించి
వ్యయము చేయు నట్టి వ్యర్థ జీవి!
అవనిలోన ఎవ్వ డైశ్వర్యవంతుండు?
ఆయ మెరిగి వ్యయము చేయువాడు.

**ఆయుధాలు**

ఆయుధాలు గెలిచె అవనిలో "యుద్ధాలు ! !
వీరమరణ మొంద పౌరుషమ్ము !
యుద్ధమునకు పోవు టున్మాదమే యౌను!
క్రొత్త ఆయుధాలు కూర్చుకొనక,

**ఆర్జవము**

ప్రజల మెప్పు వడిసి - ఋజు వ ర్తనముతోడ
పరమ మూర్ఖుడైన - బ్రదుకవచ్చు !
తప్పు దారి పట్ట - గొప్ప మేధావులే
పట్టుబడక బోరు - తుట్టతుదకు ;

**అర్ధశాస్త్రము**

వేలకొలది కల్పవృక్షాలు పొలుపొంది.
అర్థశాస్త్ర వనమునందు పెరుగు;
చెట్లు పూయవచ్చు సిద్ధాంత జగతిలో
కాయ నెపుడు ఒక్క కాయ గాని,

**ఈగ - తేనెటీగ**

మసలు పూలయందు మలమూత్రముల యందు
ఈగ పేరు! తేనెటీగ పేరు ;
విశ్వమందు కలరు వివిధ విమర్శకుల్
వారివారి తీరు పేరు పేరు !

**ఇంతి**

నోరు ... "కాదు" అనిన నొసలు "ఔ""ననవచ్చు !
మాట పేరు — కాంత మనసు పేరు !
ఇష్టమన్న మాటె - "ఇపుడు కాద"ని యన్న !
"ఇష్ట" మనిన ఆమె ఇంతి కాదు !

**ఇంద్ర ధ ను వు**

కనులు కార్చకుండ కన్నీరు మున్నీరు
ఎడద విరియి దెపుడు ఇంద్ర ధనువు !
బ్రదుకు విరియ దెపుడు - పడకుండ కడగండ్లు
వజ్ర మరిగి సానబట్ట మెరయు.

**ఈ శ్వ రు డు**

మంచి చెడ్డలనెడి మాటలే - లేవింక!
నరుల నీశ్వరుండె నడపుచున్న!!
మనిషి బ్రదుకు అనిన మంచి చెడ్డ లె యైన
ఎందు కింక మనకు ఈశ్వరుండు ?

**ఈ శావాస్య ము**

అతడు వాఙ్మనముల కప్రాప్యుడే యైన !
ఉన్న - లేనియట్లే ఉర్వి కెల్ల;
ఈ జగత్తు సర్వ మీూశ్వరుండే యైన !
ఏల ఇంక అతని గోల ప్రజకు ?

**ఈ సడింపు**

పరుల బాధలు గాంచి బాష్పాలు రాల్చిన;

పసిపాప యని నిన్ను పలుక గలరు!

పరిహాసములు మెచ్చి పరవశించుచు నవ్వ,

పిచ్చివాడని నిన్ను పిలువగలరు !

సుకుమార హృదయమ్ము సుంత కన్పించిన,

పారుబోతని నీకు పేరు గలుగు!

స్థైర్యమ్ము వహియంచి క్షమ చూప కంచరి

గాడిద బిరుదమ్ము గాంచగలవు !

క్రూర రాక్షసుడవు కోపగించిన సుంత !

చవట పీను వీవు శాంత మున్న !

దోషములను వెదకు దుర్మేధనుల చేత

ఈసడింపు దప్ప దెవరికైన

**ఉపకారము**

ఉభయ తారకమ్ము ఉపకార మొనరింప

సాయమందు వాడు సౌఖ్యమందు;

చేసినట్టి వాడు చిత్త శాంతిని బొందు

సంతసింపగలరు సకల జనులు,

**ఉపకారి**

ప్రతిభయున్నవాడు పదివేల కొకడుండు!

లేడు - అసలు ప్రజ్ఞ లేనివాడు;

యోగ్యుడై నవాని కుపకార మొనరింప

పాటుపడెడివాడు కోటి కొకడు.

**ఉ ప్పె న**

ప్రజల నణచి వేయు పరిపాలనములోన
శాంతి - గుండె పగిలి చచ్చిపోవు
సంఘమందు దాగు స్తబ్ధ చైతన్యమ్ము
ఉబుకు ఒక్కసారి ఉప్పెనవలె !'

**ఉభయతారకము**

మేటి పదవి నున్న మేధావి తేజస్సు
ఇనుమడింప జేసికొనుట - సులువు ;
యోగ్యుడై నవాని కుపకార మొనరింప
ఉభయ తారకమ్ము! ఉత్తమమ్ము !

**ఉత్తేజము**

యోగి యగును మనిషి ఉత్తేజితుండైన !
పరిసరాలబట్టి పాపి యగును !
చదువు - చుట్టునున్న సాంఘిక స్థితిగతుల్
మనిషి మనసు నడత - మలచగలవు.

**ఉత్పత్తి**

పంచవచ్చు - రేపు - పెంచు ముందుత్పత్తి;
బీదరికము పోవు పృథ్వినుండి; '
వెడలిపోవు తమము వెలిగింప దీపమ్ము;
పట్టి చంపదగును బద్ధకమును

**ఎగతాళి**

మందు లేక మాను కందిరీగలు కుట్ట !
తేనెటీగ కుట్ట తేలు కుట్ట ;
వెక్కిరింత విసము విద్యాధికుడు కక్క!
మాన్పజాలునట్టి మందు లేదు.

**ఎత్తిపొడువు**

ఆర్జింపకున్నచో అప్రయోజకుడౌను !

పెర్చెనేని ధనము - పిసిని గొట్టు !

పట్టుదలను - చూప వట్టి భల్లూకమ్ము !

మార్దవమ్ము గలుగ - మట్టి బుర్ర !

బదులు పల్కకయున్న - బాధ్యతా రహితుండు !

పూర్వపక్షము చేయ - పొగరుబోతు !

తనక్రింది వారిపై దయజూప - దద్దమ్మ !

నియమపాలన చేయ నిష్ఠురుండు!

వదరుబోతు చతురవాక్ ప్రౌఢిమలు గల్గ :

నాల్క కదుపకున్న నంగనాచి !

దూయబట్టునట్టి దుర్విమర్శకులచే

ఎత్తిపొడుపు తప్ప దెవరికైన !

**ఎదుటి వాడు**

ఎదుటివాని నీవు అదరించి బెదరించి

చేయవచ్చు నోరు మూయునటుల ;

కాని - ఆత డెపుడు కాబోడు నీవాడు !

అదను దొరికి నపుడు ఎదురు తిరుగు.

**ఎదు రీత**

వాలు వెంట యీది-కాలవాహినిలోన

గట్టు చేరగలరు గడుసువారు;

ఎవడొ ! ఒక్క డేటి కెదురీది జీవించు!

భావిచరిత కొజ్జబంతి యగుచు !!

**ఏడుపు**

కడుపు మాడి నవుడు గర్జించు సింహమ్ము,
కనలి ఓండ్ర పెట్టు గార్దభమ్ము;
పుడమిమీద నరుడు పుట్టినప్పటినుండి
హేతువేమిలేక యేడ్చుచుండు!

**ఏది నరకం? ఏది నాకం?**

మార్చలేని దేది మనుజుండు దీక్షతో !
చెడ్డ దేది కలదు సృష్టియందు?
తెలివి తేటలున్న దేశభక్తులు చేర
నరక మైన మారి నాక మగును !

**ఏనుగు**

వెలికి తీయవచ్చు సులువుగా ఎవరైన
కుక్క - పడినయెడల గోతిలోన;
ఎవరు తీయగలరు ఏనుగే పడినచో??
చూడగలరు జనము చోద్యమంది !!

**ఒక్క నా ల్క**

రెండు చెవులతోడ ! రెండు కన్నులతోడ !
నరుడు పుట్టె - ఒక్క నాల్కతోడ !
కనుక - రెండు రెట్లు _ వినకుండ - కనకుండ;
పెదవి కదుపరాదు - పెద్ద మనిషి;

**ఒక్క వ్యక్తి**

యుక్తి కలిగి - కలిగి ఉన్నతాదర్శముల్
ఒకడు - దేశమందు ఉన్నయెడల
చాలు - స్వర్ణ శకము చరితలో ఉదయించు;
పొగడు పుడమి యెల్ల పులకరించి.

**ఒ జ్జ**

మట్టితోడ గాని మైనమ్ముతో గాని

ప్రతిభయున్న శిల్పి ప్రతిమ చేయు;

మనసు - గుండె - దిద్ది, మనిషి రూపము తీర్చు

ఒజ్జ కెట్టి ప్రజ్ఞ ఉండవలయు ?

**ఓటమి - గెలు పు**

ఓడిపోయినపుడు ఊరకుండుట మేలు

సరకుగొనరు గాన సాకు లెవరు !

విజయ మందినపుడు వినయ మౌనము చాలు;

ప్రస్తుతించగలరు ప్రక్కవారు.

**ఓటు**

అర్హు  డెనవాని అన్వేషణము సల్పి

కన్య నీయదగును కాళ్ళు కడిగి;

ఓటు చేయదగును యోగ్యుండు నిలుచుచో

అతడు నోరు విప్పి అడుగకుండ.

**ఔషధాలు**

అన్ని రోగములకు ఔషధమ్ములు వచ్చె;

సగటు వయసు పెరిగె జగతిలోన !

జబ్బుచేసి ఇంక చావ నక్కరలేదు

మందువలన తప్ప మనుజు లెవరు !

**అంతరాత్మ**

కవిత విశ్వ మెల్ల కాపాడగలదయా

దానవులను మార్చి మానవులుగ;

కడిగివేయగలదు - ఎడద మాలిన్యమ్ము;

అఖిల భువికి - కవిత అంతరాత్మ.

**అందము**

నరుని కంద మేది? నలుబదేండ్లకుపైన?
జుట్టు కాదు ! మీస కట్టు గాదు !
తెలుపు - నలుపు గాదు ! తెలివి తేటలు గాదు !
మనసులోని మంచితనము గాని.

**అంబేడ్కరు**

“పొందగలరె కోలుపోయిన హక్కుల
ఎవ్వరైన బిచ్చ మెత్తు కొన్న?
పొందవలయు - జయము - పోరాట మొనరించి
పుడమి తల్లి గుండె పులకరింప !!

**క ట్టు క థ లు**

కాళ్లు లేక - కట్టుకథలు - కన్నులు లేక
దెసలు చుట్టి ఎట్లు తిరిగివచ్చు?
మురిసిపోయి - ప్రజలు ముత్యాల పల్లకీ
పైన ప్రక్క ఊరు పంపగలరు ||

**క ట్న ము**

ఏమి లాభ మయ్యి ఎఱలేని గాలమ్ము?
చేప లుండవచ్చు చెరువు నిండ !
కన్నె పెండ్లియందు కట్నమే ముఖ్యమ్ము;
చక్కదనము కాదు - చదువు గాదు.

**కత్తి**

దొంగ చేతిలోన - మంగలి చేతిలో
ఉర్వి యెల్ల కత్తు లుండవచ్చు;
వీరు చేతి కత్తి విలువ పేరుగ నుండు
ధర్మ రక్షకొరకు తాల్చి నపుడు!

**కరుణ**

ఆదుకొనుట మేలు - ఆపన్నులౌవారి;
కరుణ - అప్పువోలె తిరిగిరాదు;
వచ్చె నేని - చక్ర వడ్డీని గొనితెచ్చు!
రానియెడల కీర్తియైన మిగులు.

**కలము**

పాప చేతిలోన వ్యాపారి చేతిలో
ఉర్వి నెల్ల కలము లుండవచ్చు:
కలము విలువ పేరు కవివర్యు చేతిలో
ప్రజల మేలుకొరకు వ్రాసినపుడు!

**కవి**

కవి వరేణ్యు డనిన అవతార పురుషుండు
సాహితీ చరిత్ర చదువు నపుడు!
కవి యొకండు ప్రక్క గదిలోన నివసింప
ప్రహసనమ్ములోని పాత్ర అతడు !

**కవిత**

ఆకసమ్ము గ్రమ్మి ఆవరించును గాని
ఎవరిచేతి కందు ఇంద్రధనువు?
ఇంపుగొలుపు కవిత హృదయైక వేద్యమ్ము
వింగడింపరాదు వెంబడించి.

**కవితాకృతి**

కవిత - నరుల యెడద కరగింపవలె గాని
పగులగొట్టరాదు పొగుల జేసి.
“వేడి" కాదు - కవిత - విరబూచు "వెన్నెలే"
కవిత - వాడి పదును కృత్తి కాదు.

**కవితాతపస్సు**

గూడు కట్టు కొనిన గొంగళి పురుగులై
    చేయగలరు కవులు చిర తపస్సు!
చివర - సీత కోక చిలుకలై సొగసుగా
    గగన వీధులందు ఎగురగలరు !!

**కవితావతారిక**

పలుకు - కవి యొకండు - పదిమంది అనుభూతి,
    మరపు రాని మంచి మాటలందు;
కవిత – మూల్గ రాదు గ్రంథాలయాలలో
    నలుగవలయు ప్రజల నాల్కలందు;

**కవులు**

యోగి - కవిగ మారు ఒక మెట్టు దిగజారి !
    కవికి కలదు ప్రతిభ గౌరవమ్ము !
పొగడి — కవులు - పేరు పోగొట్టు కున్నారు !
    తెగడి - ఇంక - పేరు తెచ్చుకొనరు!

**కళలు కళల కొరకేః**

గుండె దున్ని విత్తి పండించు కోసమే !!
    కవిత - కవిత కొరకె-కాదు ! కాదు !
కలలు గాంచి లలిత కళలెల్ల కృషి చేయు
    పుడమి క్రొత్త ప్రొద్దు పొడుపు కొరకు.

**కాకిగోల**

ఏమి చేయగలము? ఇది ప్రజా స్వామ్యమ్ము !
    పాలు దొరకు - ఏడ్చు బాలకులకె !
కలి యుగమ్మునందు కాకి గోలకు తప్ప
    కనులు విప్పి మేలుకొనరు - దొరలు !!

**కాకిరాయి**

మింట - వెలిగిపోవు - మిరుమిట్లతో - ఉల్క
కాకి రాయి ! భూమి సోకి నంత !!
పదవి యందు - నరుడు - వెదజల్లు తేజస్సు !
పదవి పోవు పిదప బ్రదుకు పేరు!

**కాల చ క్ర ము**

కాల చక్ర మెవడు గడియారమునుబోలె
తిరిగి వెనుక దెసకు త్రిప్పగలడు?
మేలు చేసియున్న మేటి ఆచారముల్
గడువు ముగిసినపుడు విడువవలయు

**కాల పాత్ర**

పక్వ మగును కాలపాత్రలో సర్వమ్ము!
అదను పదను కొరకు ఆగదగును !
అమ్మ ఉడక నేల? అన్నమ్ముతోపాటు !
కాయ ముదరకుండ కోయ రాదు.

**కాలము**

దాన మివ్వవచ్చు ధనము హెచ్చుగ నున్న;
కాల మివ్వరాదు గడియ యేని;
తరిగినట్టి ధనము తిరిగి హెచ్చుచునుండు.
జరిగినట్టి క్షణము తిరిగిరాదు.

**కాలయాపన**

ఆసవమ్ము విలువ అధికమ్ము కావచ్చు
వడ్డి - పెంపు చెందవచ్చు గాక !
మేలు కలుగబోదు కాలయాపనచేత;
అమృతమైన గూడ అగును విషము !

**కాలరూపము**

గోచరించు - ముందు - కొదమ సింగమువోలె
కలియ - ఎదురు బొదురు - గంగి గోవు
వెనుకనుండి చూడ - కనుపించు గాడిదై
కాల రూప మరియు కనుల కెపుడు.

**కార్య రూ రు డు**

చండశాసనుండు - సైన్యాధినేతయై
పేరు కెక్కె కార్యశూరు డనుచు;
ఆరితేరియున్న ఆరు భాషలలోన
మౌన మయ్యె అతని మాతృ భాష !!

**గ మ్యము**

పూల మొక్క ఉనికి పోల్చవచ్చును చేరి
పరిమళమ్ముబట్టి బాటసారి ;
గుర్తుపట్టవచ్చు గొప్పవారిని చూచి
కీర్తి కెక్కి నట్టి మూ ర్తిబట్టి.

**కుక్క పిల్ల**

కుక్క పిల్ల దెచ్చి కూర్మితో పెంచిన
కరువ దెపుడు నిన్ను మరువ దెపుడు!
పెరిగి పెద్దదైన ప్రేమతో వెంటాడు!
నరుని మాత్ర మట్లు నమ్మరాదు !!

**కు బు స ము**

గోచరింపవచ్చు కుబుసమ్ము మాత్రమే
పామువోలె తరచు భ్రాంతి గొలిపి ;
కష్టములను చూచి కంగారు పడవద్దు
సాహసమ్ము వలన జయము కలుగు.

**కునికి పాటు**

బడలి - కునికిపాట్లు పడవచ్చు సోమరుల్ !
బెదరి చెదరవచ్చు పిరికివారు !
చర్చ చేయవచ్చు సంశయాత్ములు చేరి!
కర్మయోగి - "జయము"- గాంచువరకు.

**కు రు పు**

పడెడువాడు తప్పు - ప్రక్కవా డెరుగునా?
కురుపు పెట్టు నట్టి గొప్ప సలుపు?
మెదడుచేటు_వట్టి మెట్టవేదాంతమ్ము !
చేతనై న - మేలు - చేయదగును.

**కృత్రిమ ప్రళయము**

సృష్టి చేయవచ్చు - కృత్రిమ ప్రళయమ్ము
యంత్ర నాగరికత అవనిమీద ;
అమలు పరచకున్న - అస్త్ర సన్న్యాసమ్ము
అంతరించు - నరుడు - అవనినుండి |

**క్రమశిక్షణ**

అల్పసంఖ్యయున్న ఆంగ్లేయ సేనతో
క్లైవు విజయ సిద్ధి గాంచగలిగె !
కాంచలేదు - జయము - క్రమశిక్షణము లేక
భరత భూమి — భావి చరితలోన

**క్రి య**

అది విశేషణముగ అగ్గింప బడుచుండు
'ప్రగతి' యనెడి మాట ప్రజల నోట;
నామవాచక మని - నమ్ము వ్యాకరణమ్ము,
ప్రాజ్ఞు దృష్టిలోన - ప్రగతి - క్రియయె!

**క్రొత్త పెర్రి**

క్రొత్త పెర్రి యేదో కొనితెచ్చుకొనకుండ
బ్రదుకలేరు ! తర తరాల ప్రజలు '
రక రకాల పిచ్చి రక్తి కట్టుచునుండు
పెద్ద ఉద్యమాల పేరుమీద !

**కంచె**

ప్రేమతోడ మొక్క పెంచు కోరికతోడ
వారు-కంచె వేసినారు చుట్టు;
మొక్క - చచ్చిపోయె ! మోడుగా రూపొంది !
తుదకు—మోసు లెత్తి బ్రదికె-కంచె!!

**కాంత మనసు**

కాంత మనసు ఎటుల కైవసంబగు నీకు
పెర్రి వానివోలె వెంటబడకు;
నుడువు మామె గాక కడలి తీరమ్ములో
గులకరాళ్లు చాల గల వటంచు !

**ఖండసత్యములు**

నిండు శాస్త్ర జగతి ఖండ సత్యాలతో;
పూర్ణ సత్య మేది పుడమి లేదు;
చేర్చదగును సమయ సీమానుగుణముగా
టీక గాని భాష్య టోక గాని.

**ఖర్జూరము**

ఘోర తపస్సు చేయ ఒనగూడును తియ్యని పండ్లు నీకు, ఖ
ర్జూరమ! అగ్నిలోన శిరసుంగలు కాలము దూర్చుచున్ - సదా
నీరములందు పాదములు నిల్పెద వీవు ఎడారిలో; నమ
స్కారము నీకు- నీ కఠిన సాధనకున్- జగదేక దీక్షకున్ !

**జై దు**

తప్పు తాము చేసి దండించు సంఘమ్ము

తోలు బొమ్మ నొకని, దోషి యనుచు !

ఖైదు - క్రూర సంఘ కార్పణ్య దుర్గమ్ము !

విఫల చట్టములకు - వింత గుర్తు !

**గడ్డి పువ్వు**

చిన్న మొక్కకంటే ! చిరు గడ్డి పువ్వు కంటె  !

చెప్ప నేర రెవరు గొప్ప కవిత ;

జలజల ప్రవహించు సెలయేటి కెరటాల

గాన మధురిమమ్ము గాంచవచ్చు.

**గణిత విద్య**

నిష్ప్రయోజకముగ నిరపేక్షకమ్ముగా

గణిత విద్య - వృద్ధి గాంచుగాత !

విద్య విద్యకొరకె వికసించి వర్ధిల్ల  !

విశ్వహితము వెల్లివిరియగలదు.

**గ మ్య ము**

వెడల దగదు, వెర్రి వేగముతోడ,

దారి తెలియ నపుడు _ తాళవలయు !

వెనుక నుండవచ్చు కనుచూపు మేరనే

చేరవలసినట్టి ఊరు - చూడు !

**గరిమనాభి**

స్నాన మాడవచ్చు జలము నింపిన తొట్టె !

పాల కడలి యంచు పలుక నేల?

మన మనస్సు - మతము - మనసీమ - సృష్టి కే

గరిమనాభి యనెడి గర్వ మేల?

**గాంధి**

కలరు — వేల కొలది - గాంధీకి వారసుల్!

భరత ఖండ మెల్ల పంచుకొనగ

ఎవ డహింసకొరకు ఎవడు సత్యమ్ముకై

నేడు పాటు వడెడి వాడు కలడు ??

**గానము**

మాట లేమి తెలుపు? మౌనమ్ము తెలుపురా !

మాట కంద నట్టి మధురిమములు !!

మౌన మేమి తెలుపు? గానమ్ము తెలుపురా!

ఎడద కందనట్టి యెల్ల లెల్ల !!

**గాడిద**

దొంగ - ఇంటిలోన - దూరినప్పుడు లేచి

మొరగవచ్చు - కుక్క - కరవవచ్చు!

కాని-లాభలేమి? గాడిదల్ పనిలేక

ఊరు మారు మ్రోగ ఓండ్ర పెట్ట!!

**గాలి వార్త**

వీణ రవము పేర్చి-వేణు నాదము తీర్చి

శుక పికాళి రుతుల శ్రుతులు గూర్చి

జగతి- గాలి వార్త - సంగీత సభ చేయ

వినని వార లెవరు వీను లొగ్గి?

**గ్రీకు నాగరికత**

గ్రీకు నాగరికత-లోక మంతయు గెల్చి

అంతరింపనేల వింత గొలిపి?

బానిసలకు-వారు- బానిసల్గా మారి

కోలుపోయినారు-గొప్పతనము.

**గృహ స్థు**

ఇల్లు - పిల్ల జెల్ల లిల్లాలు గలవాడు
పెద్ద పులియె యైన పిల్లి అగును!
తాను సంఘమునకు తాకట్టు పడియుండు
పంజరమ్ములోని పక్షి-మేలు !

**గుంజు**

వెలగ పండ్లయందు! వివిధ శాస్త్రములందు !
వేరు సెనగయందు! వేదమందు!
పడయలేము- డొలక-పగులగొట్టిన గాని
గింజ గాని లోని గుంజు గాని ! -

**గుండె**

పూవ-వాడిపోయి-పొలుపొందు-పిందెగా !
పిందె-మార్పు లెన్నొ పొందుచుండు !
మనిషి-యెదుగు కొలది - మార్పు చెందగవచ్చు !
గుండె-క్రుళ్ళవచ్చు_పండవచ్చు !

**గుండె లోతు**

ఎక్కవచ్చు పూని ఎవరెస్టు శిఖరమ్ము !
కడలి మునిగి లోతు-గాంచవచ్చు !
అంతు పట్టవచ్చు అణు గర్భమును చీల్చి !
కొలువరాదు మనిషి గుండె లోతు !

**గుంపు**

గుంపులోన చేరి కోలుపోవకు "గుర్తు"
వీడదగదు-ప్రశ్న వేయు శక్తి !
జనులు_కూడవచ్చు-స్వచ్ఛంద సంఘమై
గమన శక్తి యున్న-గమ్య మున్న !

**గు డ్ల గూ బ**

దాటనట్టివాడు తనయూరి పొలిమేర
గూడు విడువ నట్టి గుడ్ల గూబ '
క్రొత్త వెలుగు లెన్నొ గుండెలో చొరబారు
పర్యటించి వచ్చు భావుకులకు !

**గు రు డు**

నిన్ను మెచ్చి - నమ్మి నిజమైన ప్రేమతో
చేరినట్టివారి చెరపి నపుడు,
కావు నరుడవే - జగద్గురుండవు కావు ;
దొరవు కావు పేరు పురుగు వీవు.

**గొడుగు**

పైన - ఎండకాయ - వానకాలము నందు
గొడుగు చేత బట్టి వెడలు వాని
మోతబరు వటంచు మూర్ఖుండు హసియించు !
వాన కురియు వరకు వాగనిమ్ము !

**గొప్పతనము**

జన్మచేత శ క్తి సామర్థ్యములు వచ్చు,
చదువువలన వచ్చు జగతిలోన;
ఎగిరి వచ్చి పడును హేతువేమియు లేక
కొంతమంది మీద - గొప్పతనము !

**గ్రంథకర్త**

జాబితాలు ! అంకె సంకెళ్ళ గరిడీలు!
బీజ గణిత సూత్ర భేషజములు !
బృహదధికరణములు ! రేఖాపటార్భటుల్
కలిపికొట్టువాడె గ్రంథక ర్త !

**ఘ న త**

ఒక్క నిముసమందు _ ఒక అర్ధ రాత్రిలో

ఎవ్వ డయ్యె ఘనుడు ? ఎచటనైన ?

రాత్రి - కలలు గాంచు - శ్రమియించు పవలెల్ల !

పైకి వచ్చువరకు ప్రగతిశీలి.

**చ ట్ట ము**

ఈగ – చిక్కుకొనును! ఏనుగుల్ కాదయా !

చట్ట శృంఖలములు సాలెగూళ్ళు !

ఇరుకుకొనును కటికి నిరుపేద అనదయై !

తప్పుకొనుట సులువు గొప్పవాడు.

**చ దు వు**

అభ్యుదయము నంద ఆసక్తి రేకెత్తె!

ప్రశ్న వేయు శక్తి ప్రబలె ప్రజల ;

మతమునుండి దృష్టి మరలింప చదువుపై,

భరత దేశ మింక బాగు పడును.

ఏలవచ్చు జనుల పోలీసు జులుముతో

'కుటిల రాజ నీతి'_కొన్ని నాళ్ళు !

చదువు _ తరతరాల - శాంతితో - పాలించు !

మంచి మార్గమందు మలచి ప్రజల,

తప్పులున్న - ముప్పు - తాత్కాలికమ్ముగా

చట్టమందు ఆనకట్టయందు !

తరుణ హృదికి నిప్పు! తర తరాలకు ముప్పు -

తప్పులున్న చదువు చెప్పుచున్న !

ఒక్క కుఱ్ఱవాడు - ఒనరించు నేరమ్ము,
తల్లితండ్రియొక్క తప్పుతోడ,
వందమంది పెద్దవారి వైఫల్యమ్ము,
చదువులోని లోటు - చాటగలదు !

మనసు మార్చలేదు మరణ దండన యైన !
చదువు - మలచగలదు - హృదులనెల్ల !
జైళ్ళపైని ఖర్చు చదువుపై మళ్ళించి,
సంస్కరింపదగును జగతియెల్ల.

శైశవమ్ములోన సరియైన చదు వున్న
ఎదిగి - ఎరిగి నేర మెవడు చేయు?
మనుజ లోకమందు మానవత్వము నిల్ప.
విజయ మందలేదు విద్య తప్ప.

లోకమందు తరచు భూకంపములవల్ల
కానుపించునట్టి - హాని - కలుగు ;
చదువులందు తరచు సంస్కరణలవల్ల
కానుపించనట్టి - హాని - కలుగు !

కొంత నేర్చుకొనును గురు సన్నిధిని_విద్య
కొంత నేర్పవచ్చు సొంత తెలివి !
సంక్రమించు కొంత సహపాఠకుల వల్ల ;
జీవయాత్ర నేర్పు శేష విద్య.

మతము విఫల మయ్యె - మనుజ సంఘములలో
పెంచలేకపోయె మంచితనము !
విద్య తప్ప - నేడు వేరొండు గతి లేదు!
మనసు దున్ని మంచితనము పెంచ.

**చ ను వు**

ఇంటిలోన నైన ! ఏకాంతముగ నైన!

సరస మాడరాదు చవటతోడ;

పరిహసింప గలడు - పదిమందిలో - వాడు !

ధనము ఇవ్వవచ్చు చనువు బదులు.

**చర్చి**

నల్ల వా డొకండు - తెల్లవారల "చర్చి"

లోని కరుగ లేక - దీను డయ్యె !

కానిపించి పలికె కలలోన పరమాత్మ ;

తావు లే ద టంచు తనకె అచట !

**చరిత్ర**

తెలియ చెప్పు - చరిత- తేదీలు మాత్రమే !

చెప్ప లేదు గుండె విప్పి చూపి ;

పెద్ద పెద్ద నిలువుటద్దాల మేడయై ;

వాఙ్మయమ్ము - ప్రకృతి పట్టిచూపు.

**చిత్త శుద్ధి**

సిగ్గుచేటు ! వద్దు - ఛీ ఛీ కుతంత్రముల్ !

బూటకములు కపట నాటకములు !

అపజయమ్ము — లేదు ఆదర్శముల కెప్డు !

సృష్టి నేలగలదు - చిత్త శుద్ధి.

చదువు కంటె - శక్తి సామర్థ్యముల కంటె !

మెరుపు తీగ వంటి మెదడు కంటె !

నటన కంటె - గొప్ప నక్కజిత్తుల కంటె .

సృష్టి నేలగలదు చిత్త శుద్ధి.

**చి త్ర లే ఖ న ము**

దున్నపోతు కొట్టె తోకతో గోడ పై !
బురద గుంటనుండి మరలి వచ్చి ;
నవ్య చిత్రలేఖనమ్ములో ! అల్లదే !
వచ్చె ననిరి - జనము - “స్వర్ణ శకము”.

**చి న్న త న ము**

చిన్నతనమునందు చీకాకు పడిగూడ
బుద్ధిమంతు డెదిగి వృద్ధి పొందు ;
పెద్ద వృక్ష మగును - పెక్కు రెమ్మలు వేసి !
చిగురు చిదుమబడిన - చిన్న మొక్క!!

**చె డ్డ వా డు**

గౌరవింపలేడు ! చేరదీయును గాని,
స్నేహితుండుగూడ చెడ్డవాని !
సజ్జనులకు చూపు - శత్రువైననుగూడ
గుప్త గౌరవమ్ము గుండెలోన.

**చె త్త**

విలువ వచ్చు శాస్త్ర విజ్ఞాన మహిమచే
చెరకు పిప్పి కైన - చెత్త కైన!
చచ్చుపుచ్చు తుక్కు 'సంపత్తి' యగుగాత ! !
పనికిరాని దేది ప్రజ్ఞ యున్న ?

**చెఱసాల**

ఇనుప కటకటాలు ! ఎత్తైన గోడలు !
కఠిన శృంఖలాలు ! ఖైదు గావు!
నిశ్చితాత్ముడైన నిర్దోషి దృష్టిలో
అది - పవిత్రమైన ఆశ్రమంబె !

**చేటభారత ము**

మరువలేని ఒక్క మధుర వాక్యము చాలు
వ్రాయ నేల చేట భారతమ్ము !
వేడి-వాడి గలుగు మూడు ముక్కలు చాలు,
విప్లవమ్ము తెచ్చు విశ్వమందు!

**చొరవ**

అందరుండవచ్చు అణగారి వెరపుతో !
చొరవ చేసి ముందు కురుక ఒకడు !
అద్భుతముగ చేరి అతని జెండా నీడ
నిలువ గలరు వేల కొలది జనులు.

**చైనీయ సోదరు లు**

చరిత పులకరింప చైనీయ సోదరుల్
త్యాగులైరి ! కర్మయోగులైరి !
వెడలినారు - మూఢ విశ్వాసములు వీడి!
మతము వీడి నల్లమందు వీడి !

**జ న్మ భూమి**

మాతృభాష కంటే మాతృ దేశము కంటె !
మధురమైన దేది మానవులకు ?
స్వర్గ మైన ఏమి సౌఖ్యమ్ము లొనగూర్చు ?
తల్లి కంటె ! సొంత యిల్లు కంటె !

**జబ్బు**

కన్న బిడ్డవోలె గారాబమును చేసి
పెంచరాదు - జబ్బు - ప్రేమతోడ ;
మందు వాడకున్న మనుజ దేహమ్ములో
సహజ శ క్తివలన - జబ్బు కుదురు !

**జయము**

దాపురించు గొప్ప తలనొప్పి తరచుగా
జయము పొంది నట్టి క్షణమునందు !
నెగ్గి నపుడు రాదు - నిజమైన విశ్రాంతి
నెత్తిమీద పడును క్రొత్త బరువు.

"జయము" - కాన నగును శబ్దకోశములందు
"పని"కి ముందు పుటల వరుసలోన;
అనుభవమ్ము దెలుపు "పని"కి పిమ్మట గాని
జయము రా దటంచు జగతిలోన.

**జా గృతి**

మంచివారు నిదుర మైకమ్ములో నుండ
చేయలేని దేది - చెడ్డవారు ?
నిత్య నిర్ని మేష నిర్నిద్ర జాగృతి
నెరపవలయు స్వేచ్ఛకొరకు ప్రజలు.

**జ్ఞాన సాగరము**

చాలమంది జ్ఞానసాగరమును చేరి
గులక రాళ్ళ నేరుకొనెడి వారె !
వెలికి దీయువారు విలువైన రత్నాలు
ఎంతమంది యుందు రీ ధరిత్రి !

**జి జ్ఞా స**

చెప్పరాదు - చదువు - జిజ్ఞాస లేనిచో
మెదడు పాడు చేసి ! మెడలు వంచి !
ఎక్కవచ్చు - ఎద్దు - ఎద కాని ఆవుపై !
చొంగ కారు గాని! చూలు కాదు !

**జీవితము**

బ్రదుకు అనిన - పలక బలపమ్ము చేబూని
కొక్కిరించు సులువు లెక్క గాదు!
విశ్వ సృష్టిలోని వెలుగు నీడలు చూపు
చిత్రలేఖనమ్ము జీవితమ్ము ;

**జీ వి త ము**

గణితశాస్త్రమందు కావచ్చు సతతమ్ము
కూడినపుడు మూడు మూడు – ఆరు !
జీవితమ్ములోన కావచ్చు పలుమారు
ఐదు లేక ఏడు - ఆరు కాదు.

**తదనంతరదానము**

తాను బ్రదికియుండి దానమ్ము చేయగా
త్యాగయోగ మగును; ధర్మ మగును
త్యాగ మేమి లేదు - అది వారసుల సొత్తు !
తన అనంతరమ్ము దాన మనిన.

**త థా స్తు**

దివిని ఏ తథాస్తు దేవతల్ లేరయా !
మంచి మార్పు లడ్డగించువారు ;
ధరణి కలరయా 'యథాతథ దానవుల్'
ఆస్తి వదల లేని స్వార్థపరులు !

**త ల పు**

గుండె దున్ని - ఎవరు పండించ గలరయా ?
కవిత చెప్పు గొప్ప కవులు తప్ప !
కార్యశూరు లెల్ల - కవుల మానస సుతుల్ !
ఎల్ల పనులు కన్నతల్లి - "తలపు."

**తల్లి**

విశ్వ మెల్ల వెలుగు వెదజల్లు బడి యేది ?

మంచి యెడద యున్న మాత యొడియె ;

ఊయె లూపు చేయి ఉర్వి యంతటి నేలు

తల్లి కంటె వేరు దైవ మేది ?

**మి థ్యా జ గ త్తు**

మిగత వన్ని తలప మిథ్యయే ! మిథ్యయే !

తల్లిప్రేమ తప్ప ధరణిలోన

తథ్యమైన ఒక్క దైవమే ఉన్నచో

తల్లికంటె వేరు దైవ మేది ?

**త్యాగి**

వక్త పిలుపు - దేశ భక్తి నింపగవచ్చు!

మంచి రచన మనసు మార్చవచ్చు !

ఓడ్చునేని త్యాగి ఒక్క రక్తపు బొట్టు

దేశమందు వచ్చు తిరుగుబాటు.

**త్రాగుబోతు**

త్రాగుబోతు - సగము బ్రతికియున్నట్లు లెక్క!

కాని చేర్చరాదు కాటి కతని !

అతడు - సగము చచ్చినట్టి హేతువుచేత

పనికిరాడు - పెద్ద పదవి కెపుడు !

**తెలివి**

పరమ మూర్ఖులైన పలువ లెందరు లేరు?

పట్టభద్రులైన వారిలోన,

మంచి తెలివి యున్న మనుజు లెందరు లేరు !

చదువుకొనని రైతు జనులలోన ?

**తెలుగు పద్య ము**

అంద చంద మొలుకు ఛందస్సు రుచి గల్గి
యతులు గలిగి - ప్రాస గతులు గలిగి
తీపి లయలు గలిగి - తెలుగులో పద్యాలు
హొయలు గలిగి - యెడద లూప గలవు.

**తిండిలేనివాడు**

మతము! లలిత కళలు! మానవత్వము! ప్రేమ|
దేశభక్తి! సాహితీ పిపాస !
ఖ్యాతి ! ప్రగతిగీతి ! నీతి నిజాయితీ !
తిండి లేని వాడు - తెలియ లేడు.

**తృప్తి**

నిరత భోగ వాంఛ - నిత్య దారిద్ర్యమ్ము
తృప్తి కంటె నృప కిరీట మేది??
త్యాగ బుద్ధి కంటే ఐశ్వర్యమే లేదు ;
కోర్కి లేనివాడు గొప్పవాడు.

**తెరమరుగు సేవ**

పేరు కుండవచ్చు పెక్కు సంఘాలలో
పనికిరాని పెద్ద మనుషు లెల్ల
ఎవడొ - ప్రగతిశీలి ఏకాంత దీక్షతో
తెర మరుగున పనులు తీర్చి దిద్దు.

**తెలివి**

మట్టిలోన నుండి మాణిక్యములు పుట్టు !
గొప్పతనము ఎవరి గుత్త కాదు;
బురదలోన నుండి పుట్టదా పద్మమ్ము ?
తెలివి పుట్టు చోటు తెలియ రాదు.

**తొలి ఉషస్సులు**

తోచు - కొండ కొసల తొలి యుషస్సుల వెల్గు
లోక మెల్ల నిదురలోన మునుగ !
క్రాంత దర్శులైన కవుల కన్నుల ముందు
అవతరించు తొలుత నవ యుగమ్ము !

**దయ**

విత్తనాలు నాటి పెదజల్ల మట్టిలో
పంట వంద రెట్లు పండుచుండు;
తరుణ మతులలోన దయ నాట గలుగుచో !
వెల్లివిరియు పంట వేయి రెట్లు,

**దండనీతి**

ఫాల నేత్ర మెపుడు - పరమేశ్వరుడు గూడ
ముగ్ధమోహనముగ మూసి యుంచు ;
నేత నేర్వ దగిన నీతి పాఠ మి కేది ?
తరచు వాడరాదు - దండ నీతి.

**దానము**

అర్హుడై నవాని కడిగించు కొనకుండ
దాన మిచ్చువాడు ధన్యజీవి ;
లంచ మగును గాని ఎంచ దానము గాదు
ప్రతిఫలమ్ము కొరకు ప్రాకులాడ.

**దివ్వె**

దివ్వె తమము నడిగె - దివ్య తేజస్సుతో,
"ఇంక ఎచట నుందు వీవ" టంచు;
"నీకు తెలియకుండ నీ నీడలోననే
నిలిచియుందు" ననుచు పలికె _ తమము.

**దీక్ష**

అర్థు లుండ వచ్చు అడుగునే అణగారి

ప్రతిభ - కుములవచ్చు పైకి రాక

దీక్ష లేని యెడల తెలివి తేటలు వృథా !

దీక్ష కెపుడు జయము దిగ్విజయము.

**దీక్ష - ద క్ష త**

లోక మెల్ల గెలుచు - ఏకాంత దీక్షయే !

దక్షత నిదురించు తరుణ మందు !

దీక్ష నెగ్గలేదు దక్షత నెదిరించి

సృష్టి వణకు నుభయ మేకమైన.

**దుఃఖాను భూతి**

సుఖము పెంచ నేరు సుకుమార దేహమ్ము!

మంచి మనసు నేది పెంచగలదు ?

దున్ని సాన బట్టు దుఃఖానుభూతియే

బ్రదుకు కిచ్చు దీప్తి పదను బెట్టి !

**దేనికొరకు?**

దేని కొరకు మతము ? దేనికోసము కళల్ ?

తెలివి తేట - చదువు - దేని కొరకు ?

దేని కొరకు ? సకల మానవ జ్ఞానమ్ము ?

ఎడద క్రొత్త యెల్ల లెదుగు కొరకు !

**దేవుడు**

దేవు డిప్పు డెచట జీవించి యున్నాడు ?

చాలనాళ్ళ క్రితమే చచ్చిపోయె !

ఆలయాలు కట్టి రతని అస్థికలపై !

జ్ఞానహీను లైన స్వార్థపరులు,

**దేశ భక్తి**

ప్రజల నుద్ధరింప - ఋజువ ర్తనులు - చాలు !
దేశ భక్తి మేలు తెలివి కంటె !
సకల సృష్టి శిల్ప మకుటాయమానుండు
మంచి హృదయమున్న మానవుండె !

**దేశ భక్తుడు**

దేశ భక్తుడెవడు? దీక్షతో ఉత్పత్తి
పెంచ కష్టపడెడి మంచివాడు;
కర్షకుండు దేశ కల్యాణ సంధాత
పనియె - ప్రజల గాచు ప్రార్థనమ్ము,

**దేశ యాత్ర**

పూర్తి చేయవచ్చు - భూ ప్రదక్షిణ మైన
చుట్టు పట్టు సుంత చూడకుండ !
పోయి వచ్చు గాక - పోస్టు పార్శిలు వోలె !
గాను గెద్దు నయము వాని కంటే !

**దేశాటనము**

చదువు వలన వచ్చు జ్ఞానమ్ము సరిపోదు ;
వాస్తవములు చూడవలయు తిరిగి ;
తెలివి అధిక మౌను - దేశాటనము వల్ల
సాన పెట్టబడును మానసమ్ము.

**దొడ్డి గ డ ప**

చూడ - దీక్షతోడ - తోడేలు రాకుండ
ముందు తలుపులెల్ల మూసివేసి,
సందు దొరికినపుడు జాగ్ర త్త ! - మృగరాజు
దొడ్డి గడపనుండి దూరవచ్చు.

**దొరతనము**

దొరతనమ్ము చేయ తోడేళ్ళు సిద్ధమౌ !
మనుజు లెల్ల గొర్రె మంద లైన !
దేశ మందు - ఉన్న తెలివి తేటల బట్టి
దొరకు - ప్రజకు తగిన దొరతనమ్ము !

**దొరతనము**

చిత్త శుద్ధి తోడ చేయలేనిది లేదు
దూర దృష్టి యున్న దొరతనమ్ము !
తలుచుకొనిన యెడల - తగ్గించి జనసంఖ్య
పెద్ద పులుల సంఖ్య పెంచవచ్చు !

**దైవాంశ**

తలచె రాజు తనకు - దైవాంశ కల దంచు
నరులు రెచ్చి శిరము నరకు వరకు !
బుద్ధి చెప్పువరకు పూజారి భావించు
దైవ మనిన తనకు దాసు డనుచు !

**" ధ మ్మ ప ద ము "**

అంటుకొనిన యెడల అపసవ్యముగ - దర్భ
చీల్చివేయగలదు చేతి వ్రేళ్లు!
కపట యోగి, వేయు - కాషాయ వేషమ్ము
నెట్టగలదు - అతని నిరయమునకు!

బరువు తగ్గినపుడు పయనించు సులువుగా
పడవ - ఏటి నీటిపైన తేలి;
మనసులోన - మమత - మాత్సర్యములు తగ్గ
సులువు జీవయాత్ర - సుఖము - శుభము.

**దొరతనము**

దూడ కట్టు మనుట దున్న ఈనిన దన్న
దొరతనమ్ము వారి దొడ్డ గుణము !
ఎదురు ప్రశ్న వేయు "పదరుబోతు"ను బట్టి
పాతిపెట్టగలరు పగ వహించి,

**ధ ర**

తారు మారు చేసె - ధర - ధనస్వామ్యమ్ము
పెట్టి తలలు పేసి విలువ లెల్ల;
ప్రజలు చేయు కృషియె నిజమైన ధనమౌను
సహజ సామ్యవాద సంఘమందు.

**ధర్మకాంట**

విలువగట్టు - జగతి - నెల జీతములతోడ
మనిషియొక్క గొప్పతనము - నేడు !
కవుల తూచదగును నవ రత్నములతోడ !
ధర్మమరయగలుగు త్రాచులోన.

**న ట న**

నటన - జనుల నెల్ల నమ్మించి నేర్పుతో
వివిధ వేషములను వేయవచ్చు!
ఎత్తవచ్చు - నటన - యెన్ని జన్మలు గాని !
"నిజము" పాత్ర వేయ నేర్వలేదు ! .

**న టుడు**

రాత్రి వేయవచ్చు రంగస్థలము పై
కీర్తి కెక్కి చక్రవర్తి పాత్ర !
అరుగవచ్చు బియ్య మరువు తెచ్చుటకునై
పాదచారి యగుచు పట్టపగలు.

**నరకము**

మనిషి మనసునిండ మంచి ఊహలె యుండి
నరకమునకు శీఘ్ర మరుగవచ్చు !
జనులు మెచ్చు చిన్న పనిచేసినంజాలు !
భూమి సుంత స్వర్గ సీమ యగును!

**నరుడు**

నరునిలోని విసము - నాగుబామున లేదు!
నక్కలోన లేదు - నరుల యుక్తి !
గుండె విసములోన - క్రూర జంతువు లేవి
నరుని మించలేవు ధరణియందు !

**న వ్యక వు లు**

తర తరాల నుండి _ తరచి తీసిరి మణుల్ !
వాఙ్మయాబ్ధినుండి - ప్రథిత కవులు;
మరల తీయవచ్చు - మరికొన్ని - నవకవుల్ !
నేటికైన - రత్ననిధియె కడలి !

**నాగరికత**

పూత పసిడి మెరుపు - పూయవచ్చును గాని
నరుల నేమి మార్చు నాగరికత ?
తడిసినపుడు పట్టు తప్పకుండగ తుప్పు
మెరయునట్టి ఇనుప మేకులెల్ల .

**నాటకము**

ఆడవచ్చు తరచు అధికారులౌ వారు
నాయకుండు లేని నాటకమ్ము !
ప్రేక్షకులకు తెలియు ! పెను రసాభాసమ్ము !
అవకతవక లెల్ల అరసినపుడు.

**నాడు - నేడు**

చిన్నతనములోని వెన్నెలల్ నెమరేసి

మొన్న - నిన్న అనును ముసలి తనము

నిత్యయౌవనమ్ము _ నేడు నేడని పల్కు

చెప్పు - రేపనుచు సజీవ శవము.

**నా య క త్వ ము**

ఆరకుండ మండు - అధికార జఠరాగ్ని !

సుంత తృప్తియుండ దెంత తిన్న!

నేత _ యేలదలచు నిరయ రాజ్యమునైన!

బ్రదుక లేడు స్వర్గ పౌరు డగుచు !

**నాల్గవ కొలత**

బ్రదుకు వెలుగు నింపు చదువు సంస్కారముల్,

ఎదుగు లావు పొడుగు ఎత్తు కాదు;

నరుడు - పెంచు కొనుత- నాల్గవ కొలతనే;

నీతితో - మహామనీషి - యగుచు.

**న్యాయవాది**

ఇల్లు కట్టుకొనుట ఇటుకతో కాదయా

మేటి న్యాయవాది మెదడు పేరు!

బుద్ధి లేని వారి పుర్రె లన్నియు పేర్చి

మేడమీద పెద్ద మేడ – కట్టు !

**నిద్రపోవు కుక్క**

నీతి ఏమి తెలుపు ? నిద్ర పోవుచునుండు

కుక్క నెపుడు మేలుకొలుపరాదు !

మూల మూల్గు చున్న ముసలి సింహము డాసి

తోకనైన చేత తాకరాదు !

**నిపుణుడు**

పొందు నెవడు నేటి పోటీ జగత్తులో
మేటి నిపుణుడనెడి మెరపు కీర్తి ?
ఒరులు చదువ లేని ఉద్గ్రంథము రచించి
గోల చేయనేర్చు గొప్పవాడు !

**నియంత**

సజ్జనులకు తగిన స్థానమ్ము లేనిచో
ఈ ప్రపంచమందు ఏమి జరుగు ?
దుర్జనుండు రెచ్చి దుస్సాహసమ్ముతో
కొల్ల గొట్టు ప్రజల గుండెలేక

**నిరీక్ష**

రాని భార్య కొరకు - రైలు స్టేషనులోన!
బాట ప్రక్క - రాని బస్సు కొరకు!
రాని నిద్రకొరకు - రాత్రి మంచము పైని
ఎదురు చూచువాని కదియె శిక్ష !

**నిర్దోషి నిట్టూర్పు**

కవులు కార్చునట్టి కన్నీటి జల్లులో
ఇంపు గొలుపవచ్చు ఇంద్ర ధనువు !
నిఖిల ధరణి నొక్క నిర్దోషి నిట్టూర్పు
తగుల బెట్టగలదు తత్ క్షణంబు!

**నీడ**

నీడ వెంట వెడలు నిజ వస్తువును వీడి
శ్రోత్రియుండు మెల్ల చూపు వలన;
జరుగు మేలు సంఘసంస్కర్తయైనచో
సహజ సంప్రదాయ సార వేత్త.

**నీతి**

చదువు - అనిన - హృదయ సంస్కారమే సుమ్ము!

వ్రాత కోత లేల? గీత లేల ?

రైతు బిడ్డ కుండు నీతి నిజాయతీ !

సంతకమ్ము లేల ? సాక్షు లేల ?

**నేటి పాఠశాల**

పాఠశాల చేరి బాల బాలిక తెల్ల

ఇరికి ఇరికి ఎట్లా ఇమిడినారు !

అచట - చోటు లేదు అధ్యాపకునకింక

బయట నిలువవలసె పాప మతడు !

**నేటి నేత**

నేటి నేత మోజు ఓటుపై మాత్రమే !

రేపు మీద - అతని చూపు - పడదు !

బ్రదుకుదెరువు కొరకు - రాజకీయము పేరు !

ప్రగతి కోరు దేశ భక్తి పేరు!

**పక్వ ద్రాక్ష**

పచ్చి ద్రాక్ష - పులుపు ! పరిపక్వమై పండి,

మారిపోవు _ మధుర మధుర మౌచు;

చిన్ననాడు ఎంత చెడ్డవాడుగ నున్న

మనిషి - యోగి యౌచు మారవచ్చు !

**ప ద చ్యుతి**

దొరతనమ్ము చేయు - దొడ్డ నాయక మణుల్

ఒక్క కంచ మందు మెక్కవచ్చు!

తెగిన హార మటు దిగజారి పడవచ్చు

పదవి పోయినపుడు చెదరిపోయి !

**పదవి**

పైన నీళ్లు జల్ల పాలు పొంగుట మాను
విప్లవమ్ము వంటి వేడి తగ్గి;
పదవి యెరను జూప - పడియుండు అణగారి
దేశనాయకుండు ! తిరుగబడక

**పద్యము**

వచనమందు 'వ్రాయ పద్య తాత్పర్యమ్ము,
తొంటి తూగు ఊపు తొలగి పోయి,
మల్లె పువ్వులోని మంచు బిందువు లేరి
చేతబట్టినట్లు - చెడును - సొగసు !

తాళ బద్ధమైన లాలిత్య గతి గల్గి
నడక - సొంపు లొలుకు నాట్య మౌను ;
శ్రవణ సుభగమైన ఛందోనియతి గల్గి
పలుకుబడుల కూర్పు - పద్య మగును.

**పని**

మనిషి - బ్రదుకు కొరకు పని చేయవలె గాన
విసుగు వలదు - ఎవరి కసర వలదు ;
మనిషి చేయు పనిని - మనసార చేయుచో
అతని చుట్టు స్వర్గ మలముకొనును.

**పనిచేయు హస్తము**

భజన చేసి - పాడి భగవంతు ప్రార్థించు
పెదవి కంటే ! గొంతు పదము కంటె !
పరుల మేలు కొరకు పనిచేయు హస్తమే
పావనమ్ము పూజ్య భాజనమ్ము.

**పరదేశయాత్ర**

భావుకోత్తమునకు - పరదేశ యాత్రలో
కానుపించు - "వర్తమాన భావి" ;
వెడలి - ఒక త్రికాల వేదియై రావచ్చు.
క్రొత్త యెల్ల లెదుగు గుండెతోడ !

**పరిపాలన**

కదను త్రొక్కు నట్లు పదివేల గుఱ్ఱాల
సడుపవచ్చు ఒక్క నాయకుండు !
వంద కప్ప లైన ! పది కోతు లైనచో !
నిర్వహింపఁజాలు నేత యెవడు ?

**పరిపూర్ణుడు**

ఎంచ నేల ? ఒక్కడు - ఎవనిలో లోటైన !
లేడు లోటు లేనివాడు - లేడు!
అరయ - మనుజులందు పరిపూర్ణు డెవ్వండు?
తప్పు - మనుజ సహజ ధర్మ మౌట !

**పరిశ్రమలు**

ఏది పనికిరాని దిక పరిశ్రమలలో !
కసువు గాని ! పాము విసము గాని!
జీడి డోలక గాని పేడ వాయువు గాని !
కుక్కగొడుగు గాని ! తుక్కు గాని!

**పరిహాసము**

పరమ దారుణమ్ము-"పరిహాసమే" సుమ్ము !
డోలు కట్టగలదు డొక్క చీల్చి !
హాస్య రసము సాటి హాలాహలము గాదు !
గరళకంఠునైన వెరపు గొలుపు.

**ప రు గు**

తెలివి తేటలున్న తేజస్వి నడకనే
మనసు కుంటుచున్న మనుజు లెల్ల,
తరచు పరుగ టంచు తలచుటే పరిపాటి;
సరకు చేయ నేల పిరికి మాట?

**పల్లె టూ రు**

మారు మూల పల్లె టూరులో నివసించి .
మాతృ భాష మీద మమత గలిగి;
సత్య మరియ గోరు సామాన్య పౌరుడే
భరత దేశమునకు గరిమనాభి.

**పశుబలము**

ధరణి మోయలేదు దౌర్జన్య విజయమ్ము!
ప్రజల నేల లేదు పశుబలమ్ము!
ఏ ప్రభుత్వమైన ఎంత కాలము నిల్చు?
కత్తి మోపి ప్రజల నెత్తి మీద ?

**పశ్చాత్తాపము**

చేసి నట్టి తప్పు చివరకైన గ్రహించి
కార్చు నట్టి వేడి కంటి నీరు,
విలువ గట్ట_స్వర్గ విపణిలో - సరితూగు
కోహినూరు కంటె – కోటి రెట్లు !

**పండితుడు**

సులువు బలువు నెరిగి సూది బెజ్జము దూరి
ఏగవచ్చు గున్న యేను గొకటి !
గడప దాట తరమె ! కవన మందిర మందు!
ప్రతిభ లేని శుష్క పండితునకు ?

**పాఠము**

ఏది మరువ రాని ఏకైక పాఠమ్ము

భరత మాత గొప్ప చరితలోన

ఐకమత్యమున్న అభ్యున్నతిని గాంచు;

దీన దశకు వచ్చు లేనినాడు.

**పాతరోలు**

కొట్టవచ్చుచున్న క్రొత్త రోకలి జూచి

పాత రోలు నవ్వె భయము వీడి :

నవ్వె - ప్రజల శక్తి నవ నియంతను గాంచి

యెంత సేపటంచు ఎగిరిపాటు!

**పా త్ర దా న ము**

దాత కన్న మిన్న దానగ్రహీతయే

పాత్రు డై నవాడు పట్టె నేని !

పాత్రదాన మన్న బహుమాన మిచ్చుటే;

దాత జీవితమ్ము ధన్య మగును.

**పిచ్చి**

దేవ కార్య మనుచు! దేశ భక్తి యటంచు !

త్యాగ మనుచు ! రాజ యోగ మనుచు !

అవనిలోన ఎట్టి అవివేకమును గాని

పిచ్చి ముదిరి నపుడు పిలువవచ్చు!

**పురుడు**

ప్రసవ బాధ తల్లి పడకుండ తప్పునా!

పురుడు వచ్చి బిడ్డ పుట్టు నపుడు!

సంఘమందు సహజ సంఘర్షణలు లేక

అవతరించలేదు నవ యుగమ్ము !

**పెండ్లి**

పెండ్లికొడుకు కుండు - పెండ్లికూతురు కుండు

కోర్కి తేనెపట్లు గుండె నిండ!

సర్దుకొనక కొంత - సరిపెట్టు కొనకుండ

పెండ్లి చేసికొనుట - పిచ్చితనము.

**పెండ్లి**

జీవితమ్ములోన యౌవనోదయములో

ఏమి జరుగు? పిచ్చి యెత్తినపుడు ?

ఆత్మహత్య జరుగు - అరుదుగా

జరుగుచుండు - " పెండ్లి" _తరచు తరచు !

**పె త్త న ము**

మంచి మాటతోడ ! మంద హాసములోడ !

సులువు! ఎదుటి మనసు చూరగొనుట !

ఏవగింపు గొలుపు హింస! దౌర్జన్యమ్ము !

పెత్తనమ్ము చేయు చిత్త వృత్తి.

**పె ద్ద ప ద వి**

ఏను గెక్కి నపుడు - ఎత్తుగా కన్పించు!

పొట్టివాడు గూడ పుడమి నుండి !

తెలివి లేని జడుడు తేజస్విగా దోచు !

పెద్ద పదవి అన్న గద్దెమీద !

**పెద్ద మనిషి**

అసలు పెద్దమనిషి వసుధైక పౌరుండు!

మంచితనమె అతని మతము సుమ్ము ;

చేయమనడు దేని చేసిచూపక తాను

నగ్నసత్యములను నమ్మి పలుకు,

**పొడినీరు**

ఎచట నుండు నీరు - ఎండమావులలోన ?
నిజము - కూట రాజనీతిలోన ?
పుడమి నెచట కలియు పొడినీరు తడియగ్గి
స్వార్థపరుల స్నేహమందు తప్ప ? !

**పొదు పు**

పొదుపు వలన ఉడుకు పొయ్యిపై అన్నమ్ము,
పుష్టి నిచ్చు - పొదుపు - తుష్టి నిచ్చు;
కంటి రెప్పవోలె కాపాడి బ్రదుకులో
బాపు - రేపు గూర్చి భయము గీయము.

**ప్రొద్దు పొ డు పు**

ప్రగతి రాదు- త్యాగ రక్త పాతము లేక !
ప్రసవ బాధ లేక_రాదు శిశువు !
క్రమ్ముగాక దెసల - గాఢాంధకారమ్ము !
క్రొత్త ప్రొద్దుపొడుపు కొరకు చూడు.

**ప్రక్క యిల్లు**

నరుడు_తెలిసికొనును నక్షత్ర జగతిలో
జరుగుచున్న దెల్ల క్షణములోన!
తెలిసికొనడు - నేడు- ధీశాలి-మనుజుండు
ప్రక్కయింటివారి బాధ సుంత !

**ప్ర గ తి**

విసరి వేయబడిన విస్తరాకుల చేరి !
కుక్కతోటి పాటు కూడు గుడువ !
భరత దేశమందు పరుగెత్తు-నిరుపేద !
కోతలేల? ప్రగతి కూతలేల?

**ప్ర జ ల ఓ ర్పు**

ప్రజ్వరిల్లు క్షణమువరకు – పచ్చిక తోడ
అంద మొలుకుచుండు అగ్గికొండ !
శాంత సుందరముగ జనుల ఓరిమి తోచు
విప్లవమ్ము వెల్లివిరియువరకు.

**ప్ర తి భ**

కప్పవోలె చాల కాలమ్ము-బురదలో
యోగనిద్ర చెందియుండి - "ప్రతిభ" ;
మెరుపుతీగవోలె మిరుమిట్లు కల్పించి
వెలుగ జేయవచ్చు విశ్వమెల్ల !

**ప్రతిమ**

మరణ మొందవచ్చు మహితాత్ముడౌవాడు,
మిన్ను విరిగి నేలమీద పడదు;
అతని బోధకంటే స్మృతిచిహ్నమింకేది?
ప్రతిమ గాదు- ప్రజల నుతులు గావు..

**ప్రభాతము**

తోచు-కొండకొసల తొలి ఉషస్సులు-ముందు
లోక మెల్ల నిదురలోన మునుగ;
క్రాంతదర్శులైన కవులు డెందములందు,
అవతరించు-తొలుత-నవ యుగమ్ము!

**ప్రళయము**

“నేను చనిన పిదప రానిమ్ము ప్రళయమ్ము”
అనుచు స్వార్థపరుని అహము తలచు;
తనకు నష్టమైనా - తర తరాలకు మేలు
గొప్పవాని మనసు కోరుకొనును.

**ప్రార్థ న**

గోచరింప వీవు గుడియందు! బడియందు!
గడ్డమందు! కావి గుడ్డలందు!
మంచి యెడదయున్న మామూలు మనిషిలో
అవతరింతు వీవు అప్పు డపుడు!

**ప్రో త్సాహ ము**

బ్రదుక వచ్చుగాక! పదవికై! ధనముకై!
జీవి - కీ ర్తికొరకు - చావగలడు !
చేయగలడు- మనిషి - చేయలేనిది కూడ
ప్రోత్సహించినపుడు పొగడినపుడు.

**ప్రౌఢి మ**

పానకమ్ము వోలె ప్రసరించు ధారగా
చిన్ననాడు కవిత చెప్పుగాక!
పంచదార వోలె స్పటికాలుగా తీర్చి
ప్రౌఢ వయసులోన వ్రాయవలెను.

**బడిపంతులు**

ఇనుము తుప్పు పట్టి ఇసుక ధూళిగ మారు
తరచు తేమ గాలి తగిలి నపుడు ;
బ్రదుక లేక - మనిషి - బడిపంతులైనచో
మనసు తుప్పు పట్టి మట్టి యౌను !

**బడులు**

ప్రగతి రాదు-తరచు - రాజ్యాంగమును మార్చి
శాసనాలు చేసి సాముచేయ;
బడులు బాగుచేయ _ భావి పౌరులవల్ల
భరత దేశమెల్ల బాగుపడును.

**బడులు - గుడులు**

ప్రతిభ - హత్య చేయబడుచుండు - బడులలో
భరత దేశమందు ప్రతిదినమ్ము!
పాతిపెట్టబడును పరమాత్మ_గుడులలో !
పతిత పావనమగు మతము పేర!

**బాల బాలికలు**

ధరణి పైన - ఎవరు దైవాంశ సంభవుల్?
ఎడద కల్ల కపట మెరుగ రెవరు?
శ్రీ లు చిందు నట్టి బాలబాలికలలో
పరమ పావనత్వ మరయవచ్చు !

బాల బాలికలన భగవత్ స్వరూపముల్
వెలయు వారిహృదుల వెలుగు గుడులు :
విద్యలందు ప్రగతి - విజ్ఞాన జిజ్ఞాస
మొగ్గ దొడుగు వారి మొగములందు.

**బిడ్డల పెంపకము**

కామకేళి సులువు' కనవచ్చు బిడ్డల!
పక్షు లైన ! మొరటు పశువులైన
కష్టమైన లలిత కళ యేది పృథ్విలో?
బిడ్డ పెంపకమ్ము! బిడ్డ చదువు!**బిరుదులు**

కళ్ళజోడు పేరు! కాళ్ళ జోడులు పేరు!
గాజు కన్ను - కొయ్యకాలు పేరు!
పెట్టు - ఊత పేరు-పుట్టు సత్తువ-పేరు!
బరువు చేటు గాక - బిరుదు లేల?

**బొమ్మ**

వంద పుటలు వ్రాయు వ్యాఖ్యానముల కంటె !
ఒక్క బొమ్మ! మనసు కెక్క వచ్చు !
మెదడు – పాడుచేసి; చదువ నక్కరలేదు,
కనుల పండువౌచు కానుపించు !

**బందిపోటు**

మంచివారు – మేను మరచి నిద్దుర వోవ
దోచవచ్చు - రేయి దొంగ వచ్చి!
మేలుకొననియెడల మేధావులగువారు
బందిపోటు జరుగు పట్టపగలే !

**బ్రదుకు**

పెండ్లి అయిన బ్రదుకు - ప్రియమైన చెఱసాల !
సగము ఆత్మహత్య! సగము పిచ్చి:
పెండ్లి కాని బ్రదుకు - పెను ఎడారి తుఫాను !
తెగిన గాలిపటము ! పగటి ఉల్క !

అధిక భాగ్య మున్న అందచందము లున్న !
చదువు లున్న ! గొప్ప పదవులున్న !
మనిషియందు మంచి మర్యాద లేకున్న
రక్తి కట్ట దెవరి బ్రదుకు గాని !

**బ్రహ్మ చర్యము**

క్షీణ దశకు గుర్తు-శృంగార లౌల్యమ్ము!
కొలుచు - నిగ్రహమ్ము బలము బలిమి !
ఆత్మశ క్తితోడ - అతిలోక తేజమ్ము
బ్రహ్మచర్య మిచ్చు ప్రజల కెల్ల

**బ్రహ్మ రాక్ష సుండు**

మెచ్చదగిన మేటి మేధావి కావచ్చు !

నేర్వ వచ్చు రాజ నీతి లోతు !

ఒడలు వంచి కష్ట పడని సోమరి పోతు

బ్రదికి యుండు బ్రహ్మ రాక్షసుండు !

**బాధ్యతలు**

బానిసీని కుండు బాధ్యతల్ మాత్రమే !

హక్కులే పరోప భుక్కు కుండు !

హక్కు బాధ్యతలును అన్యోన్య మైత్రితో

మనుజులందు కలిసి మసలు గాత !

**భ ద్రత**

సంప్ర దాయములకు శాంతి భదత్ర - తల్లి;

ధాత్రిమోయలేదు - స్తబ్ధస్పష్టి!

జన్మ మెత్తుచుండు సంక్షోభమున నుండి

బదుకు తీర్చి దిద్దు - ప్రాణశక్తి!

**భరతమాత**

ఆయుధాలు కావు ! అణ్వస్త్రములు కావు !

భరతమాత కేది ప్రాణ రక్ష?

చమురు గనులు కావు! హిమవన్నగము కాదు!

స్వేచ్ఛ కోరు పజల్ర జీవ శక్తి!

**భావవిప్లవము**

సాహితీ సమీక్ష సంఘ జీవితము పై

సర్వతోముఖముగ జరిగినపుడు ;

పగతీర వచ్చు ఘోర రక్త పాతము లేక

భావ విప్లవమ్ము ప్రబలి ముందు.

**భాష**

మెరపు వంటితలపు లరికట్టినిలబెట్టి
భద్రపరచు శక్తిభాషకుండు;
మనిషి_ యుగ యుగాల అనుభవమ్ము ల నెల్ల
తర తరాల కిచ్చు దాచి భాష.

**మ త ము**

"మతము" లేదు లేదు - మన దేశమున నేడు !
వేలకొలది నమ్మకాలు కలవు !
పనులు చేయకుండ - భగవంతు ప్రార్థింప !
భజన చేయ - ప్రజలు బాగుపడరు !

మతము కొరకు - వీరమరణమందెడివారు !
తత్త్వవాఙ్మయమ్ము త్రచ్చువారు!
గుడులు కట్టువారు కోకొల్ల లున్నారు !
మతము బ్రదికి చూపు మనిషి యేడి?

సత్య మేది? ఏది ని త్యైక వచనమ్ము !
మనుజ లోకమందు మతము తప్ప ?
పాడు బడును మతము పదిమంది కూడంగ;
శిష్యు డెవడు గురుని చేర్చరాదు.

వివిధ మతము లెల్ల విష పూరితమ్ములే !
సాక్ష్య మిచ్చు విశ్వ చరిత్ర సతము !
ఓషధమ్ము వోలె అల్ప మాత్రలు చేసి
వేసికొనుము జబ్బు చేసినపుడు,

**మనిషి**

వివిధ వేద శాస్త్ర విజ్ఞాన కృషి కెల్ల
నరుడు కేంద్ర గరిమ నాభి సుమ్ము!
చదువు దిగును మనుజ హృదయమ్ము పగ లెల్ల !
రేయి - గ్రంథ పఠన చేయవచ్చు.

**మనిషి విషము**

పిండ వచ్చు పాము విషము సాహసముతో
చేతనైనవాడు చేతి తోడ ;
మనిషి విషము పిండు మొనగా డెవడు లేడు!
నాకమందు - నరక లోకమందు.

**మ మ త**

భద్ర పరచవచ్చు బంగారు బరిణెలో
విలువ కట్టలేని వెంట్రుకలను
కొలువ వచ్చు గుండె గుడిచేసి భక్తితో
మమత మహిమ పెంచి మానవుండు.

**మాట**

మనిషి _ మాటలాడు మనసులోనిది చెప్ప ;
వాగు - బుద్ధిలేక వదరుబోతు !
మంత్రి _ మాటలాడు - మనసులోనిది దాచ '
మాటలాడ డసలు జ్ఞాని యెవడు.

**మామూలు మనిషి**

మనసు పక్వమైన మామూలు మనిషిలో
గొప్పతనము తరచు గోచరించు;
సంఘహితము గోరు సంస్కార మున్నచో,
చదువు లేల? పెద్ద పదవులేల?

**మార్పు**

ఏది శాశ్వతమ్ము? ఏది ప్రాచీనమ్ము?
సృష్టిలో స్వభావ సిద్ధ మేది?
నిత్య సత్యమేది? నిత్య నూతనమేది?
మార్పు మార్పు! మార్పు! మార్పు ! మార్పు!

**మృగ రాజు**

మేను మరచి - రేయి - మృగరాజు నిదురింప,
దూరమందు దెసలు మారుమ్రోగ,
కూడి - మొరగవచ్చు - గొంతెత్తి ఆడవిలో !
కుక్క లెల్ల ! గుంట నక్క లెల్ల

**మూర్ఖుడు**

తెగడ నేల? పుట్టు తెలివి తక్కువ వాని ?
పరమ మూర్ఖు డెవడు ధరణిలోన?
చేయగలిగి యుండి చేయకుండగ నేడు
రేపటివరకు పనిని ఆపువాడు!

**మూలహేతు పు**

చెడ్డతనము పెద్ద చెట్టుగా పెంపొంద!
నిలువలేరు ప్రజలు నీడలోన;
తరచు కొమ్మ రెమ్మ నరకువారలు హెచ్చు !
అరుదు - వేళ్ళు త్రవ్వి నరకు వారు.

**ము స లి త న ము**

సోకు చేయవచ్చు సొగసుగా తెలివితో !
వెంట్రుకలకు రంగు వేయవచ్చు!
తళుకు బెళుకు చూపి తంటాలు పడవచ్చు !
మొగము దాచలేదు ముసలితనము .

పడుచువారు చేయు పనులెల్ల గర్హించి
తిట్టిపోయకుండ దిన దినమ్ము
అరిగి తిన్న తిండి - ఆయు రారోగ్యముల్
వృద్ధ జనులకెట్లు వృద్ధి నొందు ? ?

**మొదటిరాయి**

తప్పుచేయువారి దండింప దలపోసి
రాళ్ళు రువ్వ గోరు ప్రజలు ! వినుడు!
తప్పు చేయనట్టి ధర్మాత్ము డెవడైన !
మొట్ట మొదటి రాయి ముట్టు గాక !

**మొక్క**

బాగు పరచ మొదట సకల బాలుర విద్య
భరత దేశ మెల్ల బాగు పడును !
మంచితనము లేత మనసున నాటి
పెంచ వచ్చు మొక్క వంచవచ్చు.

**మోజు**

విలువ కంటే - హెచ్చు వెల పెట్టి కొనవచ్చు
నచ్చిగాదు - సరకు మెచ్చిగాదు!
అమ్ముబడున దేది? ఆడంబరత్వమే!
"మోజు" - విపణి నేలు రాజు నేడు.

**మౌన బాష్ప ము**

వాగి - గేలి చేసి పదివేల నాలుకల్
కదుప లేవు - గుండె - కుదుప లేవు !
మంచితనము కార్చు మౌన బాష్పము చాలు !
కఠిన హృదయమైన కరిగి పోవు.

**మౌ న ము**

జనుల నెంచి, తగిన సమయమ్ము - స్థల మెంచి
మాటలాడవలెను మనుజు డెపుడు;
జ్ఞాన సిద్ధి లేదు - మౌన సాధన లేక
వదరుబోతు పేరు! వక్త పేరు!

**మౌనముద్ర**

ప్రవచనాలు - వివిధ పత్రికల్ - ప్రచురణల్
వర్తకమ్ము చేయు వంచనములు!
పనికి వచ్చు - బాష_పగటి వేషాలకే!
జ్ఞాని పూను ధ్యాన మౌన ముద్ర.

**మౌనము**

మూగతనము జ్ఞానయోగ చిహ్నము కాదు.
చదువు గలిగి మంచి హృదయ ముండి
తెలివి తేటలుండి - తేజస్వియై యుండి
పెదవి కదుప నతడు - పెద్దమనిషి !

**మంచి కథ**

బాణ మేయ - బోయ - పక్షిపై - గుఱి చూచి,
పాము కరచె వాని ! - పడగ విప్పి ;
పట్టి యెగిరే - గరుడ పక్షి - ఆ పామునే !
మంచి కథ జనించి కంచి కేగె !

**మంచితనము**

వేయి తలల పామె ! - వివిధ విద్యావేత్త !
క్రూర హంతకుండె - వీర వరుడు !
పెద్రి పీన్గు - విముల వేదాంత విజ్ఞాని !
మంచితనము లేని మనిషి యైన,

పాప మనిన ఏమి ? పరపీడనమెగాక !

భూతదయను మించు పుణ్య మేది?

మంచి తనము కంటె - ఎంచ లౌక్యము లేదు।

మంచితనము మించు మతము లేదు.

అంగబలము కంటె! ఐశ్వర్యమున కంటె!

చదుపు కంటె! మేటిపదవి కంటె!

కులము కంటె! గొప్ప తెలివితేటల కంటె!

మంచితనము మిన్న - మనుజులందు !

**యంత్రనాగరకత**

యంత్రనాగరకత యావజ్జగత్తులో

దొరతనమ్ము చేయ దొడగె- నేడు !

మనిషి- యంత్ర మందు మరమేకుగా మారి

అస్వతంత్రు డగుచు అటమటించు!

**యంత్రము లు**

యంత్ర మనిన - స్వీయ హస్త లాఘవముగా

మురిసిపోయినాడు - నరుడు - తొలుత ! -

యంత్ర మిపుడు – క్రూర యజమానిగా మారి

నమలి మ్రింగ జూచు నరుల నెల్ల !

**యుద్ధము**

పూర్వ కాలమందు పుడమిలో యుద్ధాల

ఒకరు గెలిచి మరొక రోడినారు !

వసుధ యెల్ల - మాడి - వల్లకాడుగ మారు!

ఉభయ పక్షములును ఓడి నేడు |

**యురేకా!**

'కాంచినాడ ! నేను కనుగొంటి నిజ మంచు !"

అరిచె - తొట్టె నుండి ఆర్కిమెడిసు |

చాలు! సంతసమ్ము; జ్ఞానయోగికి చాలు !

వేరు లాభ మతడు కోరుకొనడు,

**యోగి**

యోగి యగును - మనిషి – ఉత్తేజితుండైన,

పరిసరాల బట్టి పాపి యగును ;

అనుభవాల బట్టి - అవకాశముల బట్టి

పొదుగు కొనును - మనిషి – బ్రదుకుతెరువు.

**రచన**

కొల్లగొట్ట వచ్చు - గుండె దౌర్బల్యముల్ !

ప్రేమ అనెడి ముద్దు పేరు పెట్టి!

కథల నల్లవచ్చు కవ్వించి నవ్వించి !

కవిత - మారు పేరు కంటినీరు,

**రాజకీయ రంగము**

స్వార్థ రహిత మైన సత్కార్యములు చేయ

ప్రకృత రాజకీయ రంగ మందు

మిత్రు డగుట కల్ల - మెచ్చి ఒక్కడు గూడ !

శత్రు లగుట నిజము చాల మంది!

**రామరాజ్యము**

చూపబడును కరుణ సుగ్రీవులకు నేడు!

చంపబడును వాలి చాటు నుండి ;

శ్రీవిభీషణులకు సింహాసనము లబ్బు !

అపర రామరాజ్య మమలు జరుగ !

**రాయబారి**

“అవును" - అనిన మాట కర్థమ్ము - "కావచ్చు” !
మనసు వేరు ! పెదవి మాట వేరు !
“కాద” టన్న మాట కావచ్చు నన్నచో !
కాడు - రాయబారి - “కాదు" అనిన !

ముడ్డిమీద తన్న - ముఖముపై ఉమియంగ
ముడత పడని బొమలు తుడిచివేసి,
మాటలాడు నెవడు మందహాసము చేసి !
అతడు - రాయబారులందు మేటి!

**రాస లీల**

పరుపు క్రింద దాచబడే భగవద్గీత !
పంకజాక్షి ! పాప శంక యేల ?
పరమహంస - అపర పరమాత్మ - పైనుండె !
రాత్రి - సాగుగాక - రాసలీల !

**రంగులు**

రంగు లెన్ని లేవు! రాజకీయములందు!
ధర్మమందు! మనిషి చర్మమందు !
రంగు గ్రుడ్డితనము రాకుండ మెదడులో
ఎడద - విరియుగాత - ఇంద్రధనువు.

**రెండు లక్ష్యాలు**

కొట్టరాదు రెండు కుందేళ్ళ నొకసారి
వేట తమకమందు వెంబడించి;
పట్టుబడక ఒకటి - పారిపోయెడి వేళ !
వదలి పెట్ట వలసి వచ్చు నొకటి !

**రొద**

మురళి రవళి వేరు ! మరల చప్పుడు వేరు !
కోకిలమ్మ వేరు! కాకి వేరు !
సంత గోల వేరు! సంగీత సభ వేరు!
భాష వేరు ! శబ్ద ఘోష వేరు !

**లిపులు**

లిపులకంటే ముందు ఉపనిషత్తులు పుట్టి :
వేద మెట్లు నిలిచె విశ్వమందు ?
చదువు వేరు ! వివిధ శబ్ద సౌంజ్ఞలు వేరు!
సంతకాలు చేయు శక్తి వేరు.

వ్యాసుడైన గాని వాల్మీకియే గాని
పుట్టినారు లిపులు పుట్టకుండ '
అసలు విద్య వేరు ! అక్షరాస్యం వేరు!
వ్రాత - నాదమునకు గీత గుర్తు!

**లౌక్య ము**

మెరపు తీగ ఝళిపి—మిరుమిట్లు గొల్పరా !
పిడుగు వెనుక దాచి పెట్టి నట్లు !
మసలు - లౌక్య మెరిగి - బుసకొట్టి - భయపెట్టి !
కార్యసాధకుండు కరువరాదు.

**వడ్డీ**

ధనము - బ్యాంకులోన దాచిపెట్టు నెవండు ?
భార్య నెవడు పెట్టు పరులయింట ?
చేతగాని గొప్ప శ్రీమన్న పుంసకుల్
వడ్డివచ్చు లేక - బిడ్డ పుట్టు !

**వదంతి**

పోవు - డేగవోలె భూ ప్రదక్షిణము కై
కనులు లేని గ్రుడ్డి గబ్బిలమ్ము !
వ్యాప్తి చెందగలదు ఆకాశవాణియై
కీర్తి కెక్కునట్టి - 'కింవదంతి',

**వర్తకము**

చూడు - వర్తకమ్ము - సులువైన పని నేడు !
లేదు - పోవు నట్టి దేది - నీకు !
ప్రజల ధనముపైన యజమానిపై సాకు !
సొత్తు ఎవరి దైన - సోకు నీది.

**వ ల పు**

వైద్య మేమి వలదు - వచ్చి పోవుచు నుండు
వయసులోన తరచు వలపు జ్వరము !
అసలు - వలపు జ్వరము - ముసలివారికి - రాదు ;
వైద్య మేమి లేదు ! వచ్చె నేని !

**వాదము**

బల్ల గుద్ది అరచి - వాదించి గద్దించి
ఎదుటివారి మనసు నెవడు మార్చె?
దెబ్బ తగిలి - చేయి బొబ్బ లెక్కుట కద్దు !
గుండుసూదులున్న గ్రుచ్చుకొనును!

**వాన**

కురియ వచ్చు - వాన కురియక పోవచ్చు :
గొప్ప కాదు - ఎవరి తప్పు కాదు ;
తానె కురియజేసె వాన యంచును పల్క
కారణమ్ము కాడె కరువు కతడె?

**వ్రాత**

చక్కబెట్టినారు సామ్రాజ్యముల సెన్నొ
సంతకాలు రాని శౌర్యధనులు !
అక్షరాలు రాని అష్టావధానులౌ
పండితులను కనెను భరతమాత.

**విధులు**

నరుడు - బిఱ్ఱ బిగియ - నడపీన్గుగా మారు!
పట్టు - విడుపు - వలయు బ్రదుకునందు ;
విశ్వ హితము కొరకె - విధి నిషేధము లెల్ల ;
జనుల చిత్రహింస సలుప గాదు.

**విద్య**

అణువులోన నుండు - అణగి - బ్రహ్మాండమ్ము !
విద్య లోని శక్తి - వెలికి తీయు :
ప్రగతి చెందవచ్చు ప్రతి మానవుడు గూడ
సదవకాశమున్న సంఘమందు.

**విప్లవ నేత**

కడలి - తొణకకుండు సుడిగాలి నడిబొడ్డు
చుట్టు నున్న వెల్ల స్రుక్కి కూలు !
విప్లవమున రేగు బీభత్సముల మధ్య
నేత - బెణకకుండ నిలిచియుండు !

**విరహము**

ప్రమిద లారిపోవు ! ప్రజ్వరిల్లుచు వెల్గు
కాగడాలు పెద్ద గాలిలోన !
చిరుత వలపు - తరుగు విరహ వేదనలోన;
పెరుగు - స్వచ్ఛమైన ప్రేమ దీప్తి.

**వి లు వ మా ర్పు**

జగతి మారె - నవ్య సాహితీ గతి మారె !

విలువ లెల్ల మారె విశ్వమందు !

మార నట్టి మనిషి – మారడీ జగతిలో !

మారవలెను ప్రగతి కోరువాడు.

**విశ్వజిద్ యాగ ము**

వినయ ముదిగి చేయు విశ్వజిద్ యాగమ్ము !

కాంచు నపజయమ్ము గర్వ మెపుడు |

అఖిల జగములందు అనసూయ వెలుగొందు ;

మంచితనము జయము గాంచు సతము,

**విశ్వమతము**

చెరిపి వేయు మన్ని సరిహద్దు గీతలు

పుడమిలోన - మనిషి యెడదలోన;

అసలు పెద్దమనిషి - వసుధైక పౌరుండు;

మంచితనము విశ్వమతము సుమ్ము.

**విశ్వ విజ్ఞానము**

ఏది కృష్ణ నీరు? గోదారి నీరేది?

జలధిలోన వేరుసలుపగలమె?

వింగడింపగలమె విశ్వ విజ్ఞానమ్ము?

వేరు వేరు తెగల పేరు మీద!

**వి శ్వ వి ద్యా లయ ము**

వెలుగు వెదకు నట్టి విద్యార్థులై రెండు!

స్వాగతమ్ము _ యువకులార మీకు !

విశ్వ హితము గోరు విద్వాంసులై పొందు

వెడలు నపుడు జ్ఞానవృద్ధు లగుచు;

**వి శ్వ విద్యాల య ము లు**

గులక రాళ్ళ కెచట క్రొమ్మెరుంగులు వచ్చు?
జాతి రత్న మెచట శక్తి తలగు?
విజ్ఞ వీగు విశ్వ విద్యాలయాలలో
అంతరించి ప్రతిభ! అహము ప్రబలి.

**వింతమృగము**

ప్రాకులాడు తినుట కాకలే లేకుండ!
దప్పి లేక నీరు త్రాగుచుండు !
కడగు - అనవరతము - కామ విక్రీడ కై!
విశ్వమందు - నరుడు- వింత మృగము.

**వెను చూపు**

ఆరిపోయినట్టి అగ్గి కొండ వచించె
తాను - ప్రజ్వరిల్ల తలచినట్లు ;
చిలిపి నవ్వుతోడ - సెలయేరు ప్రకటించె;
వెనుక కెపుడు తాను వెడల నంచు |

**వెల**

పుడమిలోన ఉన్న ముడి పదార్థము లెల్ల
చెందవలయు - ప్రజల కందరకును;
మనిషి చేయు కృషికి మాత్రమే వెల యుండు
సహజమైన అర్థ శాస్త్రమందు.

**వెలుగు గ్రుడ్డి**

పర్యటించి - అతడు - పర దేశములయందు
మాతృభూమిలోని మంచి గనడు !
వెలుగు చూడలేని - వింత గ్రుడ్డితనమ్ము
తిరిగి వచ్చినపుడు తెచ్చుకొనెను !

**వీణ**

సార్వభౌమ పదవి సంగీత వాద్యాల

వీణ కబ్బు - సకల విశ్వమందు;

వేణు వున్న దనిన సేనాధిపతి యౌను;

మంత్రి - వాయులీన జంత్ర మౌను.

**వేగుబోక**

మొగిలు గున్న'- రేయి - గగనాన ఒక మూల

వేగుబోక వరకు - వేచియుండె !

ముచ్చటైన ఆణి ముత్యాల గొడుగుతో

మణి కిరీట మమరె మబ్బు తలకు.

**వేత్త**

చదివి పొగడ వచ్చు సహృదయులౌ వారు !

తెలివి మిగులు వారు తెగడ వచ్చు!

సంస్కరింప మనెడి సలహాలు రావచ్చు !

వేత్త యెవడొ రచన విలువ గట్టు.

**వేలకొలదిపులు**

వివిధ పరిమళములు వెదజల్లి పృథివిలో

వేలకొలది విరులు విచ్చు గాత !

పర పరాగ యోగ భరితమై సంస్కృతుల్

క్రొత్త విత్తనాలు కూర్చుకొనుత.

**వైతాళికుడు**

కవులు కాంచగలరు క్రాంతదర్శులు గాన

వర్తమాన మందు - భావి మలుపు;

వంది యగుట పేరు! వైతాళికుడు పేరు!

ప్రస్తరించునపుడు ప్రగతి పథము,

**శస్త్ర చికిత్స**

సమ్మతింపదగును శస్త్ర వైద్య చికిత్స !
ప్రగతి కొరకు ! నూత్న జగతి కొరకు!
వదలవలయు ! క్షుద్ర హృదయ దౌర్బల్యమ్ము !
మొదట - ప్రళయ వేధ ! పిదప సృష్టి

**శాంతి**

విసరివేయలేవు వింజామరలు వేయి
గగనమందు గ్రమ్ము కారు మబ్బు !
ప్రజల గుండెలందు రగులు సంక్షోభమ్ము
త్రోసివేయలేవు శాసనాలు !

**శాసనాలు**

సంతతమ్ము - జగతి - శాంతినే వాంఛించు ;
స్వచ్ఛమైన శాంతి చాల అరుదు !
నిద్రమత్తు - మూర్ఛ - నిస్సహాయత - చావు
మోసగించు శాంతి ముసుగు దాల్చి.

**శిథిలసంప్రదాయములు**

బ్రదుకలేని బడుగు బానిస ప్రజలకే
శిథిల సంప్రదాయ సిద్ధ మతము
భువిని లేని తృప్తి - దివిలోన కల్పించి
శాంతి గూర్పజూచు భ్రాంతి గొలిపి.

**శిల్పములు**

నేటి మానవుండు నిర్మింప లేడేల?
దివ్య శిల్ప శైలి దేవళములు ?
నేటి ప్రజకు కలవు - మేటి ఆలోచనల్ !
నాటి ప్రజకు కలవు నమ్మకములు !

**శిక్ష**

తప్పు పట్ట రాదు దండించు తలపుతో
చిన్న తప్పు చేయ - శిక్ష యేల !
తమ్ముడైన వాని తలలోని పేలున్న
సుత్తితోడ వాని మొత్త నగునె ?

**శిక్షాస్మృతి**

సిలువ - చిత్రహింస - చెఱసాల - ఉరిత్రాడు
ఏమి చేయగలిగె - ఇన్నినాళ్లు ?
క్రూర శిక్షలెల్ల నేరాలు మాన్పెనా ?
విద్య - వెదుకవలెను వేరు వెరవు.

**సోక్రటీసు**

లోకమందు కలుగు శోకముల్ కలబోసి
తిరిగి పంచుకొనుడు నరులటన్న
కోరి ఎన్నుకొనడు - క్రొత్త దుఃఖమపండు !
ఇష్టపడును పాత కష్టములకె |

**శోకరూపకము**

భావితాంత రాత్మ భాసించుటకు కోరి
శోక రూపకమ్ము చూడవలయు;
చిలిపి ప్రహసనాలు శృంగార నాటికల్
పిచ్చి ముదరజేయు ప్రేక్షకులకు.

**శ్రుతపాండిత్యము**

భరతదేశమందు ప్రాచీన కాలాన
అక్షరాలు రావు; అంతెగాని;
భాగవతము తెలియు - భారతమ్ము తెలియు
ప్రజకు తెలియు నీతి-రాజనీతి !

**శ్రోత్రియత్వము**

నీడ వెంట వెడలు - నిజ వస్తువును వీడి
శ్రోత్రియుండు మెల్ల చూపువలన !
జరుగు మేలు - సంఘ సంస్కర్త యైనచో
సహజ సంప్రదాయ సార వేత్త.

**శ్రోత్రియ త్వము**

హేతువాద నిత్య చైతన్య జగతిలో
శ్రోత్రియత్వమునకు చోటు లేదు;
సంఘమందుగాని సాహిత్య మున గాని
క్రొత్తదనము ప్రగతికొరకు వచ్చు.

**శుంఠ**

చదువుకొనని శుంఠ - సాధించునది లేదు;
తనకె ముప్పు తెచ్చుకొనును తరచు !
చదువు కొనిన శుంఠ - సంఘానికే ముప్పు
తెచ్చి పెట్టు తెలివి తెల్లవారి,

**షష్ఠి పూర్తి**

నరుని కంద మేది అరువ దేండ్లకు పైన?
వేయరాని వట్టి వెర్రి ప్రశ్న !
యువకులై నవారి ఉత్సాహ కృషి గాంచి,
మంచి నెంచి – ప్రోత్సహించు బుద్ధి.

**సగటు లెక్క లు**

ఒకటి మంచుపైన ఒకటి నిప్పులమీద
పెట్టి కాళ్ళు-నిలువ - పెద్ద మనిషి !
సగటు లెక్క కట్ట - సమ శీత మని తేలు !
అంక గణిత ఫణితి అంచనాల !

**స త్య ము**

సత్య మెపుడు - ఓడి - సంగ్రామ రంగాన
శాత్రవులకు చిక్కి చావలేదు!
సంహరింపబడెను సంరక్షకుల చేత
భక్తి తోడ - యజ్ఞ పశువు వోలె !

హత్య చేయ లేరు సత్యమ్ము నెవరైన
జయము సత్యమునకు జయముజయము ;
మౌన మప్పు డపుడు మానభంగము చేయ
కుట్ర పన్ని - ఓడి కుములుచుండు.

**స మ స్య**

ఏటి నీటిలోన ఈదు లాడుటె యౌను !
ఏ సమస్య మనము తీసికొన్న!
అవలి గట్టు చేర యత్నించుటే మేలు!
పడిన శ్రమకు ఫలము పడయవచ్చు.

**స మ స్య లు**

ఎదురు కొనుట మేలు - ఏ సమస్యలనైన!
సదరు బెదరు లేక బ్రదుకులోన,
మారు రూపు దాల్చి మన వెంటబడుచుండు
సదవకాశములవి ! వదలరాదు!

**సరళజీవితము**

తిన్ననైన బ్రదుకు తెలివితేటల గుర్తు:
పైని డాబు తెలుపు లోని లొటుకు !
మించు తీగ లట్లు మేటి ఆలోచనల్
సరళ హృదయమందు మెరయుచుండు

**స వ ర ము — జ డ**

చాల పొడుగు పాటి సవరమ్ము మెలిపెట్టి
పెద్ద పూల జడను పేననేల?
వ్రాయనేల? వ్యర్థ పదగుంఫనలు పేర్చి
కథను పెంచి - పెద్ద గ్రంథ మొకటి!

**సహకారము**

సర్దుబాట్లు లేక సరిపెట్టుకొనకుండ
సంఘ జీవితమ్ము సాగబోదు;
గ్రుడ్డివాని భుజము కుంటివా డెక్కుటే
ఉభయ తారకమ్ము ఉర్విలోన !

**స హ జ స్వభావములు**

సమసిపోక మిగులు సహజ స్వభావముల్
వంద విప్లవాలు వచ్చుగాక !
బుద్ధి మార్చకుండ - బురఖాలు మాత్రమే
మార్చుచుండు - పెద్దమనిషి - తరచు !

**సహజీవనము**

సానుభూతి యేది? సహజీవనం బేది?
సంస్కృతి మితి యేది? సహనమేది?
భిన్న మతమువారి - ప్రేమించి మన్నించి
కలసి మెలసి బ్రదుక గలుగు టొకటె !

**సహృదయుడు**

గుండెలోన నింపి కొనిపోవు - తెమ్మెరల్
దూరమునకు - పుష్ప సౌరభముల ;
సహృదయుండు - సరస సాహిత్య మాధురుల్
వెల్లి విరియ జేయు - విశ్వ మెల్ల !

**స్వర్ణ సూత్ర ము**

విశ్వమందు రేగు వివిధ వాదాలలో
రెండు కొసల మధ్యనుండు - 'నిజము"
స్వర్ణ సూత్ర మేది? సహనమే సంస్కృతి;
"అతి" ని వీడదగును అహము మాని.

**సంధి**

సంగరమ్ము మీద సంగ్రామ మొనరించి
శేష శాంతి శకల శిథిలములకు
సంధి చేసినాము సహజీవనము పేర !
విలయ మిమిడియుండె విజయ మందు !

**సానుభూతి**

ఎదుటివాని కష్ట మెరుగ నేర్చినవాడు
పొగడ దగిన గొప్ప పుడమి వేల్పు !
స్వార్థ బుద్ధితోడ స్వసుఖమ్ము కోసమే
బ్రదుకువాడు క్రూర రాక్షసుండు.

**సామ్రాజ్యము లు**

పేరు కెక్కి నట్టి పెద్ద సామ్రాజ్యముల్
అవని నుండి యెట్లు లంతరించె?
నాగరికత పెరిగి భోగ లాలసతచే
చీడ పట్టి తుదకు చివికిపోయె !

**సాయము**

సానుభూతి కాదు - సాహాయ్యమే సుమ్ము
దీన సేవ చేయు తీరు తెన్ను ;
ఆదరింపకుండ _ ఆపన్నులౌ వారి
కార్చవద్దు మొసలి కంటి నీరు,

ఎద్దుపుండు - కాకి కెట్టి నొప్పిని గూర్చు?
పడక తప్పదెవరి బాధ వారు !
సానుభూతి కొరకు - సాయమ్ము కోసమై !
వెదకువాడు వెట్టి వెంగళప్ప,

**సార్వభౌమ శక్తి**

రాజ్య మేలువారు రచయితల్ తెర వెన్క !
జనుల నేల లేదు చట్ట మెపుడు
సార్వభౌమ శక్తి-సాహిత్యమున కుండు
మంచి పాట చాలు- మనసు లేలు !

**సుబ్రహ్మణ్య భారతి**

తరళ సింధు లహరి! తరపి వెన్నెల రేయి !
పడవపైన | తెలుగు పాట పాడి !
మరులు గొలుపు గాత - మళయాళ మదిరాక్షి!
కలలు గనెను-తమిళ కవి వరుండు.

**సూరదాసు**

ఏమి చూచి వ్రాసె ! హెూమ రద్భుత కృతుల్ ?
చూచి నట్టి దేమి ! సూరదాసు ?
కనులు మూసి ఋషులు - గాంచగలెడి వెల్గు
అవతరించు భువిని కవిత యౌచు !

**సోమరి**

పస్తులుండగలడు పదిపైస లిచ్చుచో
భరత ఖండమందు బండవాడు !
పనికి పూనుకొనడు - పది రూకలకు గూడ
గంట సేపు సుంత కష్టపడడు !

**స్నేహితుడు**

నీకు ఎచట దొరకు నిజమైన మిత్రుండు ?
విశ్వ మెల్ల వెదకి విసిగి విసిగి
తుట్టతుదకు _ ఎడద తోట తల్పులు మూయ
స్నేహితుండు వెనుక చేరి యుండు.

**స్వార్థత్యాగి**

అనుభవించువారె - జను లెల్ల హాయిగా !
అప్పు చేసియైన పప్పు కూడు ;
ఎచట కానుపించు ఇపుడు స్వార్థత్యాగి ?
లోక మెల్ల వెదుక-లోభి తప్ప !

**స్వే చ్ఛ**

స్వేచ్ఛకొరకు విడుచు—వేడి నిట్టూరుపుల్
కందకాల నీది గవను లెగసి ;
తగులబెట్టగలవు దౌర్జన్య దుర్గముల్ !
బురుజు లెల్ల కాల్చి బుగ్గి చేసి

మనిషి స్వేచ్ఛ నీయ పనిచేసి చొరవతో
కొండ పిండిచేసి కొట్ట గలడు !
స్వేచ్ఛ లేనివాడు - జీవచ్ఛవము సుమ్ము!
బాధ్యత యెటు లుండు - బానిసలకు ?

**స్వే చ్ఛ**

కఠిన శాసనాలు కార్పణ్య నియమముల్
చివరి చిహ్న మగును క్షీణ దశకు ;
కఱకుదనము పేరు - క్రమశిక్షణము పేరు !
స్వేచ్ఛ - సంఘమునకు జీవనాడి.

మెలగవచ్చు నేత - మిథ్యామహత్తుతో
తానె దేశ మనెడి తలపు గలిగి ;
భూమి తిరుగు టాగి పోదెట్టి వ్యక్తికై;
మిన్ను విరిగి నేల మీదపడదు.

చిత్తశుద్ధితోడ - సిద్ధాంతములు నమ్మి
సేవ చేయవచ్చు – చావవచ్చు ;
వ్యక్తి భజన యేల? స్వాతంత్ర్యయుగములో !
సామ్యవాద నూత్న జగతిలోన.

**సంస్కృతి**

అన్ని భాషలందు అన్ని దేశములందు
గోచరించుచుండు గొప్పదనము ;
సంస్కృతులకు ధరణి సరిహద్దులే లేవు;
పర పరాగ యోగ ఫలము - ప్రగతి.

**సంస్కృతివధ**

చంపివేయవచ్చు సంస్కార సంస్కృతుల్
కండకావరమున దుండగీడు !
హత్యచేసినాడు - ఆర్కీ మెడీసునే !
చదువు రాని చవట సైనికుండు.

**సంస్కారము**

పాలు యోగి బ్రదికె - పట కుటీరము లల్లి !
బ్రదికె - ఋషి కబీరు బట్ట నేసి !
చదువు – పదవి _ కావు సంస్కార చిహ్నముల్ !
గుండె పండి వచ్చు గొప్పదనము.

**సింహము**

చేరదీయబోరు సింహమ్ము నెవరైన !
కూర్మి నింప గలరు కుక్కపైన !
మెచ్చుకొనదు జగతి మేధావియగువాని;
ఆశ్రయించు శుంఠ నాదరించు.

**స్వంతయిల్లు**

పోయివచ్చుగాక భూ ప్రదక్షిణముగా
తిరిగి వచ్చుగాక దెసల కొసలు !
అఖిల గౌరవములు అనుభవించును గాక !
ఎచట దొరకు సొంత యింటి తీపి ?

**హక్కులు**

హక్కులున్న పంచు ఆరాటపడనేల?
బాధ్యతలను మరచి పౌర జనులు ?
పరమ నిష్ఠతోడ బాధ్యతల్ నెరవేర్చ
అడుగకుండ వచ్చు హక్కు లెల్ల..

**హాస్యము**

సానుభూతి గలిగి - సంస్కరింపగ గోరి
వేడి కంటి నీరు వెనుక దాచి ;
హాస్య మాడవచ్చు అనురాగ మున్నచో
విసము గ్రక్కరాదు వెక్కిరించి.

**హాస్యము**

జగతి - మిథ్య గాక సత్య మైనను గూడ
ఏడ్వదగిన దేది? యెచట గలదు ?
వికట లోకమందు – సుకుమార హాస్యమే
గుండె పండి నట్లు గొప్ప గుర్తు.

**క్షమ**

చదువు మీదిమెట్లు సంస్కృతి - సహనముల్ ;
చదువు క్రిందిమెట్లు చాల గలవు !
సంస్కృతికిని క్షమకు జనయిత్రి ఒకతెయే;
క్షమకు మీదిమెట్టు స్వర్గ మొకటే.

**కర్మ యోగము**

కష్టపడి - పని చేసిన - కరువు లేదు
కార్మికుడె దేశ భక్తుడౌ కర్మ యోగి,
పరమ పాపాత్ములెవరు - సోమరులు గాక ?
మంచివా రెవ్వ రుత్పత్తి పెంచువారె.

కోరదగి నట్టి స్థానాలు గొప్పవారు
గెంతి నిముషాలలోన ఎక్కినవి గావు !
రేల తోటివారలు నిదురించుచుండ
కష్టపడి తాము మేల్కొని ఘనత గొనిరి.

జగతి యెల్ల - మధుర సౌందర్యమయ మంచు
కనులు మూసి కలలు గంటి నేను !
కనులు విప్ప - తెలిసె కర్తవ్యములు చేయ
వాసయోగ్య మగును వసుధ యనుచు.

# ప్రగతి గీత

## పన్నీటి జల్లు



ఆదియె శిక్ష - సప్త శతి

సరస కవిత యన్న - సంగీత కళ యన్న,
వ్యంగ్య మన్న లలిత హాస్య మన్న:
అవని విముఖు లున్న అదియె వారికి శిక్ష !
రమ్య హాస లోల ! రామ కృష్ణ

అన్నదమ్ములు

ఆకసమ్ముతోడ అనుచుండు ధూమమ్ము
భూమితోడ పలుకు బూడదయును
అగ్నిదేవునకును అన్నదమ్ములమంచు
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**అపజయములు**

చూడు అపజయములు సోపానములు సుమ్ము
విజయ సౌధమునకు విశ్వమందు!
కండ పుష్టి లేదు - కసరత్తు లేకున్న
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**అప్పు**

అప్పు జేసి అతడు గొప్పగా వెలుగొందె ;
రాజు వోలె చివరి రోజు వరకు !
అసలు చెడినదెవరు? అప్పు లిచ్చినవారె !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**అభ్యర్థి**

ఓడి విశ్రమింపలేడు - గెల్చెడి దాక
ఎన్నికలకు నిల్చి ఎవ్వడైన !
నెగ్గి ఓడువరకు తగ్గబోడెవడైన !
రమ్య హాస లోల ! రామ కృష్ణ |

**ఆంధ్రు లు**

మింటి చుక్కల మిరుమిట్లతో వెల్గి

చివర తుస్సు మనును చిచ్చు బుడ్డి!

ఆంధ్రు లెల్ల వట్టి ఆరంభశూరులే !

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ఆంతర్యము**

కాడు - గాంధిగారు - కాంగ్రెసు సభ్యుండు!

క్రైస్తవుండు గాడు - క్రీస్తు ప్రభువు !

మార్క్సు - చాటె తాను "మార్క్సిస్టు" కానంచు

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ఆత్మ హత్య**

పండుకొనెను రైలు పట్టాల కడ్డమ్ము

ఆత్మహత్య కొరకు అతివ యొకతె ;

ఆమె యెట్టి కోక ఆపివేసెను రైలు:

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ఆదర్శదంపతులు**

చెవిటివాడు తెలిసి చేసి కొనెను పెండ్లి

గ్రుడ్డి దాని నొకతె కోరి కోరి :

అతడు ఆమె జగతి కాదర్శ దంపతుల్!

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ఆ ద ర్శ వ ధు వు**

అతడు వేచియుండె ఆదర్శ వధువుకై !

వధువు దొరకకున్న బ్రదికి పోవు :

దొరకె నేని వేరు నరక యాతనలేదు!

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ఆ మె**

ఆమె _ కాంతి జేత్రి! ఆమె మిధ్యామధ్య !
నేడు బయలుదేరి _ నిన్న చేరె !
మనసు చేరలేని మరొక ప్రపంచమ్ము
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ఆశ**

ఆశ యెగర గలదు ఆకాశ శిఖరిపై !
ఏటి వరద కెదురు ఈదగలదు !
ప్రాకగలదు నక్కి పాతాళ బిలమందు!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ఆస్తి**

ఎంతమంది చెమట! ఎందరి నెత్తురుల్ !
పిండకుండ ఎవడు పేర్చె ధనము ?
దొరలు చేయునట్టి దోపిడీయే ఆస్తి!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ఉరి శిక్ష**

తిరుగుబాటుదారు దేశ నాయకుడౌను ;
వేలకొలది చంపి విప్లవమున !
ఒకని చంపువాని కురిశిక్ష పడవచ్చు;
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ఎన్ని కలు**

దీన సేవ చేయు దేశభక్తు డొకండు
బక్క చిక్కు పేదవాని గాంచి ;
ఎన్ని కలకు ముందు ఎక్కెక్కి యేడ్చెరా !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ఒక మహాకవి**

కవిత మేటి ఎవరు? గాడిదా? గుర్రమా ?
నేటి సాహితీ ప్రణేతలందు ?
ఓండ్రు ఓండ్రు మనిన ఒక మహాకవి యండ్రు!
రమ్య హాసలోల ! రామ కృష్ణ !

**ఓటు వినియోగ ము**

అర్హుడోడిపోయి - అసమర్థుడో వాడె
ఎట్లు శాసనసభ కెన్ని కగును ?
ఓటుచేయమాను - ఉత్తమ ప్రజచేత !
రమ్య హాస లోల రామ కృష్ణ !

**ఓట్లుకొనుట**

ఓట్లు కొనెడివాడు - ఊరకే యిచ్చునా ?
దాచి పెట్టి నట్టి ధనము తెచ్చి !
అమ్మివేయగలడు అతడు దేశమ్మునే !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**క ట్న ము**

కట్న మిచ్చె మామగారు తొమ్మిది వేలు ;
భార్య వెంట దెచ్చె పాతకారు !
కట్న మెల్ల పట్టె కారు రిపేరికే!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**కవచము**

కానుపించనట్టి కవచమ్ము రీతిగా
మతము దాల్చదగును మానవుండు;
కానుపించరాదు కంచు కమ్మటు పైకి
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**కవి**

బ్రదికినన్ని నాళ్ళు ప్రతిరోజు చనిపోయి,
చచ్చిపోయి బ్రదుకు శాశ్వతముగ;
అతని కవి యందు రాంధ్ర దేశములోన!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**కసి**

కర్మకాలి నిన్ను - గాడిద తన్నిన
దాని నీవు తిరిగి తన్న నేల?
కసిని తీర్చుకొనుట - గాడిద మీదనా?
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**కుడి క న్ను**

కొన్ని నాళ్ళు తరచు కుడికన్ను అదరగా
వచ్చు గొప్ప మేలు వాని కనిరి!
వార మైన పిదప పక్షవాతము వచ్చె!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**కాంతాహృదయము**

కాంత హృదయ మెరుగ- కాంక్ష నీ కున్నచో
వినకు ఆమె పెదవి పెడలు మాట;
కవిత చెప్పు ఆమె కనుదోయి చూడరా!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**కుక్కతోక**

కవులు తత్త్వవేత్త లవతరించిరి వేలు;
మనిషి వక్రబుద్ధి మారలేదు!
కొంత కొంత వరకు కుక్క తోకయె మేలు !
రమ్య హాస లోల ! రామ కృష్ణ!

**కుడియెడమలు**

కుడి యటంచు వారు - ఎడమ యంచును వీరు
రాజకీయ మందు రభస యేల?
ముందు_ వెనుక-పైని-క్రింద లన్నవి లేవె!
రమ్య హాస లోల' రామ కృష్ణ!

**క్రొ త్త ద య్య ము**

కోరి కోరి క్రొత్త కొరివి దయ్యముతోడ
స్నేహ మెవడు చేయ సాహసించు?
పరిచయమ్ము గలుగు పాత దయ్యము మేలు!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**గ య్యా ళి ?**

పిడుగు ఉరుమియు వడగళ్ళ వానతో
సాటి యేది గలుగు జగతిలోన?
కలహకంఠియైన గయ్యాళియా? కాదు!
రమ్య హాస లోల! రామ కృష్ణ !

**చచ్చిపోవు హక్కు**

భరతదేశమందు బ్రదుకు హక్కున కేమి
అద్దె కొంపలోన! సద్దు లేక
చచ్చిపోవు హక్కు సాధింపరా! చాలు!
రమ్య హాస లోల! రామ కృష్ణ !

**చట్ట ము**

జడ్జిగారు - చట్ట సర్వజ్ఞు డనరాదు!
న్యాయవాది తెలియజేయవలెను!
చట్ట మెరుగ నంచు సామాన్యు డనరాదు!
రమ్య హాస లోల! రామ కృష్ణ!

**చంద్రలోకయాత్ర**

పితురులకయి నిల్పె పిరమిడ్ల నీజిప్టు!
తరుణి మోజు కట్టె తాజ మహలు !
చంద్రు నెక్కె- నేడు శాస్త్ర విజ్ఞానమ్ము;
రమ్య హాస లోల! రామ కృష్ణ!

**చేతలు**

పనులు చేయు నట్టి పద్ధతుల్ వివరింప
బూను నెపుడు చేతగానివాడు!
చేతనైనవాడు చేసి చూపుచు నుండు!
రమ్య హాస లోల! రామ కృష్ణ!

**జాలి**

ఆమె పేరు 'కరుణ!' అతిలోక సుకుమారి;
చెల్లె లోకతె యుండు చెంత నెపుడు!
జాలి'-ఆమె పేరు! - క్షయ రోగవతి ఆమె !
రమ్య హాస లో ! రామ కృష్ణ !

**టపాకాయ**

పెద్ద ధ్వనిని చేసి ప్రేలు టపాకాయ!
చిత్తు కాగితమ్ము చెదరిపోవ;
సభల ప్రేలవచ్చు సాహిత్య డింభకుల్ ;
రమ్య హాసలోల! రామకృష్ణ !

**డొక్కుకారు**

ఎక్కినారు — డబ్బు కక్కూర్తిచే వారు
ప్రక్క యింటివాని డొక్కుకారు!
కొనిరి ఊరుచేరి - క్రొత్త చెప్పుల జోడు!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**త త్వ మ సి**

శౌర్య సాహసములు- సార్వభౌములు జేసె
పెంచె _ దైవ సంఖ్య - పిరికితనము!
నిన్ను నీవు తెలియ - నీవె దేవుడ వయా!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

తుపాను

మగని తరిమివేసి - మరియొక మగనికై
చొరవ చేసి వెదకు తరుణి సాటి
పెను తుపాను వరద బీభత్సమా? కాదు!
రమ్య హాస లోల ! రామ కృష్ణ |

**తె లు గు ద న ము**

తెలుగువార లెపుడు ధిక్కార మొనరించి
పాతి పెట్టి నారు ప్రాతదనము?
తెలుగుదనము అనిన - తెనుగు మీరుట సుమ్ము;
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**తెరచాప**

తెగువతో సరంగు తెరచాప పైకెత్తి
తెడ్డు పట్టి కడలి కడ్డ పడును;
ఇంటి అరుగు దిగడు కుంటి సాకుల సామి?
రమ్య హాస లోల ! రామ కృష్ణ

**తెల్లజుట్టు**

తెల్ల జుట్టు తెలివితేటలు తెలుపునా ?
మళ్ళినట్టి వయసు మార్పు దెలుపు!
గుండె పండినట్టి గుర్తు చూడగ పేరు!
రమ్య హాసలోల ! రామ కృష్ణ !

**తెలుగు తెగులు**

పద్య గద్య గేయ వర్ష పాతము హెచ్చు!

తెలివి తెగులు తరచు తెలుగు నేల!

పదవి ప్రాకులాట భారీ పరిశ్రమే!

రమ్య హాస లోల! రామ కృష్ణ !

**తే నెమ న సు**

నీది తేనె మనసు - నిలు వెల్ల తేనెయే

తేనె గుండె నీది - ఐన వినుము;

చీమ లన్ని తినును - శీఘ్రంబుగా - నిన్ను!

రమ్య హాస లోల ! రామ కృష్ణ!

**తేజో వ ధ**

చంపు - శత్రువులను శౌర్యమే నీకున్న!

తెలివియున్న వాని తెగడ వలదు;

హత్య కంటె నీచ మరయ తేజోవధ;

రమ్య హాస లోల ! రామ కృష్ణ!

**త్రికసంధి**

ఒకడు రాజకీయు డొకడు మహాకవి

ఒకడు పిచ్చివాడు — త్రికము సుమ్ము;

తెలుగు దేశ మనిన త్రికసంధియే లెమ్ము!

రమ్య హాస లోల ! రామకృష్ణ!

**దయ్యాల కొంప**

మిత్రు లైన మేటి మేధావు వారు

సహకరించు చోటు స్వర్గ సీమ:

తగవులాడు చోటు దయ్యాల తిరునాళ్ళు!

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**దయ్యాల పెండ్లి**

తప్పు పట్ట నేల దయ్యాల పెండ్లిలో?
గాయకోత్తముండు _ గార్దభమ్ము!
వాడ కుక్క లెల్ల_బాజా భజంత్రీలు!
రమ్య హాస లోల! రామ కృష్ణ !

**దేవు డు**

తెలిసికొనిన దెవడు? దేవుని నిజముగా?
లేడు - చూచినట్టి వా డొకండు!
వాడుకొననివాడు లేడయా భగవంతు!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**నాయకుడు**

వెంటవెడల నేర్చి వేటాడు కుక్కతో
నవ్య రాజకీయ నాయకుండు!
పారిపోవ నేర్చు - చేరి కుందేటితో పాటు!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**నాల్గు వై పు లు**

కాచుకొనుము _ వెనుక - గార్దభం బైనచో |
కొంత భయము _ ముందు - కుక్క యున్న!
నమ్మరాదు _ నరుల _ నాల్గు వైపులయందు!
రమ్య హాస లోల | రామ కృష్ణ !

**ప ద వి**

ఈది చేరినాను గోదావరిని తేలు
పసిడి పడవ యనుచు – పదవి _ గాంచి;
పట్టుకొనెను _ పదవి - భల్లూకమై నన్ను!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ప రిపా ల న**

నాడు - కుక్కతోక నాడించుచుండెబో!
దొరలు ఏలుచుండ భరతభూమి;
నేడు - తోక - కుక్క నాడించుటకు పూనె!
రమ్య హాస లోల ! రామ కృష్ణ!

**ప రి వేషము**

శిరము చుట్టు వెలుగు పరివేష మొకసారి
సడలి-గళమువరకు జారి నపుడు;
తరచు బిగియవచ్చు ఉరిత్రాడుగా మారి!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**పాతకారు**

మారు మ్రోగ దెసలు - ఊరేగు రొద తోడ
బయలు వెడలె గొప్ప పాత కారు!
అందు- మ్రోగ దొక్క హారను మాత్రమే!
రమ్య హాస లోల రామ కృష్ణ!

**పిచ్చికుక్క**

పిచ్చి కుక్క అయిన పెను ప్రమాదము లేదు :
చంపివేయగలరు జనులు - బాధి,
ఎంత ముప్పు- మదపుటేన్గు కెత్తిన పిచ్చి?
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**పి డు గు**

మెరుపు తీగ-కనుల మిరుమిట్లు గల్పించు!
బెదరగొట్టు - గుండె లదర_ఉరుము!
కానరాని పిడుగు-కార్యంబు నెరవేర్చు |
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**పె ద్ద ప ద వు లు**

పెద్ద - పదవు లెల్ల పిరమిడ్ల వంటివి!

పోవు - పైకి ప్రాకి - పురుగు లైన;

వ్రాలగలవు పైన రాబందు లైనచో!

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**పేద గాడిద**

పెద్దమనిషి యొక్క- పేద గాడిద మోసె

కనుల ముందు వ్రేలు-గడ్డికొరకు

నోటి చొంగ కారె - నూరామడల మేర!

రమ్య హాస లోల! రామకృష్ణ!

**పూలతావి**

పేరనిమ్ము - ధనము- పేరాస పిసినారి;

కొనుత - ఘన యశస్సు-గొప్పవాడు!

నేటి పూల తావి - తోటమాలికి - చాలు;

రమ్య హాస లోల! రామ కృష్ణ!

**పై యెత్తు**

త్రాచు పాముతోడ - తలపడ వలయుచో!

ఏమి చేయగలదు_ఏనుగైన?

ప్రోత్సహించవలెను_ ఒక ముంగిసను పెంచి!

రమ్య హాస లోల! రామ కృష్ణ!

**ప్రక్కయిల్లు**

ప్రక్క యిల్లు తగులబడుచున్నచో చూచి

వేగ పోయి ఆర్పివేయకున్న,

తగులబడుట కద్దు - తరువాత తనయిల్లు

రమ్య హాస లోల! రామ కృష్ణ !

**ప్రజా స్వామ్యము**

ఎల కోరుకొనుట. ఈ ప్రజాస్వామ్యమ్ము?
దోసగు లిన్ని యున్న దొరతనము?
ఇంతకంటె చెడ్డ వితర రాజ్యాంగముల్!
రమ్య హాస లోల! రామ కృష్ణ !

**ప్రమిద**

లోక మెల్ల - చిమ్మ చీకటుల్ గ్రమ్మగా
వగవ వద్దు - ఒరుల తెగడ వద్దు;
పెదకి - 'ప్రమిద' - నొకటి వెలిగింపరా! చాలు!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**ప్రహసనము**

పెద్ద ప్రహసనమ్ము పృథ్విలోపల ఏది?
చదువు రాని శుంఠ పదవి వచ్చి:
గద్దె నెక్కి సభల గర్జించుచుండుటే;
రమ్య హాస లోల! రామ కృష్ణ !

**బుద్ధ విగ్ర హ ము**

ప్రతిభతోడ - గొప్ప పర్వతమ్మును దొల్చి
చెక్కె- బుద్ధు ప్రతిమ _ శిల్పివరుడు;
ప్రతిమ కిడిరి_జంతు బలులు - భక్తులు చేరి!
రమ్య హాస లోల ! రామ కృష్ణ!

**భ గ వ న్ను తి**

భక్త వరుడు కోరె - భగవంతు మెప్పింప
వేయి బిరుదు లిచ్చి - వేసి బలులు!
తలప దేవు డేమి తనకంటె నీచుడా ?
రమ్య హాస లోల ! రామకృష్ణ!

**భావ కవిత**

వ్రాసి నపుడు-తొలుత-పద్యాల అర్థమ్ము
తెలిసియుండె-కవికి- దేవునకును!
తెలియు నిప్పు డొక్క దేవుండు మాత్రమే!
రమ్య హాస లోల ! రామ కృష్ణ |

**భీష్మ ద్రోణు లు**

ఊరిలోన పెద్దలున్నార లెందరో!
ద్రోణ భీష్మ సములు దొడ్డవారు;
ఒక వికర్ణుడున్న-ఇక చాలు వెదకరా!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**మఠము**

అతడు సన్యసించి ఆలు బిడ్డల వీడె!
ధనము వీడె! శిష్యజనము వీడె!
మఠము వీడ లేక - మ్రగ్గె స్వాములవారు!
రమ్య హాస లోల ! రామ కృష్ణ!

**మతము**

ప్రశ్న నోరు నొక్కి భగవంతు బంధించి;
మతము - ప్రజల నేలె మత్తు జల్లి!
మతము-మరణ మొంద - మనుజుండు బ్రదుకురా!
రమ్య హాసలోల ! రామ కృష్ణ !

**మతము**

నల్లమందు మత్తు - తెల్లవారిన తీరు;
మత్తు - కొంత సేపె-మద్యమందు;
మతములోని మత్తు _ మరణించు వరకుండు!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**మతములు**

మిధ్య - మతము లన్ని - మేధావి దృష్టిలో;
తరచ-తాత్త్వికునకు తథ్య మన్ని!
లాభదాయకములు రాజకీయున కన్ని!
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**మ త్త గ జ ము**

కినిసి మత్త గజము - ఘీంకార మొనరింప
కందిరీగ చేరి కాటు వేసె!
ఎవ్వ రోడి నట్లు? ఎవరు గెల్చిన యట్లు?
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**మత్తు**

ఆడదాని కంటే అధికారమున కంటె !
ఎదకు పట్ట నట్టి చదువు కంటె !
మద్యపానమందు మత్తేమి లేదయా?
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**మ ధ్య వ య సు**

మధ్య వయసు మార్పు-మనిషి కెప్పుడు వచ్చు?
నల్ల జుట్టు సుంత తెల్లపడిన?
తెల్ల జుట్టు-తరచు-నల్లనౌ నప్పుడే !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**మనిషి**

ఎగురు మానవుండు - గగనాన విహగ మై;
గండు చేప రీతి కడలి నీదు;
పుడమి మనిషివోలె నడువ లే డేలకో !
రమ్య హాస లోల! రామకృష్ణ !

**మాతృమరణము**

మరణ మొందినపుడు - మాతృదేవిని గూడ
తగులబెట్టకుండ తప్పునయ్య ?
ప్రాతదనము క్రుళ్ళ - పాతి పెట్టుము వేగ ;
రమ్య హాస లోల ' రామ కృష్ణ !

**మానవ సృష్టి**

మూఢ మానవుండు ముక్కోటి దేవుళ్ల
సృష్టి చేసె కన్ను చెదరి పోవ!
సృష్టిచేయలేడు చిన్న చీమనుగూడ !
రమ్య హాస లోల ! రామకృష్ణ!

**యాచకుడు**

దూదికంటేకూడ - ఏది తేలిక చెప్పు ?
గాలి కాదు - పాద ధూళి గాదు!
యాచకుండు సుమ్ము - యావజ్జగత్తులో !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**రంగు రాళ్ళు**

అచట నచట దొరకు ఆంధ్ర దేశమునందు
సానబట్టనట్టి సహజ మణులు;
విరివి – రంగు రాళ్లు - విశ్వవిద్యాస్థలి !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**రంధ్రాన్వేష ణ**

దొడ్డవారిలోని దోషాలు గుర్తించి
తుష్టి చెందుచుండు దుర్జనుండు;
అల్ప మతికి అదియె ఆత్మ సంతృప్తియౌ !
రమ్య హాస లోల ! రామ కృష్ణ

**రాజకీయుడు**

రాళ్లు రువ్వినారు - రాజకీయుని పైన
వేల కొలది ప్రజలు వెక్కిరించి!
అత డిల్లు కట్టె .. ఆ రాళ్లనే పేర్చి !
రమ్య హాసలోల! రామ కృష్ణ!

**రూక విలువ**

పెండ్లిలోనగాని - పేకాటలోగాని
రూక కేమి విలువ లోకమందు ?
చాత చేతి రూక _ ద్రై వమ్ముతో సాటి;
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**లాభ ము**

శిరసు దూర్చినావు - సింహమ్ము నోటిలో !
తిరిగి క్షేమముగను తీసినావు |
కోర నేల ఇంక - వేరు లాభము నీవు ?
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**వ ధు వు**

వధువు - పెండ్లి ముందు పసిడి సిగ్గుల మొగ్గ !
వెంటనంటు నీడ పెండ్లినాడు !
పెండ్లి అయిన పిదప - పెనుభూతముగ మారు !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**వరుడు**

పసిడి పనస పండు - వరుడు - పెండ్లికి ముందు !
పెండ్లినాడు - ముదురు బెండకాయ
పెండ్లి అయిన పిదప - పెద్ద పాలేరయా !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**వాదోపవాదాలు**

చాటె నొకడు - పాత్ర - సగము శూన్య మటంచు

ఒకడు – సగము నీరె - ఉన్న దనియె !

తగవు - పెరిగి పెరిగి పగిలిపోయెను తలల్!

రమ్య హాస లోల ! రామ కృష్ణ

**వెదురు - వేణువు**

మనుజు లెల్ల - రక్త మాంసాల ముద్దలే !

అంతరాత్మ భేద మరయ దగును;

వెదురు ముక్క జూడు వేణువుం జూడరా !

రమ్య హాస లోల! రామకృష్ణ !

**వెనుకంజ**

పోరునపుడు కంటె - పారిపోయెడి వేళ

చచ్చిపోవవచ్చు హెచ్చు మంది !

వేయగూడ దెపుడు వెనుకంజ బ్రదుకులో

రమ్య హాస లోల! రామ కృష్ణ!

**వేపకాయ**

కవిత చదువ లేడు !- కవిత వ్రాయగ లేడు

వేప కాయ యంత పెర్రి లేక ! ర్రి

దివిని భువికి దింప - కవి వరేణ్యుల కలల్

రమ్య హాస లోల! రామ కృష్ణ !

**వింత**

వింత లెన్ని గలవు - విశ్వమ్ములో చూడ !

వింతలందు గొప్ప వింత యేది?

మనిషికంటె వింత - మరిలేదు సృష్టిలో !

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**విగ్రహారాధన**

ధరణిమీద నిలిపి సరిహద్దు చిహ్నాలు
మట్టి తొలిచి - దేశమాత అనుట
పెట్టివారు చేయు - విగ్రహారాధనే !
'రమ్య హాస లోల! రామ కృష్ణ!

**విజ్ఞానశాస్త్రము**

వివిధ దేశ జనుల - విజ్ఞాన శాస్త్రమ్ము
దరికి చేర్చి ఇరుగు పొరుగు చేసె !
సోదరులుగ చేయలేదు నెయ్యము పెంచి
రమ్య హాస లోల ! రామ కృష్ణ!

**విప్లవ కవి**

పేదవానిమీద విప్లవ కవి వ్రాసె
గుండె కరిగి పోపు గొప్ప కవిత !
వచ్చె కవికి - పదవి - చచ్చిపోయెను - పేద !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**విరోధాభాస**

తల్లి రత్నగర్భ! తనయుండు నిరుపేద !
భాష్ప ధార గార్చు - భరత మాత !
ఎంత వింత యైన దీ విరోధాభాస !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**విషము**

చెడు గుణాలు కీర్తి చెంది మించగ వచ్చు
అదనుబట్టి అవని అప్పుడపుడు !
విషము మందటంచు వినుతి కెక్కుట లేదె !
రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**విష య సంకలనము**

విషయ సంకలనము విజ్ఞానమా? కాదు !

ఇటుక ఆము పేరు ! ఇల్లు పేరు !

అస్థి పంజరమ్ము - అసలు దేహము కాదు ;

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**వేడి**

వెన్న కరుగు సుంత వేడి సోకిన చాలు !

ఎంత వేడి వలయు ఇనుము కరుగ?

మనిషి కరుగు వేడి మారు - గుండెనుబట్టి ;

రమ్య హాస లోల! రామకృష్ణ!

**షష్టిపూర్తి**

పాతి కేండ్ల వయసు పడుచు గాడిదకంటె

పరుగునందు - బ్రదుకు పందె మందు;

షష్టి పూర్తి అయిన - జవనాశ్వమే మేలు!

రమ్య హాస లోల! రామ కృష్ణ!

**సంఘ సంస్కరణము**

సంస్కరింపనేల సంఘ మంతయు నీవు?

సజ్జనుండ వగుము స్వార్థ ముడిగి !

ఒక్క నీచు డపుడు _ ఉర్విలోపల తగ్గు;

రమ్య హాస లోల! రామ కృష్ణ!

**సింహ వాహనము**

సింహ వాహనమ్ము చేకూర్చుకొన్నచో !

అడవి నేలవచ్చు హడలఁగొట్టి;

దిగిన యెడల'- చంపి తినివేయు సింహమ్ము !

రమ్య హాన లోల! రామ కృష్ణ !

**సత్ప్రవర్తన**

మంచి నడవడికను మించు ప్రార్థన లేదు ;

తపము వలదు కొంగ జపము వలదు ;

ఎంచ దేవు డేమి లంచమ్ము పట్టునా ?

రమ్య హాసలోల ! రామ కృష్ణ !

**సత్యం శివం సుందరం**

"సత్యమే శివమ్ము" - సత్యమే రమ్యమ్ము "

"సత్య మీశ్వరుండు" - సత్యమైన ;

నేడు దేవుడనెడి వాడు దేవుడు కాడు !

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**సద్యః ఫ ల ము**

ప్రముఖ వర్తకుండు - రాత్రి కాపరి గోరి,

పత్రికలకు ఇచ్చె - ప్రకటనలను ;

దోచి రతని ఇల్లు - దొంగ లా రాత్రియే ;

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**సన్న్యా సము**

ఇల్లు వదల నేల ? ఇల్లాలి విడ నేల ?

గడ్డ మేల? కావి గుడ్డ లేల?

మంచి పొరు డౌచు - మనుజుండు మసలుచో

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**సాను భూతి**

చెడు దినాలకోర్చి -చేవ తగ్గక యుండు

మంచి వాని కన్న మహితు డెవరు ?

అట్టి వాని నరసి ఆదరించెడి వాడె ;

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**సూదిచాలు**

సూది చాలు ! ఏల సుత్తులు కొడవళ్ళు ?

కాలి ముల్లు దీయ కత్తులేల?

ముల్లు మాటటుంచి మోకాలు పోవచ్చు!.

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**సూర్యుడు**

అస్తమించు సూర్యు డడిగె దర్పమ్ముతో

"ఎవ్వ రింక వెలుగు ఇచ్చెద" రని !

“ఓపినంతవరకు – ఉన్నానని " - ప్రమిద !

రమ్య హాస లోల ! రామ కృష్ణ!

**సెలవలు**

ఎచట సెలవ రోజు లెచ్చుగా నుండునో

నాశ మందు అట్టి దేశ మెపుడు !

పతన మందె - రోము - పండుగల్ మితిమీరి !

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**స్వాతంత్ర్య భారమితి**

శాంతి భద్రతలును-స్వాతంత్ర్యమును స్వేచ్ఛ

దేశమందు ఉన్న తెలియు నెట్లు?

లంచగొండితనము-మంచి సూచిక సుమ్ము! -

రమ్య హాస లోల ! రామ కృష్ణ!

**స్వే చ్ఛ**

ఏ వ్యవస్థలోన - ఏ సమాజములోన

స్వేచ్ఛ కోరువాడు చేరెనేని,

తన మనస్సు నచట తాకట్టు పెట్టుటే !

రమ్య హాస లోల ! రామ కృష్ణ !

**స్వేచ్ఛ**

స్వేచ్ఛ కొరకు -ఎన్ని జీవాలు బలియయ్యె

పొరలి పొంగి రక్తఝరులు పారి!

కలి యుగాన-భద్రకాళి యయ్యెను స్వేచ్ఛ!

రమ్య హాస లోల! రామ కృష్ణ!

**హ ర్ష ము**

హర్ష మిడవు - పంచ వర్ష ప్రణాళికల్

దేశ సేవకునకు తృప్తి గూర్చి!

తగిన గొప్ప పదవి తనకు రాకున్నచో !!

రమ్య హాస లోల! రామ కృష్ణ !

**పన్నీటి జల్లు**

ఈ గులాబి కేల_ ఈ పాడు ముళ్ళంచు
విశ్వశిల్పి నొకడు వెక్కిరించు!
పూచెనంచు_ముళ్ళ పొదకు మేలి గులాబి
ప్రస్తుతించు నొకడు-పరవశించి!

నిలిపినాడ-మెరుపు నిలువు టద్దము పట్టి,
ప్రతిఫలించి - ఈ ప్రపంచ మెల్ల
నీవు తొంగిచూచి నిజరూప మగపింప;
విసుకు కొనకు_ఎవరి కసురు కొనకు.

దిద్దుకొనుట మేలు_ అద్ద మున్నది ముందు
జుట్టుగాని కట్టు బట్ట గాని;
వేష భాష గాని వేదాంతమే గాని
అటమటించు అంతరాత్మ గాని!

అన్ని అభిరుచులకు అనువైన టోపీలు!
ఎంచుకొనుము కోపగించు కొనక;
కొలత కొలిచినట్లు—కుదిరి మట్టసముగా
పట్టినపుడు-తలకు- పెట్టు కొనుము.

ప్రతిగీత-హాస్య రసికాను మోదమ్ము ;
విశ్వ మానవతకు వేగు జుక్క
భరత వాక్య మగుత- ప్రాచీన సరణికి;
నవ నవాభిరుచికి-నాంది-యగుత.

# ప్ర గ తి గీ త

## భరతవాక్యము

పెరుగు అమ్మ నట్టి- సెబజాణ అరుదెంచె;
కడవ చంక బెట్టి-గజ్జె కట్టి!
మించుబోడి_తరచి - మేధావులకు పెట్టు
పెరుగు నుండి తీసి 'వెన్నెపూస'!

మెరపు తీగ త్రాడు-మిరుమిట్ల కవ్వంబు!
పెరుగు గాదు! కవిత నురుగు గాదు!
హాస్య రసము తోడ_అమృతమ్ము కురియగా
రాజ యోగు లగుడు_రసికు లార!